PRGI No: APTEL/26/A6182

# ప్రజా కలం
# PRAJA KALAM

| సంపుటి: 01, | సంచిక: 01, | గుంటూరు | ఆదివారం,జూలై 26, 2026 | పేజీలు : 12, | వెల : 3/- |
|---|---|---|---|---|---|
| VOLUME:1 | ISSUE: 1 | Guntur | Sunday, 26 july, 2026 | PAGES : 12 | RS: 3.00 |


# ప్రజాస్వరం మరింత విస్తృతం

## ఇక ఆంధ్రప్రదేశ్‌లోనూ ప్రజాకలం

పత్రిక అనేది కేవలం వార్తలను అందించే సాధనం మాత్రమే కాదు. ప్రజల గొంతుకగా, సమాజానికి దిక్సూచిగా, ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా నిలవాల్సిన బాధ్యతను కూడా మోస్తుంది. అదే లక్ష్యంతో ప్రారంభమైన ప్రజా కలం తెలుగు దినపత్రిక గత 17 సంవత్సరాలుగా తెలంగాణ వ్యాప్తంగా ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకుంటూ విజయ వంతంగా తన ప్రయాణాన్ని కొనసాగిస్తోంది.

ఈ ప్రయాణంలో ప్రజల సమస్యలను నిర్భయంగా వెలుగులోకి తీసుకురావడం, అధికారుల దృష్టికి చేర్చడం, ప్రజాప్రతినిధుల స్పందనను కోరడం, సమస్యల పరిష్కారానికి వేదికగా నిలవడం ప్రజా కలం తెలుగు దినపత్రిక తన ప్రధాన కర్తవ్యంగా భావించింది. సామాన్యుడి కన్నీటి వెనుక ఉన్న నిజాన్ని వెలికితీయడం నుంచి సమాజ ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై నిర్మాణాత్మక చర్చకు అవకాశం కల్పించడం వరకు ప్రజా కలం తన బాధ్యతను నిర్వర్తించింది.

ఈ సేవలను గుర్తించి ప్రజలు అందించిన ఆదరణ, ప్రజాప్రతినిధులు, అధికారులు వ్యక్తం చేసిన ప్రశంసలు మా బాధ్యతను మరింత పెంచాయి. అదే విశ్వాసం, అదే నిబద్ధతతో ఇప్పుడు మరో ముందడుగు వేస్తున్నాం.

నేటి నుంచి ప్రజా కలం తెలుగు దినపత్రిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా గుంటూరు కేంద్రంగా తన ప్రచురణను ప్రారంభిస్తోంది. ఇది కేవలం భౌగోళిక విస్తరణ మాత్రమే కాదు... ప్రజల పట్ల మా బాధ్యత మరింత విస్తరించిన సందర్భం.

ఇకపై తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్ లోని ప్రజల సమస్యలు, అభివృద్ధి అంశాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, రైతు, కార్మికుడు, విద్యార్థి, మహిళ, యువత ఎదుర్కొంటున్న సమస్యలు, సామాజిక అంశాలు, ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన ప్రతి విషయాన్ని నిష్పాక్షికంగా ప్రజల ముందుకు తీసుకువస్తాం. ప్రజల గొంతుకగా నిలిచి, సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి మా వంతు కృషిని నిరంతరం కొనసాగిస్తాం.

సత్యం, నిష్పాక్షికత, ప్రజాహితం అనే విలువలే ప్రజా కలం బలం. ఈ విలువలను ఎన్నటికీ విడిచిపెట్టకుండా, వార్తల్లో విశ్వసనీయతను కాపాడుతూ, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం మా ధ్యేయం. తెలంగాణలో ప్రజా కలానికి మీరు అందించిన ప్రేమ, ఆదరణ, ఆశీర్వాదం మాకు శక్తినిచ్చాయి. అదే ఆప్యాయత, అదే ప్రోత్సాహాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రజలు కూడా అందిస్తారని హృదయపూర్వకంగా ఆశిస్తున్నాం.



కలకొండ రామకృష్ణ
సంపాదకులు
ప్రజా కలం తెలుగు దినపత్రిక

**ప్రజల సమస్యలే మా అజెండా... ప్రజల అభిప్రాయాలే మా బలం... ప్రజా ప్రయోజనాలే మా లక్ష్యం... మీ విశ్వాసమే మా విజయానికి పునాది.**



ప్రధాన్ రాజీనామా

# విద్యార్థుల విజయం

## మోదీ సర్కార్‌కు ఇది మేల్కొలుపు
## ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ

న్యూఢిల్లీ, జూలై 25 (ప్రజా కలం ప్రతినిధి)

మన విద్యా వ్యవస్థ ఎంతో గొప్పదని ప్రపంచమంతా పేరున్నా.. కొన్నే ళ్లుగా అది దాడు లకు గురవుతోందని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. రాష్ట్రీ య స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) దొడ్డిదారిన చొరబడి విద్యా వ్యవస్థను చెరబట్టి నాశనం చేస్తున్నదని ఆయన ధ్వజమెత్తారు. ఇందులో ప్రధాని మోదీ తప్పు ఎంత ఉందో ఆర్ఎస్ఎస్ పాత్ర కూడా అంతే ఉందని రాహుల్ ఆరోపించారు. దేశంలో నిరుద్యోగం పెరగడంతో యువత ఆగ్రహంతో ఉందని, విద్యావ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాలని కోరుకుంటుందన్నారు.

తరువాయి 2వ పేజీలో...

నీట్ పేపర్ లీక్‌పై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

# రాజీనామా

## లేఖను ఎక్స్‌లో ప్రధాని మోదీకి పంపిన ధర్మేంద్ర ప్రధాన్



- యువత ఆశయాలు, భావోద్వేగాలు, ఆకాంక్షలను గౌరవిస్తానని వెల్లడి
- రాజీనామా లేఖకు రాష్ట్రపతి ముర్ము ఆమోదం
- విద్యాశాఖ బాధ్యతలు ప్రహ్లాద్ జోషీకి

న్యూఢిల్లీ, జూలై 25 (ప్రజా కలం ప్రతినిధి)

నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై కాక్రోచ్ జన తా పార్టీ (సీజేపీ) నాయకత్వంలో వేలాదిమంది విద్యార్థులు చేపట్టిన భారీ నిరసనల నేపథ్యంలో, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ శనివారం మధ్యాహ్నం తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను ఆయన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఇది తనకు వ్యక్తిగత ప్రతిష్టకు సంబంధించిన విషయం కాదని ప్రధాన్ పేర్కొన్నారు. సీజేపీ ప్రతినిధులు కేంద్ర మంత్రులు జితేంద్రసింగ్, జేపీ నడ్డాతో మరో విడత చర్చలు జరపడానికి అరగంట ముందే ప్రధాన్ రాజీనామా చేశారు. ప్రధాన్ రాజీనామాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించారు. దీంతో ప్రస్తుతం పునరుత్పాదక ఇంధన వనరుల శాఖ మంత్రిగా ఉన్న ప్రహ్లోద్ జోషీకి విద్యాశాఖ మంత్రిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రధాని మోదీ సూచనల మేరకు రాష్ట్రపతి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ధర్మేంద్ర ప్రధాన్ తన రాజీనామాకు గల కారణాలను వివరణాత్మక లేఖలో పేర్కొన్నారు.

తరువాయి 2వ పేజీలో...

పొగాకు సంక్షోభంపై

# కేంద్రం దృష్టి

## - శాశ్వత పరిష్కారానికి సీఎం చంద్రబాబు పట్టు

- పొగాకు రైతుల సమస్యలపై రంగంలోకి దిగిన కేంద్ర ప్రభుత్వం
- తాత్కాలిక ఉపశమనం కాదు, శాశ్వత పరిష్కారం కావాలన్న సీఎం
- రైతులను ఆదుకునేందుకు కేంద్ర బృందం మూడు ప్రతిపాదనలు
- బయ్యర్లతో కేంద్ర మంత్రి పెమ్మసాని చర్చలు.. సోమవారం మరోసారి సమావేశం




అమరావతి జూలై 25 (ప్రజా కలం ప్రతినిధి)

రాష్ట్రంలోని పొగాకు రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు జరిపిన నిరంతర సంప్రదింపుల ఫలితంగా కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ ఉన్నతస్థాయి బృందాన్ని రాష్ట్రానికి పంపింది. శనివారం కర్నూలు జిల్లా పర్యటనకు బయలుదేరే ముందు ముఖ్యమంత్రి చంద్రబాబుతో కేంద్ర వాణిజ్య శాఖ అదనపు కార్యదర్శి నితిన్ కుమార్ యాదవ్, డైరెక్టర్ మౌనికా గౌర్ భేటీ అయ్యారు.

తరువాయి 2వ పేజీలో...

# ప్రజల మధ్యే నా పరిపాలన



- ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌కు 'సంజీవని' శ్రీకారం
- ఆగస్టు నుంచి రాష్ట్రవ్యాప్తంగా సంజీవని.. అమలు
- ప్రజారోగ్యానికి కొత్త దిశ
- ప్రతి కుటుంబానికి డిజిటల్ ఆరోగ్య భద్రత..
- సంజీవనితో వైద్య విప్లవం
- ఆరోగ్యం నుంచి అభివృద్ధి వరకు..
- ఆస్పరి వేదికగా సీఎం కీలక ప్రకటనలు

కర్నూల్ జూలై 25 (ప్రజా కలం ప్రతినిధి)

సీఎం అంటే సచివాలయంలో ఉండే చీఫ్ మినిస్టర్ కాదు... ప్రజలతో మమేకమయ్యే కామన్ మ్యాన్ అని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. శనివారం కర్నూలు జిల్లాలోని ఆస్పరిలో 'సంజీవని' ఆరోగ్య కార్యక్రమంను ప్రారంభించిన ముఖ్యమంత్రి.. స్వయం సహాయ సంఘాల మహిళలకు రూ.197 కోట్ల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ..


తరువాయి 2వ పేజీలో...

అన్నారం దర్గాలో

ప్రజా కలం ప్రత్యేకం..

# భారీ కుంభకోణం

## అవినీతి అక్రమార్కుడికే మళ్లీ తలనీలాల టెండర్!



2

- రెండు సంవత్సరాల క్రితం రూ.60 లక్షల విలువైన తలనీలాలు మాయం..
- కలెక్టర్, వక్ఫ్ బోర్డు విచారణ నివేదికలను బేకాతర్ చేసిన అధికారులు..
- బహిరంగ వేలం లేకుండా గుట్టుచప్పుడు కాకుండా మూడేళ్ల టెండర్ కరారు..
- ఉన్నతాధికారులు, ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు స్పందించాలని ప్రజల డిమాండ్

VOLUME:1 ISSUE: 1
సంపుటి : 1 సంచిక : 1
ప్రజా కలం PRAJA KALAM
ఆదివారం,జూలై 26, 2026
Sunday, 26 july, 2026

## నీట్ పేపర్ లీక్‌పై కేంద్ర విద్యాశాఖ మంత్రి

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా

మొదటి పేజీ తరువాయి...

'నేను నాలుగు దశాబ్దాల కుపైగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యా సంస్కరణల కోసం అంకితభావంతో పనిచేస్తున్నాను.. బలమైన, సమ్మిళితమైన దూరదృష్టి గల విద్యా వ్యవస్థే ఒక బలమైన దేశానికి పునాది అని నేను ఎల్లప్పుడూ నమ్ముతాను.. దేశ యువత ఆకాంక్షలు, భావాలు, న్యాయమైన అంచనాలను నేను ఎల్లప్పుడూ గౌరవిస్తాను. దేశంలో యువతరం కలలను నెరవేర్చడం మనందరి రాజకీయ, సామాజిక జీవిత నైతిక సంకల్పం.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో దేశానికి సేవ చేసే అవకాశం కల్పించినందుకు నేను వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.. 2026 మే 3న నిర్వహించిన నీట్-యూజీ పరీక్షలో అవకతవకలు బయటపడ్డాయి.. భారత ప్రభు త్వం వెంటనే దీనిని సుమోటోగా స్వీకరించి, దర్యాప్తును సీబీఐకి నీట్ యూజీ ఫలితాలు సంతృప్తికరంగా ఉన్నాయి. పేద కుటుంబ నేపథ్యాల నుంచి వచ్చిన అనేక ప్రతిభావంతులైన విద్యార్థులు కూడా విజయం సాధించారు. కానీ ఈ సమయంలో కూడా, బాధ్యతాయుతమైన పదవు ల్లో ఉన్నవారు

చాలా మంది విద్యార్థులను తప్పుదోవ పట్టించడానికి అడ్డంకులు సృష్టించడానికి ప్రయత్నించారు. ఇది నన్ను చాలా బాధపెట్టింది' అని ప్రధాన్ తెలిపారు. 'మన ప్రజాస్వామ్యంపై నాకు ఎల్లప్పుడూ అచంచలమైన నమ్మకం ఉంది.. యువత ఆకాం క్షలు, కలలు, అంచనాలను నేను ఎల్లప్పుడూ గౌరవిస్తాను. వారు దేశ భవిష్యత్తు మాత్రమే కాదు, నవ, వికసిత భారత్ నిర్మాతలు.. భవిష్యత్ శిల్పులు కూడా.. గత 10రోజుల నుంచి జరుగుతున్న పరిణామాలు చూసి నా మన సు బాధించింది.. ఇది నా వ్యక్తిగత ప్రతిష్టకు సంబంధించిన విష యం కాదు. యువశక్తే ఈ దేశానికి అసలైన బలం.. యువశక్తిని గందరగోళం అనే కుట్ర లో చిక్కుకోనివ్వం.. ఇదే నా సంకల్పం' అని అన్నారు.

**మోదీకి కృతజ్ఞతలు..** 'జంతర్ మంతర్ వద్ద, దేశంలో నెలకొన్న ఈ పరిస్థితిని దేశవ్యతిరేక శక్తులు సద్వినియోగం చేసుకోకుండా, దేశ ఐక్యత నిలిచి ఉండేలా, భారత్‌లోని ఒక్క విద్యార్థి భవిష్యత్తు కూడా చట్టపరమైన చిక్కుల్లో పడకుండా, మన పిల్లలు చదువుపై సమయాన్ని వెచ్చించి కెరీర్‌ను నిర్మించుకోవడంపై దృష్టి పెట్టాలనే ఆలోచనతో నేను నా రాజీనామా లేఖను గౌరవనీయ ప్రధానమంత్రి మోదీకి పంపాను' అని ప్రధాన్ చెప్పారు. మోదీ మా ర్గదర్శకత్వం, విశ్వాసం, నిరంతర సహకారానికి నేను హృదయపూర్వక కృతజ్ఞతలు తె లుపుతున్నాను. అలాగే, క్యాబినెట్‌లోని సహచరులు, మంత్రిత్వ శాఖల అధికారులు, ఉ ద్యోగులు, నాతో కలిసి పనిచేసే భాగ్యం ల భించిన వారందరికీ నా కృతజ్ఞతలు. దేశసేవ నా జీవితంలో అత్యున్నత ప్రాధాన్యత. దీనికోసం నేను ఎల్లప్పుడూ అంకితభావంతో ఉంటా.. జగన్నాథస్వామి ఆశీస్సులతో భవిష్యత్‌లో భారత్‌మాత, ఒడిశా ప్రజలు, దేశ యువత ఆకాంక్షల నెరవేర్చడానికి నన్ను నేను సాధ్యమైన రీతిలో మలుచుకుంటాను' అని ప్రధాన్ తన లేఖలో పేర్కొన్నారు.

**నా దీక్ష స్వచ్ఛమైనది: వాంగ్‌చుక్**

తాను చేసిన దీక్ష స్వచ్ఛమైందని నిరూపించుకునేందుకు ధృవపత్రం (సర్టిఫికెట్) అవసరం లేదని అని పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ అన్నారు. వాంగ్‌చుక్ కేంద్రమంత్రుల సమక్షంలో దీక్ష విరమించిన నేపథ్యంలో డీల్ కుదిరిందంటూ పలువురు విమర్శించడంపై వాంగ్‌చుక్ ఖండిస్తూ, ఆగ్రహం వ్యక్తం చేస్తూ శనివారం ఓ వీడియోను సామాజిక మాధ్యమం వేదికగా విడుదల చేశారు. దీక్ష విరమించినప్పటి నుంచి తనకు అనేక మంది ఫోన్ చేశారని, పలు సందేహాలను వ్యక్తం చేశారని అన్నారు. బేరాలు కుదుర్చుకోవాల్సి వస్తే ఎవరైనా 26 రోజులపాటు తమ ప్రాణాలను ఫణం గా పెట్టి ఆమరణ నిరాహార దీక్ష చేస్తారా? అని ప్రశ్నించారు. ఏసీ గదిలో కూర్చొని డీల్ చేసుకోలేనా? అని కౌంటర్ ఇచ్చారు. విద్యాశాఖమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనేది ముఖ్యమైన విషయమేనని, అదే సమయంలో చట్టపరమైన చర్యలు తీసుకోకుండా నిరోధించడమే తనకు అ త్యంత ప్రాధాన్యతా అంశమన్నారు. అం దుకే కేంద్రంతో చర్చల సమయంలో రాజీనామా గురించి డిమాండ్ చేయలేదన్నారు. ప్రజలు, విద్యార్థులు ఆగ్రహంతో ఉన్నప్పుడు రాజీనామా అంశం తేల్చకుండా కేంద్రం ఎక్కువకాలం నాన్చలేదన్నారు. మంత్రి రాజీనామా చేస్తారని తనకు ముం దే తెలుసన్నారు. సఫ్దర్ జంగ్ ఆసుపత్రి తనకు జైలులా అనిపించిందని, ఖైదీ కంటే తీవ్రంగా పరిగణించారని, బోలెడు ఆంక్ష లు విధించారని, దీంతో కనీసం గది నుం చి బయటికి కూడా రాలేక, ఎవరినీ కలవలేకపోయానన్నారు. తన భార్య గీతాంజలి పిటిషన్‌తో మేదాంత ఆసుపత్రికి తరలించారని అన్నారు.

## అన్నారం దర్గాలో

ప్రజా కలం ప్రత్యేకం..

# భారీ కుంభకోణం

## అవినీతి అక్రమార్కుడికే మళ్లీ తలనీలాల టెండర్!

(వరంగల్/పర్వతగిరి)జూలై 25, ప్రజాకలం ప్రతినిధి: వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం అన్నారం గ్రామంలోని ప్రముఖ ముస్లిం పుణ్యక్షేత్రం హజరత్ యాకూబ్ షా వలి బాబా దర్గాలో భారీ అవినీతి అక్రమాలు వెలుగుచూశాయి. గత రెండేళ్ల క్రితం నుండి సుమారు 60 లక్షల రూపాయల విలువైన భక్తుల తలనీలాలను గుట్టుచప్పుడు కాకుండా మాయం చేసి అమ్ముకున్న వ్యక్తికే, రాష్ట్ర వక్ఫ్ బోర్డు అధికారులు తిరిగి మూడేళ్ల పాటు టెండర్‌ను దారాదత్తం చేయడం స్థానికంగా తీవ్ర దుమారం రేపుతోంది.



**కలెక్టర్ విచారణను సైతం పక్కనబెట్టి..!**

నిబంధనల ప్రకారం దర్గా తలనీలాల సేకరణ టెండర్‌ను హైదరాబాద్‌లోని వక్ఫ్ బోర్డు కార్యాలయం ద్వారా బహిరంగ వేలం వేసి కేటాయించాల్సి ఉంటుంది. అయితే గత రెండు సంవత్సరాలుగా అన్నారం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఎలాంటి అధికారిక టెండర్ లేకుండానే దర్గాలోని తలనీలాలను సేకరించి, సుమారు రూ. 60 లక్షల ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టాడు. ఈ అక్రమాలపై వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశాల మేరకు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి విచారణ చేపట్టారు. దర్గాలో భారీగా అవినీతి, అక్రమాలు జరిగినట్లు నిర్ధారిస్తూ కలెక్టర్ రాష్ట్ర వక్ఫ్ బోర్డుకు నివేదిక కూడా పంపారు. అంతేకాకుండా, జిల్లా వక్ఫ్ బోర్డు ఇన్స్పెక్టర్ రియాజ్, దర్గా సూపరింటెండెంట్ ముంతాజ్ హుస్సేన్‌లు సైతం సదరు వ్యక్తి రెండేళ్ల పాటు అక్రమంగా తలనీలాలను తరలించినట్లు రాతపూర్వకంగా రాష్ట్ర వక్ఫ్ బోర్డు సీఈఓకు నివేదించారు. ఇంతటి స్పష్టమైన ఆధారాలు, నివేదికలు ఉన్నప్పటికీ ఉన్నతాధికారులు సదరు అక్రమార్కుడిపై చర్యలు తీసుకోకపోగా, అతనికే వత్తాసు పలకడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**గుట్టుగా మూడేళ్ల టెండర్ కరారు.!**

అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అదే వ్యక్తికి ఈ ఏడాది (2026) నుండి మరో మూడు సంవత్సరాల పాటు తలనీలాల టెండర్‌ను కట్టబెట్టడం వెనుక పెద్ద ఎత్తున ముడుపులు చేతులు మారాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బహిరంగ వేలం నిర్వహించకుండా, నిబంధనలకు విరుద్ధంగా గుట్టుచప్పుడు కాకుండా టెండర్ పత్రాలు రాసివ్వడంపై మైనారిటీ వర్గాలు మండిపడుతున్నాయి. కొందరు స్వార్థపరులైన అధికారుల మూలంగా వక్ఫ్ బోర్డు ప్రతిష్ట పూర్తిగా మసకబారుతోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**తక్షణమే టెండర్ రద్దు చేయాలి: గ్రామస్తుల డిమాండ్**

ఈ అక్రమ టెండర్ వ్యవహారంపై వరంగల్ జిల్లా కలెక్టర్, వక్ఫ్ బోర్డు చైర్మన్, సీఈఓ, స్థానిక వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు తక్షణమే స్పందించాలని ముస్లిం మైనారిటీ నాయకులు, అన్నారం గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. గత రెండేళ్లుగా సదరు వ్యక్తి దర్గా నుండి మాయం చేసిన రూ. 60 లక్షల సొమ్మును రికవరీ చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా కట్టబెట్టిన నూతన టెండర్‌ను రద్దు చేసి, వెంటనే పారదర్శకంగా బహిరంగ వేలం నిర్వహించాలని వారు కోరుతున్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# పొగాకు సంక్షోభంపై కేంద్రం దృష్టి

మొదటి పేజీ తరువాయి...

ఈ కీలక సమావేశంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డీబీవీ స్వామి, వ్యవసాయ, మార్క్‌ఫెడ్ ఉన్నతాధికారులు, టొబాకో బోర్డు ప్రతినిధులు పాల్గొన్నారు. పొగాకు రైతులను ఆదుకునేందుకు రూపొందించిన మూడు కీలక ప్రతిపాదనలపై కేంద్ర బృందం సీఎంతో చర్చించింది. వడ్డీ లేని వర్కింగ్ క్యాపిటల్ రుణాలు, ప్రోత్సాహకాలు, ధర లోటు భర్తీ వంటి అంశాలు ఈ ప్రతిపాదనల్లో ఉన్నాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, ఏ నిర్ణయం తీసుకున్నా రైతుల ప్రయోజనాలకే పెద్దపీట వేయాలని స్పష్టం చేశారు. ఏటా ఇదే సమస్య పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం కనుగొనాలని సూచించారు. "తాత్కాలిక ఉపశమన చర్యలతో సరిపెట్టకుండా, స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక వ్యూహాలతో ఒక సమగ్ర విధానాన్ని రూపొందించాలి. రైతులు, బయ్యర్లు, టొబాకో బోర్డు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు.. అందరి సమష్టి బాధ్యతతోనే ఇది సాధ్యం" అని ఆయన అభిప్రాయపడ్డారు. పంటను నిల్వ ఉంచుకుని ధరలు స్థిరపడ్డాక అమ్ముకునే అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. చర్చలను ముందుకు తీసుకెళ్లి, పరిష్కారం కనుగొనాలని కేంద్ర మంత్రి పెమ్మసానికి సూచించారు. సీఎం సూచనల మేరకు, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, కేంద్ర ప్రభుత్వ అధికారులతో కలిసి పొగాకు బయ్యర్లతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వాలు సిద్ధంగా ఉన్నాయని, బయ్యర్లు కూడా సహకరించాలని కోరారు. తదుపరి చర్చల కోసం సోమవారం మరోసారి సమావేశం కావాలని నిర్ణయించారు. ఈ భేటీలో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు పాల్గొని రైతుల కష్టాలను కేంద్ర ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు.

# ప్రధాన్ రాజీనామా విద్యార్థుల విజయం

మొదటి పేజీ తరువాయి...

శనివారం సాయంత్రం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల విజయంగా పేర్కొన్నారు. ఢిల్లీలో ఆందోళన చేస్తున్న విద్యార్థులపై హింస, పెల్లెట్‌గన్‌ల ప్రయోగం వంటి ఘటనలు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదేశంతోనే జరిగాయని, అందుకు ఆయనే బాధ్యులని ఆరోపించారు. దేశ భవిష్యత్తు గా ఉన్న విద్యార్థులపై మన బలగాలే కాల్పులు జరపడాన్ని అంగీకరించబోమని రాహుల్ తేల్చిచెప్పారు. విద్యార్థులపై అణిచివేతపై, అమిత్ షా వైఖరిని పార్లమెంటులో ప్రశ్నిస్తామని తెలిపారు.

ప్రధాన్ రాజీనా మా.. అవినీతికి, విద్యా వ్యవస్థ విధ్వంసానికి ప్రతీక అని, ఆయన తప్పుకోవడం మం చిదేనన్నారు. విద్యార్థుల డిమాండ్లు ఇంకా పూర్తిగా నెరవేరలేదన్నారు. విద్యార్థులపై దాడిచేసిన వ్యక్తులు, అమలుచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రధాని మోదీ విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. 'ఇది భారత విద్యార్థుల నుంచి, ప్రతిపక్షం నుంచి వస్తున్న వార్నింగ్. ఇప్పటి వర కు మీరు దేశాన్ని నడిపిన తీరులోనే ఇకపై నడపలేరు. ఇది మీ వ్యక్తిగత అంశం కాదు.

ఇది మీ సొంత ఆస్తి కాదు. ఈ దేశం భారత ప్రజలది. భారత రాజ్యాంగానిది' అని స్పష్టం చేశారు. నీట్ పేపర్ లీక్‌ను నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులకు రాహుల్ అభినందనలు తెలిపారు. వారికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. విద్యా ర్థుల విజయం మోదీ సర్కార్‌కు మేలుకొలుపు అని, భారతీయ విద్యా వ్యవస్థను మెరుగుపరిచేం దుకు ఇకనైనా నిర్దిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

పరీక్షల వ్యవస్థలో మా ర్పులు చేస్తూ తీసుకొచ్చే బిల్లులపై విపక్షాలతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. దేశంలో ఉద్యోగాల సృష్టి, విద్యా వ్యవస్థ, సంస్థలు, మీడియా వ్యవస్థలు దెబ్బతిన్నా యని ఆరోపించారు. దీనివల్ల ఆర్థిక సంక్షోభం తలెత్తుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

**తప్పు చేస్తే తలవంచాల్సిందే**
**- ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే**

విద్యా వ్యవస్థను సరిదిద్దడం కోసం దేశవ్యాప్తంగా లక్షలాది మంది యువత ధైర్యంగా పోరాడారు. నీట్ పరీక్ష నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం వైఫల్యం చెందింది. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఎన్నో కుటుంబాలు తమ పిల్లలను కోల్పోయాయి. యువత తరఫున ప్రతిపక్షాలు పార్లమెంట్ అధికార పక్షాన్ని ప్రశ్నించి విజయం సా ధించాయి. ఏ ప్రభుత్వమైనా తప్పు జరిగితే ప్రజల ముందు తలవంచాల్సిందే.

# ప్రజల మధ్యే నా పరిపాలన




మొదటి పేజీ తరువాయి...

ప్రజలతో నిత్యం మమేకమవడమే తన పరిపాలనా తత్వమని, ప్రజారోగ్యాన్ని ప్రభుత్వ బాధ్యతగా స్వీకరిస్తూ ఆగస్టు నుంచి రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. సంజీవని కార్యక్రమంలో భాగంగా కర్నూలు జిల్లా ఆలూరు లోని ఆస్పరికి చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంత్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, జిల్లా అధికారులు ముందుగా ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వయం సహాయ సంఘాల మహిళలకు రూ.197 కోట్ల చెక్కును అందజేసి బహిరంగ సభలో ప్రసంగించారు.

**'ప్రజల మధ్యే ఉంటేనే ఉత్సాహం'**

సీఎం అంటే సచివాలయంలో ఉండే చీఫ్ మినిస్టర్ మాత్రమే కాదని, ప్రజలతో మమేకమయ్యే కామన్ మ్యాన్ అనే భావనతో పనిచేస్తున్నానని చంద్రబాబు చెప్పారు. ప్రజల మధ్య ఉంటేనే ఉత్సాహంగా ఉంటానని, ప్రతి నెల నాలుగు కార్యక్రమాల ద్వారా ప్రజలను నేరుగా కలుస్తున్నానని తెలిపారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వారి భవిష్యత్తు కోసం ప్రజా విధానాలను రూపొందిస్తున్నామని పేర్కొన్నారు.

**ఆగస్టు నుంచి రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని'**

ప్రజారోగ్యాన్ని ప్రభుత్వ బాధ్యతగా తీసుకునే లక్ష్యంతో సంజీవని ప్రాజెక్టును తీసుకొచ్చామని సీఎం తెలిపారు. ప్రతి కుటుంబం విద్య, వైద్యం కోసం అధికంగా ఖర్చు చేయాల్సిన పరిస్థితిని తగ్గించడమే లక్ష్యమన్నారు. ఆగస్టు నుంచి రాష్ట్రవ్యాప్తంగా సంజీవని అమలు చేస్తామని ప్రకటించారు. ఆరోగ్యవంతమైన కుటుంబం, ఆరోగ్యవంతమైన గ్రామం, ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

**డిజిటల్ హెల్త్ ప్రొఫైల్‌తో సమగ్ర వైద్య సేవలు**

ప్రిడిక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్ విధానాలతో ప్రజారోగ్యాన్ని కాపాడే వ్యవస్థే సంజీవని అని చంద్రబాబు వివరించారు. ప్రతి వ్యక్తి ఆరోగ్య ప్రొఫైల్‌ను నమోదు చేసి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి రాష్ట్రస్థాయి వరకు డేటాను అనుసంధానం చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో 80 లక్షల మంది తీవ్ర వ్యాధులతో బాధపడుతున్నట్లు నివేదికలు సూచిస్తున్నాయని, ముందస్తు గుర్తింపు, నివారణ, చికిత్సపై ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు.

**ఏఐ, టెలీమెడిసిన్‌తో ఆధునిక ఆరోగ్య వ్యవస్థ**

ప్రతి కుటుంబ సభ్యుడికి ఆభా హెల్త్ ఐడీ, హెల్త్ ఎక్స్ యాప్ అందుబాటులోకి తీసుకొస్తున్నామని తెలిపారు. నాన్ కమ్యూనికబుల్ వ్యాధులు, ఆర్‌సీహెచ్, ఆర్‌బీఎస్‌కే, 108, 104 సేవలు, స్క్రీనింగ్ పరీక్షలు, ఈ-ఔషధి, ల్యాబ్ సేవలను ఒకే డిజిటల్ వేదికపైకి తీసుకొస్తామని చెప్పారు. భవిష్యత్తులో ఏఐ డాక్టర్ సపోర్ట్, టెలీమెడిసిన్, రిమోట్ కేర్, ప్రిడిక్టివ్ అనలిటిక్స్ సేవలు అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు.

**ఆరోగ్యంపై ప్రజల్లో చైతన్యం అవసరం**

ప్రభుత్వం కార్యక్రమాలు అమలు చేయడమే కాకుండా ప్రజల్లో ఆరోగ్య చైతన్యం కూడా పెరగాలని సీఎం సూచించారు. మంచి ఆహారపు అలవాట్లు, యోగా, ధ్యానం, వ్యాయామం, ఆరోగ్యకరమైన జీవనశైలి అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు.

**సంక్షేమ పథకాలపై సీఎం వివరణ**

ప్రతి నెల మొదటి తేదీన పెన్షన్లు అందిస్తున్నామని, అన్నదాత సుఖీభవ ద్వారా రైతులకు రూ.20 వేల ఆర్థిక సాయం అందించామని తెలిపారు. తల్లికి వందనం, స్త్రీశక్తి, దీపం-2.0, సౌర విద్యుత్ వంటి పథకాల ద్వారా ప్రజలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని వివరించారు.

**భూ రికార్డులకు బ్లాక్‌చైన్ భద్రత**

రీసర్వే ప్రక్రియను బ్లాక్‌చైన్ సాంకేతికతతో చేపడుతున్నామని, ప్రతి నెల 9వ తేదీన పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. వచ్చే ఏడాది మార్చి నాటికి రీసర్వే పూర్తి చేసి ప్రజల ఆస్తులకు పూర్తి భద్రత కల్పిస్తామని చెప్పారు.

**సాగునీరు--పారిశ్రామిక అభివృద్ధిపై హామీలు**

ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయని పేర్కొన్న సీఎం, జలధార కార్యక్రమం ద్వారా భూగర్భ జలాల పెంపునకు చర్యలు చేపట్టామని తెలిపారు. వేదవతి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంను రూ.1,768 కోట్లతో పూర్తి చేసి ఈ ప్రాంతానికి సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. మూడు సంవత్సరాల్లో 36 సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తామని చెప్పారు.

**రాయలసీమకు భారీ పెట్టుబడులు**

రూ.1 లక్ష కోట్ల ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడులతో రాయలసీమను పారిశ్రామిక, ఉద్యాన హబ్‌గా తీర్చిదిద్దుతామని తెలిపారు. 2028 నాటికి కడప స్టీల్ పరిశ్రమలో ఉత్పత్తి ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని, హీరో మోటార్స్, ఎల్‌జీ, దాల్మియా వంటి అంతర్జాతీయ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్నాయని చెప్పారు. కర్నూలు--బళ్లారి రైల్వే లైన్‌కు కేంద్రం ముందుకు రావడం సంతోషకరమన్నారు.

**గత పాలనపై విమర్శలు.. సంజీవనిపై విశ్వాసం**

గత ప్రభుత్వం వ్యవస్థలను ధ్వంసం చేసిందని, సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయలేదని, ఉద్యోగాలు కల్పించలేదని



చంద్రబాబు విమర్శించారు. ప్రజా ప్రభుత్వం వెనుకబడిన వర్గాల అభ్యున్నతికే ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు.

సంజీవని ద్వారా ప్రతి పౌరుడి ఆరోగ్యం వారి చేతుల్లోనే ఉంటుందని, దీనిని సమర్థంగా వినియోగించుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సంజీవని కార్యక్రమానికి హాజరైన మంత్రులు సత్యకుమార్ యాదవ్, నిమ్మల రామానాయుడు, టీజీ భరత్ తదితరులున్నారు.



# గుడివాడలో కైకాల సత్యనారాయణ 91వ జయంతి వేడుకలు

## -నివాళులర్పించిన పద్మశ్రీ మురళీమోహన్,ఎమ్మెల్యే రాము





గుడివాడ, (ప్రజా కలం ప్రతినిధి) జులై 25 : తెలుగు సినీ రంగంలో అన్ని పాత్రలకు జీవం పోసిన ఆల్ రౌండర్ లాంటి నటుడు స్వర్గీయ కైకాల సత్యనారాయణ అని మాజీ పార్లమెంట్ సభ్యుడు పద్మశ్రీ మాగంటి మురళీమోహన్ కొనియాడారు. కైకాల పుట్టిన గుడివాడ గడ్డపై ఆయన జయంతి వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని మురళీమోహన్ హర్షం వ్యక్తం చేశారు.నవ నట సార్వభౌముడు స్వర్గీయ కైకాల సత్యనారాయణ 91వ జయంతి వేడుకలు గుడివాడ కాపు సేవా సమితి మరియు పట్టణ కళాకారుల శనివారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో మాజీ పార్లమెంట్ సభ్యుడు, పద్మశ్రీ మాగంటి మురళీమోహన్, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పాల్గొన్నారు.ఓల్డ్ మున్సిపల్ కార్యాలయ సెంటర్లో గల కైకాల సత్యనారాయణ విగ్రహానికి మురళీమోహన్, ఎమ్మెల్యే రాము మరియు కూటమి నాయకులు పూలమాలలతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జోహార్ కైకాల అంటూ మురళీమోహన్ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సేవాసమితి పెద్దలు,కళాకారులు , మరియు గుడివాడ టిడిపి అధ్యక్షుడు పంద్రాజు సాంబయ్య మురళీమోహన్ కు గౌరవ సన్మానం చేశారు.అనంతరం మురళీమోహన్ మీడియాతో మాట్లాడుతూ పవిత్రమైన తొలి ఏకాదశి రోజు గుడివాడకు రావడం, తనకు ఎంతో ఆప్తుడైన కైకాల సత్యనారాయణకు నివాళి అర్పించడం ఎంతో సంతోషంగా ఉ ందని తెలిపారు. కైకాలతో తనకు కుటుంబ బంధాలు, స్నేహ సంబంధాలు ఉన్నాయని పేర్కొన్నారు. కైకాల తాత, తన తాత కౌతవరంలో మంచి స్నేహితులని గుర్తుచేశారు. షూటింగ్ లేని సమయంలో కైకాలతో తాను అనేకసార్లు కలుసుకునేవాడినని చెప్పారు.సినీ రంగంలో బాగా రాణిస్తున్నావని అభినందిస్తూ కైకాల తనకు మూడు ముఖ్యమైన సూత్రాలు నేర్పారని వివరించారు. షూటింగ్ సమయంలో వేషాలు లేక వచ్చే సీనియర్ నటులను గౌరవించి, మర్యాద చేయాలని,షూటింగ్ విరామ సమయంలో విహారయాత్రలకు వెళ్లకుండా, ప్రొడ్యూసర్లకు టచ్ లో ఉ ండి డబ్బింగ్ ఉందా, షూటింగ్ ప్యాచ్ వర్క్ ఉందా అని అడగాలని చెప్పారని తెలిపారు. మూడవ సూత్రం డబ్బు ఇస్తే గానీ షూటింగ్ కు రాను అని ప్రొడ్యూసర్ తో ఎప్పుడూ అనవద్దని కైకాల హితవు పలికారని పేర్కొన్నారు. కొందరు ప్రొడ్యూసర్లు భార్య మెడలో పుస్తెలు అమ్మి మరీ సినిమాలు తీస్తారని, అలాంటి వారిని గౌరవించాలని కైకాల తనకు చెప్పారని గుర్తుచేశారు. ఎన్నో సినిమాల్లో కలిసి నటించిన కైకాల తనకు ఎంతో మంచి మిత్రుడని, ఆయన పుట్టిన గుడివాడలో నేడు ఆయన విగ్రహానికి నివాళులర్పించుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. చివరి దశలో అనారోగ్యంతో ఉన్నప్పుడు కైకాలను కలిసినప్పుడు ఆయన పేరుపేరునా ప్రతి ఒక్కరి గురించి అడిగారని నాటి రోజులను గుర్తుచేసుకున్నారు. అన్న ఎన్టీఆర్ అంటే తనకు, కైకాలకు ఎన్నలేని ప్రేమ ఉండేదని పేర్కొన్నారు. అన్ని పాత్రలకు జీవం పోసిన కైకాల ఆల్రౌండర్ లాంటి నటుడని, యముడు పాత్ర పేటెంట్ కైకాలదే అని మురళీమోహన్ కొనియాడారు.ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ కైకాల సత్యనారాయణ లాంటి మహానటుడు గుడివాడ గడ్డపై పుట్టడం మాకు గర్వకారణమని అన్నారు. ఆయన సేవలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని ఎమ్మెల్యే రాము కోరారు.జయంతి వేడుకల్లో మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, స్వర్గీయ కైకాల సత్యనారాయణ జయంతి సభలో పాల్గొన్న ముఖ్యులు. ప్రభాకర నాట్యమండలి ప్రధాన కార్యదర్శి మట్టా రాజా, చార్లీ చాప్లిన్ కామెడి క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు నరహరిశెట్టి ప్రసాద్, కార్యదర్శి వంగా శ్రీనివాస్,(వంశీ), కాపు సేవా సమితి వ్యవస్థాపకులు పొన్నూరు రామకృష్ణ, సేవా సమితి కార్యదర్శి ఆత్మూరి మల్లేశ్వరరావు, మాజీ అధ్యక్షులు సుంకర గాంధీ,సనకా సుబ్బారావు, కె.వి రమణారావు,టిడిపి నాయకులు పిన్నమనేని బాబ్జి, పంద్రాజు సాంబయ్య,లింగం ప్రసాద్, చేకూరు జగన్మోహన్రావు, పైడిముక్కల వంశీ, సయ్యద్ గఫార్, జనసేన నాయకులు సాయన రాజేష్,పేర్ని జగన్, పలువురు కూటమి నాయకులు , కళాకారులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి : బోడే వెంకట్ రామ్



పెనమలూరు, జులై 25 (ప్రజా కలం ప్రతినిధి): పర్యావరణ పరిరక్షణలో భాగంగా పెనమలూరు నియోజకవర్గం కంకిపాడు మండలం పునాదిపాడు గ్రామ సెంటర్లో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో పెనమలూరు నియోజకవర్గ యువ నాయకులు శ్రీ బోడే వెంకట్ రామ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మొక్కలు నాటి మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు పచ్చని, పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. చెట్ల పెంపకం ద్వారా కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు ప్రకృతి సమతుల్యతను కాపాడవచ్చని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు, పార్టీ కార్యకర్తలు, స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు, గ్రామస్థులు పాల్గొని మొక్కలు నాటారు. ఈ విషయాన్ని పెనమలూరు నియోజకవర్గ ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి రావెళ్ల వరుణకుమార్ తెలిపారు.

# నగరవనం పనులు వచ్చే నెలలో ప్రారంభం

## -ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్



జగ్గయ్యపేట, జులై 25 : (ప్రజా కలం ప్రతినిధి)జగ్గయ్యపేట మండలం, వేదాద్రి రోడ్డులో జయంతి పురం సమీపంలోని ఫారెస్ట్ భూమిలో సెంట్రల్ ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ నగరవనం మంజూరు చేసినట్లు స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) తెలిపారు. జయంతిపురం సమీపంలో 50 హెక్టార్లలో ఈ నగరవనం ఏర్పాటు కానుందని ఆయన వివరించారు. ఈ నగరవనంలో భాగంగా వివిధ రకాల వృక్షజాతులతో పాటు, ప్రజలు వాకింగ్ చేసేందుకు వాకింగ్ ట్రాక్, సైక్లింగ్ చేసేందుకు ప్రత్యేక సైక్లింగ్ ట్రాక్ ఏర్పాటు చేయనున్నారు. చిన్నారుల కోసం వివిధ రకాల ఆట వస్తువులు, పిల్లలకు ఇష్టమైన యంత్రాలతో పాటు ఓపెన్ జిమ్ కూడా అందుబాటులోకి రానుంది. నగరవనం ప్రవేశ ద్వారం వద్ద అటవీ వాతావరణం ప్రతిబింబించేలా స్వాగత ఆర్చ్‌ను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. జగ్గయ్యపేట ప్రాంతంలో సహజంగా కనిపించే పక్షులు, జంతువులను కూడా ఇందులో పొందుపరచనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలందరికీ అన్ని విధాలుగా ఉపయోగపడేలా ఈ నగరవనాన్ని తీర్చిదిద్దుతున్నామని, వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తామని ఆయన వెల్లడించారు. జగ్గయ్యపేట నియోజకవర్గానికి నగరవనం మంజూరు చేయించినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మరియు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజర్ శ్రీనివాసులు రెడ్డి, తెదేపా నాయకులు బండ్ల జాన్ ప్రకాష్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ఇస్లావత్ శీను నాయక్, ఫారెస్ట్ ఆఫీసర్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

# విజయవాడ చిల్డ్రన్స్ స్కూల్ ట్యుటోరియల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అకాడమిక్ పోటీలు




ఇబ్రహీంపట్నం జులై 25 (ప్రజా కలం ప్రతినిధి) విజయవాడ చిల్డ్రన్స్ స్కూల్ ట్యుటోరియల్ అసోసియేషన్ కొండపల్లి డివిజన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక నాగార్జున హైస్కూలులో అకాడమిక్ పోటీలు నిర్వహించారు. బేబీ జూనియర్స్, సబ్ జూనియర్స్, జూనియర్స్ సీనియర్స్ విభాగాలలో చిత్ర లేఖనము, రైమ్స్, వ్యాసరచన, దేశభక్తి గీతాలు, నీతి పద్యాలు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు చైర్మన్ గా కైలాప్రసాద్ పాల్గొన్నారు. ఈ పోటీలలో 15 పాఠశాలల నుంచి 180 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. బహుమతి ప్రధాన సభలో గౌరవ అధ్యక్షులు దేవినేని కిషోర్ కుమార్ మాట్లాడుతూ ఇటువంటి పోటీలు పిల్లలలో సృజనాత్మకతను, పోటీ తత్వాన్ని పెంచుతాయని, నిరంతరము శ్రమ ప్రయత్నము ఏనాటికైనా విజేతలను చేస్తుందన్నారు. డివిజన్ ప్రెసిడెంట్ పీకే సాంబశివరావు, సెక్రటరీ ఎస్ వి ఎస్ ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ చదువుతోపాటు విద్యార్థులు మానసిక ఉల్లాసానికి ఎగ్స్ట్రా ఎక్స్ట్రా కర్యులర్ కార్యక్రమాలు దోహదం చేస్తాయని ఇటువంటి పోటీలు తరచుగా నిర్వహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కొండపల్లి డివిజన్ ప్రైవేట్ విద్యాసంస్థల నిర్వాహకులు ఎస్కే సర్దార్ సాహెబ్, వి మురళీమోహన్, ఎస్ వి ఎస్ ఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్లకు కలెక్టర్ కీలక సూచన -- జూలై 31న ముసాయిదా జాబితా



మచిలీపట్నం, జులై 25 (ప్రజా కలం ప్రతినిధి) కృష్ణా జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) తొలి దశ పూర్తయిందని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి తెలిపారు. జిల్లాలో 15.43 లక్షల ఓటర్లలో 14.05 లక్షల ఎన్యూమరేషన్ ఫారాలు అందాయని చెప్పారు. జూలై 31న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల కానుండగా, పేరు లేకపోయినా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఫారం-6 ద్వారా పేరును చేర్చుకునే అవకాశం ఉందన్నారు. ఆగస్టు 30 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరించి, అన్ని పరిశీలనల అనంతరం అక్టోబర్ 3న తుది ఓటర్ల జాబితా ప్రచురించనున్నట్లు వెల్లడించారు.

# విలువైన నిత్యావసరాల పంపిణీ




పెడన, జులై 25 (ప్రజా కలం ప్రతినిధి): ప్రముఖ వ్యాపారవేత్త, సేవాభిలాషి యర్రా శ్రీనివాస్ జన్మదినాన్ని పురస్కరించుకుని నిరుపేద చేనేత కుటుంబాలకు నిత్యావసర వస్తువులు, మందుల కొనుగోలుకు నగదు అందజేశారు. పెడన మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు పేరిశెట్టి నాగరవి ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. పెడన పట్టణంలోని 23వ వార్డుకు చెందిన సిరిసిల్ల శ్రీనివాస్, కప్పలదొడ్డికి చెందిన పెదపల్లి పెదమందులు, బళ్ళ మల్లికార్జునరావు, ఉక్కెం భ్రమరాంబ, భండారు సుబ్రహ్మణ్యం తదితర ఐదు చేనేత, అనుబంధ కళాకారుల కుటుంబాలకు సుమారు రూ.15,000 విలువైన నిత్యావసర వస్తువులు మరియు మందుల కోసం నగదు అందజేశారు. నెలరోజులకు సరిపడా విధంగా ఈ సహాయాన్ని అందించినట్లు నాగరవి తెలిపారు. ఈ సందర్భంగా నాగరవి మాట్లాడుతూ, దాత యర్రా శ్రీనివాస్ ఎప్పుడూ నిరుపేదలకు అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాల్లో ముందుంటారని కొనియాడారు. అందజేసిన నిత్యావసర వస్తువులను సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. అవసరమైన వారికి ఇలాంటి సహాయ సహకారాలు నిరంతరం అందించాలని శ్రీనివాస్‌ను కోరుతూ చేనేత కళాకారులు, లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పేరిశెట్టి నాగరవి, బూసం సాయిబాబు, బళ్ళ నాగేశ్వరరావు, ఉమ్మిటి శాస్త్రి, ఉమ్మిటి బాలకోటయ్య, మేడక శ్రీనివాస్ తదితరులు, చేనేత కళాకారులు పాల్గొన్నారు

# మీకోసం కార్యక్రమం నిర్వహణ

మార్కాపురం, జులై 25 (ప్రజా కలం ప్రతినిధి) ప్రకాశం జిల్లా కనిగిరి పోలీస్ స్టేషన్ కార్యాలయ ఆవరణలో ఈ నెల 27వ తేదీ (సోమవారం) ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం(మీకోసం) నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ శ్రీ వి. హర్షవర్ధన్ రాజు, ఐపీఎస్., గారు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు నిర్వహించబడుతుందన్నారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో స్పష్టంగా రాసి అందజేయాలని సూచించారు.

ప్రజా కలం

ఆదివారం, జూలై 26, 2026

# కాంగ్రెస్ పార్టీకి నీట్ బూస్ట్

జాతీయస్థాయిలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం వస్తుందా అన్న చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. నీట్ పేపర్ లీకేజీ ఉదంతంపై విద్యార్థులు చేపట్టిన ఆందోళనలు, ఢిల్లీలో జరిగిన లాఠీచార్జిని నిరసిస్తూ లోక్‌సభలో విపక్ష నేత (ఎల్ఓపీ) రాహుల్ గాంధీ చేపట్టిన మెరుపు ధర్నా దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇదే సమయంలో పలు రాష్ట్రాల్లో కాంగ్రెస్ కార్యాలయాలపై జరిగిన దాడులు ఆ పార్టీకి రాజకీయంగా సానుభూతిని తెచ్చిపెడుతున్నాయనే విశ్లేషణలు వెలువడుతున్నాయి. ఈ పరిణామాలు జాతీయ రాజకీయాల్లో కాంగ్రెస్ పునరుజ్జీవ ప్రయత్నాలకు ఊతమిస్తాయా అన్న కోణంపైనా విస్తృత చర్చ జరుగుతోంది దేశాన్ని సుదీర్ఘకాలం పాలించిన గ్రాండ్ ఓల్డ్ పార్టీ కాంగ్రెస్. అయితే ఇదంతా గతం, ఇప్పుడు పరిస్థితి వేరు. గతం ఒక ఘన చరిత్ర అన్నట్లుగానే కొన్నాళ్లుగా కాంగ్రెస్ పరిస్థితి తయారైంది. అయితే ఇప్పుడు పరిస్థితులు కుదటపడుతున్న వాతావరణం కనిపిస్తోందని విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి. 2014లో కేంద్రంలో అధికారం కోల్పోయి, ఆ తర్వాత వరుసగా జరిగిన రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో వైఫల్యంతో కాంగ్రెస్ పార్టీ కుదేలైంది. 2014, 2019 సార్వత్రిక ఎన్నికల్లో కనీస ప్రతిపక్ష హోదా కూడా దక్కించుకోలేకపోయింది. అయితే గత పార్లమెంటు ఎన్నికల్లో 99 సీట్లతో ప్రతిపక్షంగా నిరూపించుకున్న కాంగ్రెస్ ఇప్పుడు అధికార ఎన్డీఏ, మరీ ముఖ్యంగా బీజేపీపై వెన్నుచూపని పోరాటం చేస్తుండటం హాట్ టాపిక్ అవుతోంది. లోక్ సభలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ ఇప్పుడు సరికొత్త పంథాతో రాజకీయం చేస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. జాతీయ పార్టీగా ఇండియా కూటమికి నాయకత్వం వహిస్తున్న కాంగ్రెస్ మిగిలిన విపక్షాలను కలుపుకుని పోవడంలో గతం కంటే మెరుగైన విధంగా పనిచేస్తోందని అంటున్నారు. కాకపోతే ఆయా పార్టీలు స్థానిక పరిస్థితులు, అంతర్గత కారణాలతో నిర్లిప్తంగా మారుతున్నా, ఆయా ప్రాంతీయ పార్టీల అగ్ర నాయకత్వానికి కాంగ్రెస్ అండగా నిలుస్తూ తనను తాను మలుచుకుంటున్న తీరు ఆకట్టుకుంటోందని అంటున్నారు. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపడంలోనూ కాంగ్రెస్ దూకుడుగా వ్యవహరిస్తోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రధాని మోదీ ఇంటి ముందు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాను ఇందుకు తాజా ఉదాహరణగా చూపుతున్నారు. వారసత్వంగా కాంగ్రెస్ పగ్గాలు చేపట్టిన రాహుల్.. ఆ పార్టీకి పునరుజ్జీవం తేవడానికి ఎంతో ప్రయత్నిస్తున్నారు. అయితే వరుసగా మూడు ఎన్నికల్లో ఆయన వైఫల్యం చెందినా నాయకుడిగా ఇప్పుడిప్పుడు తనను తాను నిరూపించుకుంటున్నారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రధానంగా 2024 ఎన్నికల ముందు నుంచి రాహుల్ తీరులో మార్పు వచ్చిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. భారత్ జోడో యాత్ర ద్వారా పాదయాత్ర చేసి ప్రజలకు దగ్గరయ్యేలా ప్రయత్నాలు చేసిన రాహుల్ ఇప్పుడు దేశం ఏం కోరుకుంటుందన్న విషయమై అవగాహన పెంచుకున్నారని అంటున్నారు. దీంతో సమయానుకూలంగా స్పందిస్తూ కాంగ్రెస్ పార్టీని చక్కదిద్దేలా చురుగ్గా అడుగులు వేస్తున్నారని చెబుతున్నారు ప్రస్తుతం నీట్ పేపర్ లీక్ వ్యవహారం జాతీయస్థాయిలో కుదిపేస్తుండగా, ఈ విషయంలో కాంగ్రెస్ ఎంటర్ అయిన తీరుతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయిందనే అంచనాలు వెలువడుతున్నాయి. ఈ విషయమై సుదీర్ఘ పోరాటం జరుగుతుండగా, ఈ నెల 20న నిర్వహించిన పార్లమెంట్ మార్చ్ పరిస్థితిని ఒక్కసారిగా మార్చేసిందని అంటున్నారు. ఆ రోజు కేంద్ర బలగాలు విద్యార్థులపై లాఠీచార్జి చేయడాన్ని నిరసిస్తూ రాహుల్ గాంధీ చేసిన మెరుపు ధర్నా దేశవ్యాప్తంగా విస్తృత చర్చకు దారితీసింది. అంతేకాకుండా 21న రాహుల్ తోపాటు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, జాతీయ నేతలు కూడా కేంద్రంపై ఒత్తిడి చేసేలా ఆందోళనలు చేయడం, ఈ విషయంలో బీజేపీ కూడా ఒక అడుగు వెనక్కి తగ్గినట్లు సంకేతాలు ఇవ్వడం కాంగ్రెస్ పార్టీకి సానుకూలంగా మారిందనే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. మొత్తానికి తాజా పరిణామాలు కాంగ్రెస్ పార్టీకి బూస్ట్ ఇచ్చినట్లుగా చెబుతున్నారు మరో వైపు ట్ ప్రశ్నాపత్రం లీక్‌కు వ్యతిరేకంగా దేశ రాజధాని ఢిల్లీలో విద్యార్థులు కొనసాగిస్తున్న ఆందోళనలపై బీజేపీ సీనియర్ నేత మురళీ మనోహర్ జోషి స్పందించారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన యువత కొన్ని రోజులుగా ఢిల్లీ వీధుల్లో నిరసనలు కొనసాగించడం చాలా బాధకరమని ఆయన అన్నారు. పరీక్షలపై వారి ఆందోళనలు, సమస్యలు నిజమైనవని, సానుభూతితో పరిష్కరించాలని ఆయన సూచించారు. దీనిని బలప్రయోగం ద్వారా అణచివేసే శాంతిభద్రతల సమస్యగా చూడరని తాను ఆశిస్తున్నానని కేంద్ర ప్రభుత్వానికి చురకలంటించారు. ఇటువంటి చర్యలు వికసిత్ భారత్ లక్ష్యానికి అనేక వర్గాలను దూరం చేస్తుందని ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా స్పందించారు. 'దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన యువ విద్యార్థులు కొన్ని రోజులుగా న్యూఢిల్లీ రోడ్లపై పడిగాపులు కాయడం తీవ్ర బాధాకరం... పరీక్షల వ్యవస్థలపై వారి ఆందోళనలు, భయాలు సమస్యలు నిజమైనవి... వాటికి సానుభూతితో, దీర్ఘకాలిక పరిష్కారాలతో బదులివ్వాలి... దీనిని కేవలం బలప్రయోగం ద్వారా అణచివేసే శాంతిభద్రతల సమస్యగా మాత్రమే చూడరని నేను మనస్ఫూర్తిగా ఆశిస్తున్నాను.. నిరసనలు తెలుపుతున్న మహిళలు, యువతులపై క్రూరంగా వ్యవహరించడం నన్ను తీవ్రంగా కలచివేసింది... ఇలాంటి బలప్రయోగం దేశాన్ని 'వికసిత్ భారత్‌గా' తీర్చిదిద్దాలనే జాతీయ లక్ష్యం నుంచి అనేక వర్గాలను దూరం చేస్తుంది" అని మురళీ మనోహర్ జోషీ కేంద్రంపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు.

# గ్రేటర్ ఎన్నికలకు కోర్టు మోకాలడ్డు




హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సన్నాహాల్లో మునిగి తేలుతున్న అధికార కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలంగాణ ఉన్నత న్యాయస్థానం ఊహించని షాక్ ఇచ్చింది. జీహెచ్ఎంసీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలపై హైకోర్టు తాత్కాలిక స్టే విధించడంతో అధికార వర్గాల్లో ఒక్కసారిగా కలకలం రేగింది. వార్డుల పునర్విభజన ప్రక్రియను చట్టబద్ధమైన నిబంధనల ప్రకారం పూర్తి చేసి, సరిహద్దులను శాస్త్రీయ పద్ధతిలో పునర్నిర్ణయించేంత వరకు ఎలాంటి ఎన్నికల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లవద్దని రాష్ట్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ధర్మాసనం కఠినంగా ఆదేశించింది. రాజధాని నగరంపై పట్టు సాధించాలని భావిస్తున్న హస్తం పార్టీకి ఈ న్యాయపరమైన చిక్కు అతిపెద్ద రాజకీయ ఎదురుదెబ్బగా మారింది. ఈ వివాదానికి ప్రధాన మూలం ఇటీవల జీహెచ్ఎంసీ ఆదరాబాదరాగా చేపట్టిన వార్డుల విభజన ప్రక్రియలోని అవకతవకలే. మున్సిపల్ చట్టాల ప్రకారం ప్రతి వార్డు సరిహద్దు నిర్ణయం అనేది కేవలం ఆయా ప్రాంతాల జనాభా ప్రాతిపదికన, సమతుల్యత దెబ్బతినకుండా జరగాలి. కానీ, ప్రస్తుతం చేపట్టిన పునర్విభజన తెలంగాణ మున్సిపాలిటీల చట్టం 2019 లోని సెక్షన్ 6 స్ఫూర్తికి సంపూర్ణంగా విరుద్ధంగా ఉందంటూ పిటిషనర్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లిన ఆధారాలు న్యాయస్థానాన్ని సంతృప్తిపరిచాయి. శాస్త్రీయ ప్రాతిపదికను పక్కనబెట్టి, కొన్ని ప్రాంతాలలో జనాభాను విపరీతంగా పెంచేసి, మరికొన్ని చోట్ల కుదించి వేయడం తీవ్రమైన అభ్యంతరాలకు దారితీసింది. ఈ పరిణామం వెనుక అధికార కాంగ్రెస్ పార్టీ రాజకీయ ప్రయోజనం వెతుక్కునే ప్రయత్నం చేసిందనే ఆరోపణలు ఇప్పుడు గట్టిగా బలపడుతున్నాయి. హైదరాబాద్ పరిధిలో సాంప్రదాయకంగా ప్రతిపక్షాలైన బిఆర్ఎస్ , బీజేపీ , ఎంఐఎం బలంగా ఉన్న ఓటు బ్యాంకులను చెదరగొట్టేందుకే వార్డుల సరిహద్దులను తమకు అనుకూలంగా మార్చుకున్నారనే విమర్శలు క్షేత్రస్థాయి నుంచి వ్యక్తమయ్యాయి. కాంగ్రెస్‌కు ప్రయోజనం చేకూర్చేలా ఓటర్లను, ప్రాంతాలను రాత్రికి రాత్రే అటు ఇటూ మార్చడం ద్వారా ఎన్నికల మేజిక్ చేయాలని చూశారన్న వాదనలకు కోర్టు బ్రేక్ ఇవ్వడంతో ప్రతిపక్షాలకు పెద్ద రాజకీయ ఆయుధం దొరికినట్లయింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికారాన్ని ఉపయోగించి వార్డుల సరిహద్దులను మార్చడం కొత్తేమీ కాకపోయినా, చట్టపరమైన నిబంధనలను, నిబంధన పత్రాలను పూర్తిగా తొక్కిపట్టడం కాంగ్రెస్‌కు రివర్స్ కొట్టింది. ప్రజాభిప్రాయ సేకరణను మమ అనిపించి, శాస్త్రీయ సర్వేలు లేకుండా ప్రక్రియను పూర్తి చేయాలని చూడటమే హైకోర్టులో ప్రభుత్వం ఇరుకున పడటానికి కారణమైంది. ఈ స్టే ఆర్డర్ పరిణామం ప్రతిపక్షాలైన బిఆర్ఎస్, బీజేపీలకు రాజకీయంగా పెద్ద ఊరటనిచ్చింది. కాంగ్రెస్ పార్టీ తమ అధికారాన్ని దుర్వినియోగం చేస్తోందని, గెలిచే అవకాశం లేకే అక్రమ మార్గాల్లో వార్డుల విభజన చేసింది అని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు వారికి చక్కటి అవకాశం లభించింది. హైకోర్టు తీర్పును అడ్డం పెట్టుకుని, గ్రేటర్ పరిధిలో కాంగ్రెస్ వైఫల్యాలను, అక్రమ రాజకీయ వ్యూహాలను ఎండగట్టడానికి ప్రతిపక్షాలు సన్నాహాలు చేస్తున్నాయి. ఇది నగర పరిధిలో కాంగ్రెస్ గ్రాఫ్‌ను మరింత దెబ్బతీసే ప్రమాదం లేకపోలేదు. హైదరాబాద్‌ను రాజకీయంగా తమ గుప్పిట్లోకి తీసుకోవాలని వేసిన డెలిమిటేషన్ ఎత్తుగడ కాంగ్రెస్ మెడకే చుట్టుకుంది. ఇప్పుడు కోర్టు ఆదేశాల ప్రకారం మళ్లీ మొదటి నుంచి శాస్త్రీయంగా, పారదర్శకంగా సరిహద్దుల నిర్ణయం చేపట్టాలంటే నెలల సమయం పడుతుంది. ఆలోగా ప్రతిపక్షాల విమర్శల దాడిని తట్టుకోవడం, ప్రజా క్షేత్రంలో ఎదురయ్యే వ్యతిరేకతను అధిగమించడం కాంగ్రెస్ నాయకత్వానికి పెద్ద సవాలుగా మారనుంది.

# తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

కరీంనగర్ : కరీంనగర్ లోఎల్ నినో ప్రభావంతో జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. మిషన్ భగీరథతో పాటు ఇతర తాగునీటి సరఫరా వ్యవస్థల్లో ఎలాంటి అంతరాయం కలగకుండా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్ అధికారులతో తాగునీటి సరఫరాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీల పరిధిలో రోజువారీ నీటి అవసరాలు, సరఫరా పరిస్థితులు, నీటి పొదుపు కోసం చేపడుతున్న చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎక్కడైనా తాగునీటి పైపులైన్లకు లీకేజీలు ఏర్పడితే వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. వార్డుల వారీగా పనిచేస్తున్న బోర్లు, వినియోగంలో లేని బోర్లను గుర్తించి అవసరమైన మరమ్మతులు చేసి తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. కార్పొరేషన్ పరిధిలోని కొత్తపల్లి-ఎలగందుల, బొమ్మకల్, విద్యారణ్యపురి, అలుగునూరు, చింతకుంట ప్రాంతాలతో పాటు ఇటీవల విలీనమైన గ్రామాల్లో తాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అలాగే జమ్మికుంట, హుజురాబాద్, చొప్పదండి మున్సిపాలిటీలు, గంగాధర, గన్నేరువరం మండలాల్లో నీటి అవసరాలు, వినియోగం, సరఫరా పరిస్థితులను సమీక్షించారు. ఎల్ఎండీ రిజర్వాయర్‌లో నీటి నిల్వలను ప్రతిరోజూ పర్యవేక్షించాలని, డెడ్ స్టోరేజ్ పరిస్థితి ఏర్పడకముందే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గన్నేరువరం మండలంలోని హనుమాజిపల్లి-జంగంపల్లి ప్రాంతాల్లో నెలకొన్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని సూచించారు. అలాగే గంగాధర మండలంలోని నారాయణపూర్ చెరువు నీటిని గంగాధర, చొప్పదండి మండలాల తాగునీటి అవసరాలకు వినియోగించే అంశాన్ని పరిశీలించాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నివారణలో భాగంగా ఓవర్‌హెడ్ ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని, పైపులైన్ లీకేజీలు, నిర్వహణ లోపాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తూ అక్రమ నల్లా కనెక్షన్లను తొలగించి నీటి వృథాను అరికట్టాలని అధికారులకు ఆదేశించారు. జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ప్రజల్లో నీటి పొదుపుపై విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా సూచించారు. సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కరించాలని, అవసరమైతే తన దృష్టికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మిషన్ భగీరథ ఈఈలు రామ్‌కుమార్, సందీప్‌కుమార్, పబ్లిక్ హెల్త్ ఈఈ సంపత్‌రావు, నగరపాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు

## కొత్తకోట గ్రామంలో పీజీఆర్ఎస్ దరఖాస్తుపై

# తహసీల్దార్ క్షేత్రస్థాయి విచారణ

సి.బెళగల్ :సి.బెళగల్ మండలంలోని కొత్తకోట గ్రామంలో భూ సంబంధిత ఫిర్యాదుల పరిష్కారానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) కింద అందిన దరఖాస్తుపై తహసీల్దార్ క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన సాయ సావిత్రి దాఖలు చేసిన ఫిర్యాదు మేరకు సర్వే నంబర్లు 76 మరియు 124లోని భూములను ప్రత్యక్షంగా పరిశీలించి, వాస్తవ పరిస్థితులను పరిశీలించారు. విచారణ సందర్భంగా సంబంధిత భూముల రికార్డులను పరిశీలించడంతో పాటు, భూమి హద్దులు, యాజమాన్య హక్కులు, సాగు పరిస్థితులు మరియు ఇతర సంబంధిత అంశాలపై క్షుణ్ణంగా పరిశీలన నిర్వహించారు. దరఖాస్తుదారుతో మాట్లాడి ఆమె వాదనను తెలుసుకోవడంతో పాటు, అవసరమైన చోట స్థానికుల నుంచి కూడా వివరాలు సేకరించారు. భూ వివాదాలకు సంబంధించి ప్రభుత్వ రికార్డులు, క్షేత్రస్థాయి పరిస్థితులు రెండింటినీ సమన్వయం చేసి నిష్పక్షపాతంగా విచారణ నిర్వహించడం జరుగుతుందని అధికారులు తెలిపారు. ప్రజల నుంచి అందిన ప్రతి ఫిర్యాదును పారదర్శకంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, ప్రజలు భూ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను అధికారిక విధానంలో సమర్పిస్తే వాటిపై క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి వాస్తవాలను నిర్ధారించిన అనంతరం నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి ఫిర్యాదును పారదర్శకంగా, న్యాయబద్ధంగా పరిష్కరించేందుకు రెవెన్యూ శాఖ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. విచారణ అనంతరం సంబంధిత అంశాలపై సమగ్ర నివేదికను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపనున్నట్లు అధికారులు తెలిపారు.

# మెదక్ కే పరిమితమౌతున్న హరీష్

## - పార్టీలో రసవత్తరంగా చర్చ



మెదక్ : హరీష్ రావు సొంత నియోజకవర్గం సిద్ధిపేటలో చేసిన పాదయాత్ర ఇప్పుడు హాట్ టాపిక్. కేవలం పదిహేను కిలోమీటర్లు చేసిన పాదయాత్రతో రాష్ట్రం మొత్తం చూపు తన వైపునకు తిప్పుకున్నారు. తెలంగాణ రాజకీయాల్లో ట్రబుల్ షూటర్ గా, పక్కా మాస్ లీడర్ గా తన్నీరు హరీష్ రావుకు ఉన్న క్రేజ్, క్యాడర్ బేస్ ప్రత్యేకం. ఉద్యమ సమయం నుంచి నేటి వరకు పార్టీకి ఏ కష్టం వచ్చినా ముందు వరుసలో నిలబడి పరిష్కరించడం ఆయన శైలి. తాను ఎప్పుడూ ఉన్నత పదవులకో, ఆధిపత్యానికో ఆశపడలేదని, అధినాయకత్వపు నిర్ణయాలకు కట్టుబడి ఉంటానని ఆయన ఎన్నో సార్లు స్పష్టం చేశారు. అయినప్పటికీ, బీఆర్ఎస్ శ్రేణులను బలహీనపరచడానికి, అధినాయకత్వానికి-హరీష్‌రావుకు మధ్య అనుమానాల బీజాలు నాటడానికి ప్రత్యర్థి వర్గాలు నిరంతరం విచిత్రమైన ఊహాగానాలను సృష్టిస్తూనే ఉంటాయి. ఈ రాజకీయ సమీకరణల వల్లే కావచ్చు.. ప్రస్తుతం హరీష్ రావు పాత్రను అధినాయకత్వం కేవలం తన సొంత నియోజకవర్గానికో, ఉమ్మడి మెదక్ జిల్లాకో పరిమితం చేస్తోంది. రాజకీయాల్లో క్షేత్రస్థాయి బలం ఉన్న నాయకుడి పవర్ ఏంటో హరీష్ రావు ఇటీవలి తన సిద్ధిపేట పాదయాత్రల ద్వారా మరోసారి నిరూపించారు. కాళేశ్వరం నీళ్లు, రైతాంగ సమస్యలపై ఆయన కేవలం ఒక మండల స్థాయిలో పిలుపునిస్తేనే వేలాదిగా జనం తరలి వచ్చారు. ఏ మీడియా బిల్డప్‌లు, సోషల్ మీడియా ప్రచారాలు లేకుండా నేరుగా ప్రజలతో ఉండే ఈ లైవ్ కనెక్టివిటీ యే ఆయన అసలైన బలం. సోషల్ మీడియా హడావుడికే పరిమితమైన నేతల మధ్య, రోడ్డెక్కి పోరాటం చేసే మాస్ లీడర్‌గా ఆయనకున్న గుర్తింపు చెక్కుచెదరలేదు. అయితే, ఈ స్థాయి క్రేజ్ చూసిన ప్రతిసారీ సొంత పార్టీలోనే కొందరు వ్యతిరేకులు ఆయనపై ముద్రలు వేయడం, ఆయన సైలెంట్ అయితే పార్టీపై అలిగారని ప్రత్యర్థులు ప్రచారం చేయడం ఒక పరిపాటిగా మారింది. బీఆర్ఎస్ ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా పునర్వైభవం కోసం పోరాడుతున్న తరుణంలో, హరీష్ రావు సేవలను కేవలం ఒక జిల్లాకే పరిమితం చేయడం వ్యూహాత్మక తప్పిదమేనని భావిస్తున్నారు. హరీష్ రావుకు ఎలాంటి సరిహద్దు ఆంక్షలు విధించకుండా, రాష్ట్రవ్యాప్తంగా పార్టీ బాధ్యతలు అప్పగిస్తే బీఆర్ఎస్ క్యాడర్‌లో వచ్చే ఊపు అసాధారణంగా ఉంటుంది. తెలంగాణలోని ప్రతి నియోజకవర్గంలోనూ ఆయనకు అభిమానులు, అనుచరులు ఉన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రజా సమస్యలపై నిలదీయడంలో గానీ, క్షేత్రస్థాయిలో కేడర్‌ను సమాయత్తం చేయడంలో గానీ హరీష్‌కున్న రాజకీయ చాకచక్యం అపారమైనది. కానీ, ఈ నిర్ణయం తీసుకోవడానికి బీఆర్ఎస్ అధినాయకత్వం వెనుకంజ వేయడానికి అంతర్గత కుటుంబ, వారసత్వ రాజకీయ సమీకరణలే ప్రధాన కారణమని అందరికీ తెలుసు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేటీఆర్ ఉన్నందున , హరీష్ రావు మాస్ ఇమేజ్ దాన్ని డామినేట్ చేస్తుందేమోననే ముందస్తు ఆందోళనలు, భయాలు ఉండవచ్చు. వారి అంతర్గత ప్రాధాన్యతలు ఏవైనప్పటికీ, అధికారంలో లేని సమయంలో పార్టీకి అత్యంత అవసరమైన అస్త్రాన్ని సిద్ధంగా పెట్టుకుని పూర్తిస్థాయిలో వాడుకోకపోవడం గులాబీ దళానికి తీవ్ర నష్టం కలిగిస్తుందనడంలో సందేహం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ధీటుగా ఎదుర్కోవాలన్నా, కిందిస్థాయి కార్యకర్తల్లో ఉత్సాహం నింపాలన్నా హరీష్ రావుకు స్వేచ్ఛాయుతమైన రాష్ట్రస్థాయి బాధ్యతలు ఇవ్వాల్సిన అవసరం ఉంది. ప్రజా సమస్యలపై పోరాడే శక్తి, పక్కా వ్యూహాలు రచించే నైపుణ్యం ఉన్న నాయకుడికి పరిమితులు విధించడం వల్ల పార్టీ తన సొంత బలాన్నే తగ్గించుకున్నట్లవుతోంది. ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకత్వం ధైర్యం చేసి, హరీష్ రావును రాష్ట్రవ్యాప్త పర్యటనలకు, పోరాటాలకు నాయకత్వం వహించేలా ముందువరుసలో నిలబడితేనే.. తెలంగాణలో గులాబీ జెండా మళ్లీ పూర్తిస్థాయిలో ఊపందుకుంటుంది.

# పావురాలకు మేత వేయడంపై ఆంక్షలు



హైదరాబాద్ : హైదరాబాద్, సికింద్రాబాద్ కవల నగరాల పరిధిలో పావురాలకు విచ్చలవిడిగా మేత వేయడం వల్ల ప్రజా ఆరోగ్యం, పర్యావరణం తీవ్ర ప్రమాదంలో పడుతున్నాయని తెలంగాణలో హైకోర్టులో పిల్ దాఖలైంది. దీనిపై స్పందించిన హైకోర్టు ధర్మాసనం మేత నియంత్రణకు తీసుకున్న చర్యలపై మూడు వారాల్లో సమగ్ర అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. జనావాసాలు, ఆసుపత్రులు, వారసత్వ కట్టడాల సమీపంలో పావురాలకు మేత వేయడాన్ని క్రమబద్ధీకరించాలని దాఖలైన ఈ పిటిషన్‌పై తదుపరి విచారణను ఆగస్టు 25కి వాయిదా వేసింది. అయితే వాటికి మేత వేయటం వల్ల నష్టాలేంటి..? పావురాల అంత ప్రమాదకరమా..? ఆ విషయాలు తెలుసుకుందాం. హైదరాబాద్, సికింద్రాబాద్ నగర పరిధిలో విచ్చలవిడిగా పావురాలకు మేత వేయటంపై తెలంగాణ హైకోర్టు తీవ్రంగా స్పందించింది. పావురాల మేతను నియంత్రించడానికి, వాటి సంతతి పెరుగుదలను అరికట్టడానికి తీసుకున్న చర్యలపై మూడు వారాల్లోగా పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బుధవారం (జులై 22) ఆదేశించింది. నగరానికి చెందిన ప్రముఖ వైద్యుడు రాధేశ్యామ్ తపాడియా దాఖలు చేసిన ప్రజాహిత పిటిషన్ పై ప్రధాన న్యాయమూర్తి అపరేష్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం ఈ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. పిటిషనర్ తరఫు న్యాయవాది దీపక్ మిశ్రా కోర్టుకు తన వాదనలు వినిపిస్తూ.. నివాస ప్రాంతాలు, ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు, రద్దీగా ఉండే పబ్లిక్ ప్రాంతాలు, చారిత్రక వారసత్వ కట్టడాల సమీపంలో ఎలాంటి నిబంధనలు లేకుండా పావురాలకు మేత వేస్తున్నారని తెలిపారు. దీనివల్ల నగరంలో పావురాల సంఖ్య విపరీతంగా పెరిగిపోయాని ఆందోళన వ్యక్తం చేశారు. పావురాల మేతను నియంత్రించడంలో, ఆరోగ్యం, పర్యావరణ ముప్పులను అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం, జీహెచ్ఎంసీ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని పిటిషనర్ వాదించారు. అధికారుల తీరు రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 21 ద్వారా పౌరులకు సంక్రమించిన జీవించే హక్కును కాలరాసేలా ఉందని ఇది పూర్తిగా చట్టవిరుద్ధమని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అనుమతి లేని ప్రదేశాల్లో మేత వేసే వారికి కఠిన జరిమానాలు విధించడం, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, పావురాల సంఖ్యను నియంత్రించడానికి మానవీయ, పర్యావరణ రహిత సమతుల్య పద్ధతులను అవలంబించేలా ఆదేశించాలని పిల్ ద్వారా విజ్ఞప్తి చేశారు. వాదనలు విన్న ధర్మాసనం ఈ వ్యవహారంపై తదుపరి విచారణను ఆగస్టు 25వ తేదీకి వాయిదా వేసిందిహైకోర్టు ఆదేశాల నేపథ్యంలో పావురాల మేతపై చర్చ మెదలైంది. అవి అంత ప్రమాదకరమా..? అని ప్రజలు చర్చించుకున్నాయి. అయితే అది నిజమేనని అంటున్నారు వైద్య నిపుణులు. వారు వెల్లడించిన వివరాల ప్రకారం.. నగరాల్లో ఆహారం సులభంగా దొరకడం వల్ల పావురాల సంఖ్య నియంత్రణ లేకుండా పెరిగి ప్రకృతి సమతుల్యత దెబ్బతింటోంది. ఆహార వ్యర్థాలు నేలపై పడి కుళ్లిపోవడంతో పాటు పావురాల రెట్టలు భవనాలను దెబ్బతీస్తూ గాలిలో కలిసే ప్రమాదకర క్రిములకు నిలయంగా మారుతున్నాయి. పావురాల ఈకలు, ఎండిపోయిన రెట్టల నుంచి వచ్చే ధూళి గాలిలో కలవడం వల్ల మానవులకు తీవ్రమైన శ్వాసకోశ, ఊపిరితిత్తుల వ్యాధులు సంభవిస్తున్నాయట. ముఖ్యంగా పావురాల సావాసం వల్ల హైపర్ సెన్సిటివిటీ ప్యానెమోనైటిస్ అనే అలెర్జీ వచ్చి అది కాలక్రమేణా ఊపిరితిత్తులను శాశ్వతంగా దెబ్బతీసే లంగ్ ఫైబ్రోసిస్‌కు దారితీస్తుందని చెబుతున్నారు. అలాగే వీటి ద్వారా వ్యాపించే సిట్టకోసిస్ అనే బ్యాక్టీరియల్



# డయాలసిస్ రోగికి 'పీస్ సేవా సంస్థ' సహాయం

ఖాజీపేట (ప్రజా కలం ప్రతినిధి) మైదుకూరు నియోజకవర్గం ఖాజీపేట మండల పరిధిలోని పుల్లూరు పంచాయతీ పుల్లూరు మాలవాడకు చెందిన డయాలసిస్ రోగి శ్రీనును 'పీస్ సేవా సంస్థ' సభ్యులు పరామర్శించారు. శ్రీను గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆయనకు ముగ్గురు పిల్లలు. భార్య కూడా భర్తను చూసుకోవడానికి ఇంటి వద్దనే ఉండాల్సి రావడంతో కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. వారానికి మూడు సార్లు డయాలసిస్ కోసం కడపకు వెళ్లి రావాల్సి రావడంతో ఖర్చులు భరించడం కష్టంగా ఉందని బాధిత కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది. స్పందించిన సంస్థ సభ్యులు సయ్యద్ మహబూబ్ బాషా,గౌసులాజం,హాజీ గౌస్,మహబూబ్ హుస్సేన్,షాహిద్ తదితరులు బాధిత కుటుంబానికి బియ్యం,నిత్యావసర సరుకులు అందజేశారు. ఇలాంటి అవసరంలో ఉన్న కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని సంస్థ సభ్యులు తెలిపారు.

# ఘనంగా 'మెగా పి.టీ.ఎం' కార్యక్రమం

## పిల్లల భవిష్యత్తుకు తల్లిదండ్రుల పాత్ర కీలకం



సింహాద్రిపురం, జూలై 25: పులివెందుల నియోజకవర్గం సింహాద్రిపురం మోడల్ ప్రైమరీ స్కూల్లో 'మెగా పి.టీ.ఎం' కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు అశ్వర్ధ రెడ్డి అధ్యక్షత వహించారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల బాధ్యత కూడా కీలకమని అశ్వర్ధ రెడ్డి తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా తల్లిదండ్రులకు పాఠశాలలో జరుగుతున్న అంశాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఉపాధ్యాయురాలు యాస్మిన్ మాట్లాడుతూ పిల్లల చదువుల్లో ఉపాధ్యాయుల పర్యవేక్షణతో పాటు ఇంటి వద్ద తల్లిదండ్రుల పర్యవేక్షణ తప్పనిసరి అన్నారు. పక్షికి రెండు రెక్కల్లా ఉపాధ్యాయులు,తల్లిదండ్రుల సహకారం అవసరమన్నారు. విద్యార్థుల హాజరు 75 శాతం కంటే తగ్గితే 'తల్లికి వందనం' పథకం వర్తించదని సూచించారు. ఈ కార్యక్రమానికి అబ్జర్వర్‌గా పంచాయతీ అభివృద్ధి అధికారి సుబ్బమ్మ హాజరై 'మిషన్ వాత్సల్య' గురించి వివరించారు. ఉపాధ్యాయులు లక్ష్మి,హెల్త్ వర్కర్లు,విద్యార్థులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# చిన్నారి బాబు శ్యామ్ చికిత్సకు విరాళాల ర్యాలీ



పులివెందుల జులై 25:ప్రాణాపాయ స్థితిలో ఉన్న చిన్నారి బాబు శ్యామ్ చికిత్సకు ఆర్థిక సహాయం అందించేందుకు సోమవారం పులివెందుల పట్టణంలో విరాళాల సేకరణ ర్యాలీ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9.30 గంటలకు ర్యాలీ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. బాబు శ్యామ్ ఎస్.ఎం.ఏ టైపు-1 అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్నాడని,చికిత్సకు భారీగా ఖర్చు అవుతున్న నేపథ్యంలో దాతల సహకారం అవసరమని తెలిపారు. మానవతా దృక్పథంతో స్పందించి,తమకు తోచినంత ఆర్థిక సహాయం అందించి చిన్నారి ప్రాణాలను కాపాడాలని కోరారు. ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో సంస్థలు పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. విరాళాలు అందించదలచిన వారు బ్యాంకు ఖాతా లేదా క్యూఆర్ కోడ్ ద్వారా సహాయం చేయవచ్చని తెలిపారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారానే అత్యుత్తమ వైద్య సేవలు అందించాలనేది లక్ష్యం

## - తెనాలి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఆధునిక వైద్య సదుపాయాల ప్రారంభం... ఆరోగ్య సేవల్లో మరో ముందడుగు







తెనాలి/గుంటూరు, జులై 25 : ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారానే అత్యుత్తమ వైద్య సేవలు అందించాలనేది ప్రభుత్వ లక్ష్యమని తెనాలి నియోజకవర్గ శాసనసభ్యులు, రాష్ట్ర ఆహార, పౌర సరఫరాలు మరియు వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. తెనాలిలో గల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన తల్లి-నవజాత శిశు సంరక్షణ కేంద్రం (ఎంసీజీఖ), ఆధునిక వైద్య పరికరాలు, మాతృ-నవజాత శిశు సంరక్షణ విభాగం, రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ ఆప్టికల్ ఇల్యూమినేటర్ పరికరాన్ని మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారానే అత్యుత్తమ వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య రంగాన్ని మరింత బలోపేతం చేస్తోందన్నారు. ఆధునిక వైద్య పరికరాలు, ప్రత్యేక చికిత్సా విభాగాల ఏర్పాటు ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను చేరువ చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా తల్లి-నవజాత శిశు సంరక్షణలో ఎంఎన్‌సీయూ కీలక పాత్ర పోషిస్తుందని, నవజాత శిశువులకు అత్యవసర వైద్య సేవలు మరింత సమర్థవంతంగా అందించేందుకు ఇది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. మహిళల్లో రొమ్ము క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించేందుకు అందుబాటులోకి వచ్చిన ఆప్టికల్ ఇల్యూమినేటర్ పరికరం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. అనంతరం నిర్వహించిన జిల్లా ఆసుపత్రి అభివృద్ధి సంఘం (ఎఐఖ) సమావేశంలో ఆసుపత్రిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, మౌలిక వసతుల విస్తరణ, వైద్య సిబ్బంది అవసరాలు, ఆధునిక వైద్య పరికరాల సమీకరణ, రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చేపట్టాల్సిన చర్యలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రి అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను వేగవంతంగా అమలు చేసి, ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు ప్రభుత్వ ఆసుపత్రిలోనే అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ మాట్లాడుతూ జిల్లాలో వైద్య సేవలు మెరుగుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ సమావేశంలో తెనాలి రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీరమణి, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డా.బి.వి.రంగారావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ లక్ష్మి, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, వైద్యులు, ప్రజాప్రతినిధులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

అనంతపురం, జులై 25 (ప్రజా కలం ప్రతినిధి) అనంతపురం జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో మాదకద్రవ్యాల నియంత్రణ చర్యలు మరియు ఎన్కోఆర్డ్ (నార్కో కోఆర్డినేషన్ సెంటర్, బీజా=ఖ) జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ ఎస్పీ పి.జగదీష్ తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాను డ్రగ్ ఫ్రీ జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. విద్యాసంస్థల్లో వారానికొకసారి అవగాహన కార్యక్రమాలు డిఈఓ, ఆర్ఐఓ, ఆర్డిడిలు పాఠశాలలు మరియు కళాశాలల్లో డ్రగ్స్, గంజాయి దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మాదకద్రవ్యాల అవగాహన కార్యక్రమాలు అన్ని విద్యాసంస్థలు నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. నిర్వహించిన కార్యక్రమాలకు సంబంధించిన ఫోటోలు, చర్చించిన అంశాలు మరియు ఇతర వివరాలను తప్పనిసరిగా గూగుల్ ఫారంలో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. ప్రైవేట్ పాఠశాలల ఈగల్ క్లబ్ వివరాలు జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలకు సంబంధించిన ఈగల్ క్లబ్ వివరాల ఫిజికల్ కాపీలను డీఈఆర్‌బీకి పంపించాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. హాట్‌స్పాట్ ప్రాంతాల పరిశుభ్రత కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న చెరువుకట్ట దిగువనున్న పార్కును పూర్తిగా శుభ్రపరచాలని మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశించారు. పార్కు పరిసరాల్లో ఉన్న నిరుపయోగ (ఖాఖిఅ-ఎఱీఅవం) ప్రదేశాలు మరియు హాట్‌స్పాట్ ప్రాంతాలను గుర్తించి వెంటనే క్లియర్ చేయాలన్నారు.'పల్లెబాటలో ఈగల్ కార్యక్రమం వ్యవసాయ శాఖ, అటవీ శాఖ, పోలీసు శాఖ మరియు ఈగల్ సెల్ సమన్వయంతో జిల్లాలోని గుర్తించిన గ్రామాలు, అన్ని పోలీస్ స్టేషన్ పరిధుల్లో గంజాయి సాగు నివారణ మరియు మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. జీఎస్టీ/కమర్షియల్ ట్యాక్స్ శాఖ అధికారులు తమ విధుల నిర్వహణలో గంజాయి లేదా మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం లభిస్తే తప్పనిసరిగా పోలీసు శాఖకు తెలియజేయాలన్నారు. విద్యాసంస్థల 500 మీటర్ల పరిధిలో నిషేధిత విక్రయాలు విద్యాసంస్థల 500 మీటర్ల పరిధిలో పొగాకు ఉత్పత్తులు, గంజాయి, మాదకద్రవ్యాలు మరియు ఇతర నిషేధిత పదార్థాల విక్రయాలను పూర్తిగా అరికట్టాలని ఆదేశించారు.



# సేవా బాటలో చల్లా కుటుంబం..

ప్రొద్దుటూరు , జులై 25: మానవతా దృక్పథంతో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాన్ని చల్లా రాజగోపాల్ యాదవ్ కుటుంబ సభ్యులు కొనసాగించారు. చల్లా రాజగోపాల్ యాదవ్ అందుబాటులో లేకపోవడంతో ఆయన సోదరుడు చల్లా రవిశంకర్ యాదవ్ ఆధ్వర్యంలో మైదుకూరు రోడ్డులోని అన్వర్ థియేటర్ వద్ద శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గత ఐదేళ్లుగా ప్రతి శనివారం,పౌర్ణమి రోజున కొనసాగుతున్న ఈ సేవా కార్యక్రమంలో భాగంగా నిరుపేదలు,ప్రయాణికులు,కార్మికులకు భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. ఆకలితో ఉన్న వారికి ఆహారం అందించడం సామాజిక బాధ్యతగా భావించి ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని చల్లా రవిశంకర్ యాదవ్ పేర్కొన్నారు.

# వసంతపేటలో కలకలం

## ఒంటరి మహిళ మృతిపై దర్యాప్తు



ప్రొద్దుటూరు జులై 25: పట్టణంలోని వసంతపేటలో ఒంటరిగా ఉంటున్న మేకల సుసన్ రాణి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఇంటి నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు చూడగా బెడ్‌రూమ్‌లో ఆమె మృతదేహం కనిపించిందని వన్‌టౌన్ సీఐ కొండారెడ్డి తెలిపారు. రెండు,మూడు రోజుల క్రితమే మృతి చెంది ఉంటుందని అనుమానిస్తున్నామన్నారు. మృతురాలి అక్క రామోజీ హెప్సిబా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి,శవపంచనామా అనంతరం పోస్టుమార్టం నిర్వహించారు. మృతికి గల కారణాలపై అన్ని కోణాల్లో విచారిస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

# కరుణించని వరుణుడు



జమ్మలమడుగు, జూలై 25: ఖరీఫ్ సీజన్ వేళ.. ఎల్‌నినో ప్రభావం రైతులకు శాపంగా మారుతోంది. జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో వరినాట్లు,వరిఎదలు ఎండిపోతుండడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. గత నెలలో అడపాదడపా వర్షాలు పడడంతో రైతులు దుక్కులు పూర్తిచేసుకున్నారు. ఎక్కువగా ఎద చల్లుకునేందుకు వీలుగా పొలాలను సిద్ధం చేశారు. ఇంకొందరు వరి విత్తనాలు వేసుకున్నారు. ఆకుమడులు సిద్ధమయ్యాయి. కానీ తర్వాత వరుణుడి జాడ లేదు. ఈ నేపథ్యంలో వరినారును కాపాడుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. సమీపంలోని చెరువులు,బావుల్లో నీటిని బిందెలు,బకెట్లతో తెచ్చి.. వరినారును తడుపుతున్నారు. మరికొందరు మోటర్ల ద్వారా పైపులతో నీరు అందిస్తున్నారు.అయినా చాలాచోట్ల నారు ఎండిపోతుండడంతో ఆందోళన చెందుతున్నారు. వరుణుడి కరుణ కోసం ఎదురుచూస్తున్నారు.

# పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణాన్ని పరిశీలించిన కలెక్టర్

తెనాలి/గుంటూరు, జులై 25 : తెనాలి పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణాన్ని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ పరిశీలించారు. శనివారం తెనాలి పర్యటనలో భాగంగా పాలిటెక్నిక్ కళాశాలను సందర్శించారు. కళాశాల ప్రాంగణంలో వాతావరణాన్ని పరిశీలించి, మౌలిక వసతులను అడిగి తెలుసుకున్నారు. ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టి మంచి వాతావరణం ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెనాలి రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీరమణి, తాసిల్దార్ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# గృహలేఖ ఇంటీరియర్ అండ్ కన్స్ట్రక్షన్స్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి

### - సరికొత్త హంగులతో ఇంటీరియర్ డిజైన్స్ పట్టణంలో గృహలేఖతో అందుబాటు






ప్రజాకలం ,ప్రొద్దుటూరు,జూలై 24: పట్టణంలోని గాయత్రి హాస్పిటల్ పక్కన ఏర్పాటు చేసిన గృహలేఖ ఇంటీరియర్స్ అండ్ కన్స్ట్రక్షన్స్ సంస్థను ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి మాట్లాడుతూ ప్రొద్దుటూరులో నూతన వ్యాపార సంస్థలు ఏర్పాటు కావడం సంతోషించదగ్గ విషయమని ఇంటి నిర్మాణ దారులకు సరికొత్త హంగులతో ఇంటీరియర్ డిజైన్స్ పట్టణంలో గృహలేఖ వారి సేవలను ప్రజలు ఉపయోగించుకోవాలని తెలిపారు. ఆధునిక గృహ నిర్మాణంలో నాణ్యతతో కూడిన సేవలకు ప్రాధాన్యత పెరుగుతోందని, ప్రజల అభిరుచులకు అనుగుణంగా సేవలు అందిస్తూ గృహలేఖ సంస్థ ప్రజల్లో మంచి గుర్తింపు పొందాలన్నారు. టీడీపీ కడప పార్లమెంట్ అధ్యక్షుడు చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి గృహలేఖ కార్యాలయ ప్రారంబోత్సావానికి ముఖ్యఅతిధిగా పాల్గొని సంస్థ యొక్క బ్రోచర్స్ ఆవిష్కరించారు ఆనంతరం ఆయన మాట్లాడుతూ యువత స్వశక్తితో వ్యాపార రంగంలో ముందుకు రావడం అభినందనీయమని నూతన సంస్థలు స్థానికంగా ఉపాధి అవకాశాలను పెంచేలా పనిచేయాలని, నాణ్యతతో కూడిన సేవలు అందించి ప్రజల విశ్వాసాన్ని పొందాలని ఆకాంక్షించారు. ఆనంతరం సంస్థ మేనేజింగ్ పార్టనర్స్ దుగ్గిరెడ్డి హరినాథరెడ్డి,పి.దినేష్ పవన్,ఎస్.చైతన్యలు తమ సంస్థ అందించే సేవలను వివరించారు. గృహాలంకరణ రూపకల్పన, అంతర్గత అలంకరణ, నిర్మాణ పనులు, బహిరంగ ప్రదేశాల పనులు, ప్రత్యేక ప్రాజెక్టులు, సమగ్ర సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. గృహనిర్మాణదారుల అభిరుచికి తగ్గట్టు తమ సంస్థ డిజైన్‌లను రూపొందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, రాష్ట్ర షేక్ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీఎస్ డా.వి.ఎస్.ముక్తియార్, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు, టీడీపీ కడప పార్లమెంట్ అధికార ప్రతినిధి ఘంటసాల వెంకటేశ్వర్లు, చదిపిరాళ్ల రామాంజనేయులు రెడ్డి, టీడీపీ మాజీ పట్టణ అధ్యక్షుడు ఈవీ సుధాకర్ రెడ్డి, చదిపిరాళ్ల గోవర్ధన్రెడ్డి, మాజీ కౌన్సిలర్ వంగనూరు మురళీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మెగా పేరెంట్స్ - టీచర్స్ మీటింగ్ 4.0కు విశేష స్పందన...!

### - జిల్లావ్యాప్తంగా 2,042 పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఘనంగా నిర్వహణ
### - 1.50 లక్షల మందికిపైగా విద్యార్థులు, తల్లిదండ్రుల భాగస్వామ్యం
### - ఉత్సాహంగా పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు







ప్రజాకలం కడప,జూలై 24: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేయడం, పాఠశాలల అభివృద్ధిలో తల్లిదం డ్రుల భాగస్వామ్యాన్ని పెంపొందించడం లక్ష్యంగా చేపట్టిన "మెగా పేరెం ట్స్ టీచర్స్ మీటింగ్ (ఎం.పీ.టీ.ఎం) - 4.0" కార్యక్రమం వైఎస్ఆర్ కడప జిల్లాలో పండుగ వాతావరణంలో ఘనంగా జరిగింది.జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఆదర్శ, గురుకుల పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, ప్రభుత్వ జూనియర్ కళాశా లల్లో శుక్రవారం ఉదయం నుండి మధ్యాహ్నం వరకు ఒకే సమయంలో ఈ సమావేశాలను నిర్వహించారు.జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో స్థానిక ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో,ఆయా రెవెన్యూ డివిజన్ల పరిధిలో నియమితులైన మండలస్థాయి ప్రత్యేక అధికారుల సమక్షంలో కార్యక్ర మాలు నిర్వహించగా,ప్రజాప్రతినిధులు,అధికారులు,ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రభుత్వ విద్యపై తమ విశ్వాసాన్ని చాటారు.

**2,042 విద్యాసంస్థల్లో ఒకేసారి నిర్వహణ..** జిల్లాలో మొత్తం 2,042 ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో మెగా పేరెంట్స్-–టీచర్స్ మీటింగ్ నిర్వహించారు.వీటిలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలతో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు కూడా ఉన్నాయి.ఈ సమావేశాల్లో 1,53,697 మంది విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని తమ పిల్లల చదువు,హాజరు,అభ్యాస నైపుణ్యాలు,భవిష్యత్ లక్ష్యాలపై ఉపాధ్యాయులతో ప్రత్యక్షంగా చర్చించారు.పాఠశాలలకు రూ. 46.67 లక్షల నిధులుఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిం చేందుకు ప్రభుత్వం జిల్లాలోని పాఠశాలలకు రూ.46,67,400 విడుదల చేసింది. విద్యార్థుల సంఖ్య ఆధారంగా పాఠశాలలకు నిధులు కేటాయించారు.

**నిధుల కేటాయింపు ఇలా...** 0-30 మంది విద్యార్థులు - రూ.900,31-100 మంది - రూ.2,250,101-250 మంది- రూ.4, 500,251-1000 మంది - రూ.6,750,1001 మందికి పైగా - రూ.9,000,ఈ నిధులతో పాఠశాలల అలంకరణ, స్వాగత ఏర్పాట్లు, విద్యార్థుల ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, తాగునీరు, ఇతర మౌలిక ఏర్పాట్లు చేపట్టారు.

**అందంగా ముస్తాబైన పాఠశాలలు..** జిల్లాలోని పాఠశాలలను రంగురంగుల తోరణాలు, బెలూన్లు, పూల అలంకరణలు, స్వాగత ద్వారాలు, రంగవల్లులతో ప్రత్యేకంగా అలంకరించారు. తల్లిదండ్రులకు ఘన స్వాగతం పలుకుతూ విద్యార్థులు సంప్రదాయబద్ధంగా ఆహ్వానం అందించారు. పాఠశాలల ప్రాంగణాల్లో విద్యార్థుల విజ్ఞాన ప్రదర్శనలు, సైన్స్ నమూనాలు, కళాఖండాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

**విద్యార్థుల ప్రతిభకు ప్రోత్సాహం..** చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక, విజ్ఞాన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రజా ప్రతినిధులు, అధికారులు అభినందించి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా సత్కరించారు.

**తల్లిదండ్రులతో ముఖాముఖి సమావేశాలు..** ప్రతి తరగతి ఉపాధ్యాయులు తమ తరగతికి చెందిన విద్యార్థుల అభ్యాస స్థాయి, హాజరు, ప్రవర్తన, ప్రతిభ, మెరుగుపరచాల్సిన అంశాలను తల్లిదండ్రులకు వివరించారు. ఇంటి వద్ద పిల్లలకు చదువులో సహకారం అందించాలని, రోజువారీ అభ్యాసంపై పర్యవేక్షణ అవసరమని సూచించారు.

**ప్రభుత్వ విద్యలో తీసుకొచ్చిన మార్పులపై అవగాహన..** సమావేశాల్లో ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మౌలిక సదుపాయాల అభివృద్ధి, డిజిటల్ తరగతి గదులు, ఆంగ్ల మాధ్యమ బోధన, స్మార్ట్ తరగతులు, మధ్యాహ్న భోజన పథకం, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, విద్యా సామగ్రి వంటి కార్యక్రమాలపై తల్లిదండ్రులకు వివరించారు.

**'విద్యార్థి మిత్ర' కిట్ల పంపిణీ..** సమావేశం అనంతరం విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ 'విద్యార్థి మిత్ర' కిట్లను ప్రజాప్రతినిధులు, అధికారులు, తల్లిదండ్రుల సమక్షంలో పంపిణీ చేశారు. ఈ కిట్లలో నాణ్యమైన యూనిఫాం వస్త్రాలు, నోట్‌బుక్స్, పాఠ్యపుస్తకాలను పాఠశాలల ప్రారంభోత్సవ సమయంలో అందజేయగా.. పాఠశాల బ్యాగ్, బెల్ట్, షూస్, సాక్స్ తదితర విద్యా సామగ్రిని ఈ సమావేశంలో అందజేశారు. విద్యార్థులపై ఆర్థిక భారం తగ్గిస్తూ, ప్రతి విద్యార్థికి సమాన విద్యా అవకాశాలు కల్పించాలనే ప్రభుత్వ లక్ష్యాన్ని ఈ కార్యక్రమం ప్రతిబింబిస్తోందని అధికారులు తెలిపారు. కిట్లు అందుకున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేయగా, ప్రజాప్రతినిధులు విద్యార్థులు అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

**సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించిన విద్యార్థులు..** విద్యార్థులు దేశభక్తి గీతాలు, జానపద నృత్యాలు, యోగా ప్రదర్శనలు, నాటికలు, సంగీత కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. పాఠశాలల అభివృద్ధి, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, విద్య ప్రాముఖ్యతపై విద్యార్థులు సందేశాత్మక ప్రదర్శనలు ఇచ్చారు.

**ప్రభుత్వ విద్యపై విశ్వాసానికి నిదర్శనం..** జిల్లావ్యాప్తంగా జరిగిన మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్‌కు లభించిన విశేష స్పందన ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనంగా నిలిచింది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమన్వయం ద్వారా విద్యార్థుల విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపర్చడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని అధికారులు, ప్రజాప్రతినిధులు వారి ప్రసంగాల ద్వారా తెలిపారు. ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేసే దిశగా ఈ సమావేశాలు కీలక పాత్ర పోషిస్తాయని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆయా నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, పెద్ద ఎత్తున విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి

### - మెగా పేరెంట్స్,టీచర్స్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి











**ప్రొద్దుటూరు,జూలై 24:** మెగా పేరెంట్స్ టీచర్స్ కార్యక్రమం విద్యావ్యవస్థలో సంస్కరణలకు మార్పునని విద్యార్థులు కష్టంగా ఇష్టంగా విద్యనభ్యసించి విద్యను ఉన్నతలక్ష్యంతో చదవాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి తెలిపారు.పట్టణంలోని స్థానిక టి.బి.రోడ్డులోని ఎద్దుల వెంకటసుబ్బమ్మ పురపాలక ఉన్నత పాఠశాల నందు మెగా పేరెంట్స్ టీచర్స్ కార్యక్రమంలో శుక్రవారం పాల్గొన్న ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి.ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ నేటి పిల్లలే రేపటి పౌరులని ప్రతి ఒక్కరూ బాగా చదువుకొని మంచి ఉన్నతమైన స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.ఈ సందర్భ ంగా మాట్లాడిన శ్రీనివాస రెడ్డి కూటమి ప్రభుత్వం విద్యారంగానికి పె ద్దపీట వేస్తోందని తెలిపారు.చదువుకునే ప్రతి విద్యార్థికి అండగా నిలిచేం దుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'తల్లికి వందనం' పథకం ద్వారా రెండో ఏడాది కూడా అర్హులైన ప్రతి విద్యార్థి తల్లి ఖాతాలో రూ.15,000 చొ ప్పున ఆర్థిక సాయం జమ చేస్తూ చదువుకు పేదరికం అడ్డంకి కాకూ డదనే ఆశయంతో ముందుకు సాగుతున్నామని తెలియజేశారు. పాఠశా లల్లో మౌలిక వసతుల కల్పన,నాణ్యమైన విద్య,పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం మరియు విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను విద్యార్థుల తల్లిదండ్రులకు సమగ్రంగా వివరించారు.పిల్లలను మంచిగా చదివించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు.విద్యార్థులతో కలిసి సరదాగా తానో ఎమ్మెల్యేనని కాకుండా తాను కూడా విద్యార్థిలాగా విద్యార్థులతో కలిసి ఆటలు ఆడిన ఎమ్మెల్యే.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య,రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు,మాజీ పట్టణ అధ్యక్షులు ఇవి సుధాకర్ రెడ్డి,ఎంఈవో సావిత్రమ్మ,ప్రధానోపాధ్యాయులు విజయ్ భాస్కర్,పాఠశాల తల్లిదండ్రుల సంఘం చైర్మన్ లక్ష్మీ,ఉపాధ్యాయులు మరియు పాఠశాల సిబ్బంది విధ్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మొడంపల్లి ఉర్దూ హై స్కూల్‌లో ఘనంగా మెగా పేరెంట్స్ టీచర్స్ కార్యక్రమం




ప్రజాకలం ప్రొద్దుటూరు,జూలై 24: పట్టణం లోని మొడంపల్లి ఉర్దూ హైస్కూల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ ఆత్మీయ సమావేశం లోముఖ్య అతిథిగా షేక్ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ డా.వివిఎస్ ముక్తియార్ శుక్రవారం పాల్గొని ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు బాగా చదువుకుని మంచి మార్కులు తీసుకుని ఉన్నత చదువులు చదివి మన స్కూల్‌కి ఉన్న ఊరికి మంచి పేరు తేవాలని ఆయన కోరారు ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులు. తల్లికి వందనం మరియు డ్రస్సులు మధ్యాహ్న భోజన పథకం అన్ని సౌకర్యాలు ఉన్నప్పుడు బాగా చదివి మంచి ఫలితాలను సాధించాలని కోరారు." స్కూల్‌లో మంచి మార్కులు సాధించిన ఏడు మందికి విద్యార్థి విద్యార్థినులకు మన ప్రజా సేవాసమితి ఆధ్వర్యంలో మెమెంటోస్,స్మార్ట్ వాచ్,కిచెన్ గ్లాస్ బౌల్ విద్యార్థులకు ఇచ్చి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో మన ప్రజా సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు డా అయూబ్ ఖాన్,ప్రధానోపాధ్యాయులు మనోహర్,విద్యా కమిటీ చైర్మన్ లాల్ బాషా,టౌన్ బ్యాంక్ డైరెక్టర్ ఖలీల్.,విశ్రాంత ఉపాధ్యాయులు గౌస్ లాజం,సాదిక్,మార్కెట్ ఖాదర్ వలీ.,ఉపాధ్యాయులు.విద్యా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి కృషి

### - ఆర్కేవ్యాలి డైరెక్టర్ ఆచార్య జీ.విజయ ప్రకాష్



**వేంపల్లి,జూలై 24:** స్కిల్ సెన్సస్ - 2026 ద్వారా విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఆర్కేవ్యాలి ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య జీ.విజయ ప్రకాష్ వెల్లడించారు. శుక్రవారం ఆర్కేవ్యాలి క్యాంపస్ లో స్కిల్ సెన్సస్-2026 పరిక్షను ఆన్లైన్ విధానంలో విజయవంతంగా నిర్వహించారు. డైరెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమలకు అవసరమైన ప్రాథమిక ఉద్యోగ నైపుణ్యాలను అంచనా వేయడమే ఈ పరిక్ష ముఖ్య ఉద్దేశమన్నారు. విద్యార్థుల నైపుణ్యాలను అంచనా వేసి, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ప్రతి విద్యార్థికి డిజిటల్ స్కిల్ కార్డు అందజేయ నున్నట్లు తెలిపారు. క్యాంపస్ కి సంబంధించి అన్ని శాఖలకు చెందిన 693 మంది ఫైనల్ ఇయర్ ఇంజనీరింగ్ విద్యార్థులు ఈ పరిక్షకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పరిపాలనాధికారి డా.రవికుమార్, అకాడమీక్ డీన్లు రమేష్ కైలాస్, రూపస్, స్టూడెంట్ వెల్ఫేర్ వెంకటేష్, ప్లేస్మెంట్ ఇంచార్జీ సత్యానంద రామ్, అధికారి సుందర్ తదితర అధ్యా పకులు పాల్గొన్నారు.

# కోడూరు, కడప పోస్టల్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల తనిఖీ...!

### - వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించాలని ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారి సూచన



**కడప,జూలై 24:** విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారి నందులాల్ భూక్యా, ఐఎఫ్ఎస్, శుక్రవారం వైఎస్ఆర్ కడప జిల్లాలో పర్యటించి కోడూరు, కడప పోస్టల్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల పనితీరును పరిశీలించారు. ప్రజలకు అందుతున్న పాస్‌పోర్ట్ సేవల నాణ్యత, పారదర్శకత, సేవల వేగంపై సమీక్ష నిర్వహించి, మరింత మెరుగైన సేవలు అందించే దిశగా అధికారులకు పలు సూచనలు చేశారు.ముందుగా కోడూరు పోస్టల్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రాన్ని సందర్శించిన ఆయన అక్కడ నిర్వహిస్తున్న సేవలను పరిశీలించారు. అనంతరం కడపకు చేరుకున్న ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారికి స్టేట్ గెస్ట్ హౌస్‌లో కడప పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ జి. రాజేష్, కడప పోస్టల్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రం ఇన్‌చార్జి వి.ఓ. సుమిత్ కుమార్, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పి. మునాఫ్ ఘన స్వాగతం పలికారు.తదుపరి కడప పోస్టల్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రాన్ని సందర్శించిన నందులాల్ భూక్యా, అక్కడ దరఖాస్తుదారులకు కల్పిస్తున్న సౌకర్యాలు, సేవల నిర్వహణ, దరఖాస్తుల పరిష్కార వేగం, పారదర్శకతపై అధికారులతో సమీక్షించారు. కేంద్రంలోని అధికారులు, సిబ్బందితో సమావేశమై ప్రజలకు మరింత వేగవంతమైన, నాణ్యమైన, సౌకర్యవంతమైన పాస్‌పోర్ట్ సేవలు అందించేలా అవసరమైన సూచనలు చేశారు.ఈ పర్యటనతో ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయం, విజయవాడతో పాటు భారత తపాలా శాఖ ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన, సమర్థవంతమైన పాస్‌పోర్ట్ సేవలు అందించేందుకు కట్టుబడి ఉన్నట్లు మరోసారి స్పష్టమైంది.

# రిజిస్ట్రేషన్ సేవలకు అంతరాయం లేదు.

### - సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉచిత డాక్యుమెంట్ తయారీ సేవలు.

**కడప,జూలై 24:** వైఎస్సార్ కడప జిల్లా ప్రజలకు జిల్లా రిజిస్ట్రార్ తెలియజేయునదేమనగా, రాష్ట్ర ప్రభుత్వం జి.ఓ.ఎం.ఎస్. నెం.396 ద్వారా ప్రజలకు మరింత పారదర్శకమైన,సులభమైన, వేగవంతమైన మరియు ప్రజా కేంద్రిత రిజిస్ట్రేషన్ సేవలను అందించాలనే లక్ష్యంతో రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అయితే, ఈ జి.ఓ.ను ఉపసంహరించుకోవాలని కోరుతూ డాక్యుమెంట్ రైటర్ల సంఘం సభ్యులు 20 నుండి సమ్మె చేపట్టారు. రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల అమలుతో తమ జీవనోపాధికి భంగం కలుగుతుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ అంశంపై డాక్యుమెంట్ రైటర్ల సంఘంతో చర్చించి సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించేందుకు గౌరవ కమిషనర్ మరియు ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్, ఆంధ్రప్రదేశ్ 23న సంఘ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆ సమావేశంలో సంఘ ప్రతినిధులు సమ్మెను విరమించుకోవడానికి అంగీకరించి, అందుకు సంబంధించిన నిర్ణయంపై సామూహికంగా సంతకాలు కూడా చేశారు.అయితే, అనంతరం వారు తమ నిర్ణయాన్ని మార్చుకుని సమ్మెను కొనసాగించాలని నిర్ణయించడంతో, రిజిస్ట్రేషన్ సేవల కోసం కార్యాలయాలకు వచ్చే ప్రజలకు అసౌకర్యం ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా రిజిస్ట్రేషన్ సేవలను నిరంతరంగా అందించేందుకు రిజిస్ట్రేషన్ & స్టాంపులు శాఖ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిన పబ్లిక్ డేటా ఎంట్రీ మాడ్యూల్ ద్వారా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనే డాక్యుమెంట్ల తయారీ, డేటా ఎంట్రీ తదితర సేవలను శాఖ సిబ్బంది ప్రజలకు అందిస్తున్నారు.ఈ సేవల కోసం ప్రజల నుండి ఎటువంటి రుసుము వసూలు చేయబడదు. డాక్యుమెంట్ తయారీ మరియు డేటా ఎంట్రీ సేవలు పూర్తిగా ఉచితంగా అందించబడతాయి. శాఖ అధికారులు మరియు సిబ్బంది ప్రజలకు అవసరమైన పూర్తి సహాయ సహకారాలు అందించి,రిజిస్ట్రేషన్ ప్రక్రియను సజావుగా, వేగవం తంగా పూర్తి చేయడానికి సిద్ధంగా ఉన్నారు.జిల్లా ప్రజలు యథావిధిగా పూర్తి చేసుకోవాలని జిల్లా రిజిస్ట్రార్ పివియన్ బాబు విజ్ఞప్తి చేస్తున్నారు.

# అటు జక్కంపూడి.. ఇటు భూమన..

విజయవాడ : వైసీపీ మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజ చుట్టూ చట్టపరమైన ఉచ్చు బిగుస్తోంది. ఒక దళిత సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) పై ఆయన చేసిన వివాదాస్పద వ్యాఖ్యల వ్యవహారం ఇప్పుడు రాష్ట్రంలో తీవ్ర సంచలనంగా మారింది. సీఐ శేషయ్యను ఉద్దేశించి జక్కంపూడి రాజా అత్యంత అవమానకరమైన మరియు కుల దూషణలతో కూడిన వ్యాఖ్యలు చేశారంటూ పెద్ద ఎత్తున ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ ఘటనపై దళిత సంఘాలు మరియు పోలీస్ వర్గాల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఈ వివాదాస్పద వ్యాఖ్యలపై జాతీయ ఎస్సీ కమిషన్ తీవ్రంగా స్పందించింది. కమిషన్ జారీ చేసిన కఠిన ఆదేశాల మేరకు పోలీసులు జక్కంపూడి రాజాపై కేసు నమోదు చేసి, దర్యాప్తును ముమ్మరం చేశారు. కొత్త చట్టం ప్రకారం బిఎన్ఎస్ 351(2) సెక్షన్‌తో పాటు అత్యంత కఠినమైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం కింద ఆయనపై నాన్-బైలబుల్ కేసులు నమోదు చేసి విచారణను వేగవంతం చేశారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా కర్నూలు పోలీసులు రాజమహేంద్రవరానికి చేరుకుని జక్కంపూడి రాజా నివాసంలో ఆయనకు అధికారికంగా నోటీసులు అందజేశారు. ఈ నెల 28వ తేదీన విచారణాధికారి ముందు స్వయంగా హాజరుకావాలని ఆ నోటీసుల్లో పోలీసులు స్పష్టం చేశారు. ఒక బాధ్యతాయుతమైన దళిత పోలీస్ అధికారిపై వైసీపీ సీనియర్ నేత ఇలాంటి వ్యాఖ్యలు చేయడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. అయితే, ఆయనపై నమోదైన సెక్షన్లు ఎస్సీ-ఎస్టీ అట్రాసిటీ చట్టం కిందకు రావడం, పైగా నాన్-బైలబుల్ (జామీను లేని) నిబంధనలు ఉండటంతో జక్కంపూడి రాజాకు అరెస్ట్ గండం పొంచి ఉందని తెలుస్తోంది. ఈ నెల 28న జరిగే విచారణలో ఆయన సమాధానాలు సంతృప్తికరంగా లేకపోయినా, లేదా విచారణకు హాజరుకాకుండా ముఖం చాటేసినా పోలీసులు అతన్ని ఏ క్షణమైనా అరెస్ట్ చేసే అవకాశం ఉందని విశ్వసనీయ సమాచారం. దీంతో ఈ కేసు రాష్ట్ర రాజకీయాల్లో మరింత ఉత్కంఠ రేపుతోంది.

తిరుపతిలో... తిరుపతి జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ అక్రమాలపై కూటమి ప్రభుత్వం దర్యాప్తును తీవ్రతరం చేసింది. తిరుపతి మాజీ ఎమ్మెల్యే, వైసీపీ సీనియర్ నేత భూమన కరుణాకర్‌రెడ్డి తిరుచానూరు పరిధిలోని స్వర్ణముఖి నది తీరంలో ఉన్న విలువైన ప్రభుత్వ అసైన్డ్ భూములను ఆక్రమించారనే ఆరోపణలపై అధికార యంత్రాంగం నిశితంగా విచారణ జరుపుతోంది. నదీ గర్భాన్ని సైతం వదలకుండా పెద్ద ఎత్తున కబ్జాలకు పాల్పడ్డారనే ఫిర్యాదులపై మలిదశ దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. భూమన కరుణాకర్‌రెడ్డి అక్రమంగా కబ్జా చేసిన ప్రభుత్వ భూమిని తక్షణమే స్వాధీనం చేసుకోవాలని గతంలోనే న్యాయస్థానం స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసింది. అయితే కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ, వాటిని అమలు చేయడంలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై జిల్లా కలెక్టర్ కఠిన చర్యలకు ఉపక్రమించారు. ఈ క్రమంలోనే కోర్టు ఉత్తర్వులను అమలు చేయకుండా అలసత్వం ప్రదర్శించిన ముగ్గురు రెవెన్యూ అధికారులకు (ఎమ్మార్వోలు) జిల్లా కలెక్టర్ అధికారికంగా ఛార్జ్ మెమోలు జారీ చేశారు. కలెక్టర్ నుంచి ఛార్జ్ మెమోలు అందుకున్న వారిలో గతంలో తిరుపతి రూరల్ మండల తహసీల్దార్ (ఎమ్మార్వో)గా పనిచేసిన రామానుజుల నాయక్, ప్రస్తుత తిరుపతి రూరల్ ఎమ్మార్వో జయంత్, అలాగే శ్రీకాళహస్తి ఎమ్మార్వో ఉన్నారు. భూకబ్జాల వ్యవహారంలో గత ప్రభుత్వ ఒత్తిళ్లకు తలొగ్గి ఉదాసీనంగా వ్యవహరించిన మరికొందరు అధికారుల జాబితాను కూడా సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. తన ఆస్తులు ధ్వంసం చేసినా తాను వెనక్కి తగ్గబోనని.. ప్రజా సమస్యలపై కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించడం కొనసాగిస్తానని భూమన కరుణాకర్ రెడ్డి స్పష్టం చేశారు. దీంతో ఈ భూముల వివాదం ప్రస్తుతం అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర రాజకీయ మాటల యుద్ధానికి దారితీస్తోంది. భూముల యాజమాన్యం, రికార్డులు, ఆక్రమణల అంశాలపై రెవెన్యూ శాఖ విచారణ కొనసాగుతోంది. గత 21 ఏళ్లుగా ముఖ్యమంత్రులుగా రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి, చంద్రబాబు నాయుడు సీఎంగా ఉన్నప్పుడు ఈ భూములు కనిపించలేదా అని భూమన కరుణాకర్ రెడ్డి ఏపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తాను కూటమి ప్రభుత్వ విధానాలపై బలంగా గొంతు ఎత్తుతున్నందుకే ఈ కక్ష్య సాధింపు చర్యలు చేస్తున్నారని మండిపడ్డారు. తాను మోసాలు, అవినీతి చేసినవాడ్ని కాదని తేల్చి చెప్పారు. తిరుపతిలో రౌడీ రాజకీయాలకు ఎన్నడూ అవకాశం లేదని.. తన జీవితం అంతా విలువలతో కూడిన రాజకీయాలు చేశానని చెప్పుకొచ్చారు. 1991లో ప్రారంభించిన హెరిటేజ్ సంస్థ కూడా నది పోరంబోకు స్థలంలోనే ఉందని.. తన కుటుంబ ఆస్తులు దాడి చేయడం ద్వారా తనకు మరింత ఉత్సాహం వచ్చిందని.. ఇదే ఉత్సాహంతో కూటమి ప్రభుత్వ తప్పులను ప్రజల ముందు ఉంచుతానని హెచ్చరించారు. ఈ భూ అక్రమాలకు సహకరించిన మిగిలిన అధికారులపై సైతం త్వరలోనే కఠినమైన శాఖాపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని రెవెన్యూ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

# జగన్ నెక్స్ట్ ప్లాన్



విజయవాడ : ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాల అపాయింట్‌మెంట్ కోసం ప్రయత్నిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. గతంలో ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఢిల్లీ పెద్దల తలుపులు ఆయన కోసం ఎప్పుడూ తెరిచే ఉండేవి. ఆయన ఎప్పుడు దిల్లీ వెళ్లినా ప్రధాని, హోంమంత్రుల అపాయింట్‌మెంట్లు సులువుగా లభించేవి. కానీ, నేడు ఏపీలో రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. వైఎస్సార్‌సీపీ అధికారం కోల్పోయి ప్రతిపక్షానికి పరిమితమవ్వడమే కాకుండా, కేంద్రంలో ఏపీలోని కూటమి ప్రభుత్వ భాగస్వామ్య పార్టీలైన టీడీపీ, జనసేనలు ఎన్డీఏ లో అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తున్నాయి. ఈ తరుణంలో జగన్ ఢిల్లీ మంత్రాంగం ఆయనకే రివర్స్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్నది తెలుగుదేశం, జనసేన, బీజేపీల సంయుక్త ఎన్డీఏ ప్రభుత్వం. ఒక రకంగా చెప్పాలంటే మోదీ, అమిత్ షాల నాయకత్వంలోని కేంద్ర ఎన్డీఏ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు కీలక భాగస్వాములు. ఇలాంటి సమయంలో, రాష్ట్రంలో అధికార కూటమి ప్రభుత్వంపై ఫిర్యాదు చేయడానికి జగన్ వెళ్లి అదే ఎన్డీఏ పెద్దలను కలవాలని చూడటం రాజకీయంగా రివర్స్ అవుతుంది. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం తన స్వంత కూటమి భాగస్వాములను పక్కనబెట్టి, ప్రతిపక్షంలో ఉన్న వైఎస్సార్‌సీపీకి ప్రాధాన్యత ఇస్తుందని భావించడం వ్యూహాత్మక అపరిపక్వతే అవుతుంది. కూటమి ప్రభుత్వంపై మోదీ, షాలకు ఫిర్యాదు చేసినా, దానికి ప్రాధాన్యత లభించకపోగా.. జగన్ రాజకీయంగా మరింత రక్షణలో పడే ప్రమాదం ఉంది. జగన్ మోహన్ రెడ్డి ఢిల్లీ పర్యటనలు, అపాయింట్‌మెంట్ల ప్రయత్నాలు జరిగిన ప్రతిసారీ ప్రజాక్షేత్రంలో ఒక్కటే బలమైన ప్రచారం జరుగుతుంది. అదేమిటంటే.. ఆయనపై ఉన్న సీబీఐ, ఈడీ అక్రమాస్తుల కేసులు, ఇతర విచారణల నుంచి ఉపశమనం పొందేందుకే ఆయన బీజేపీ పెద్దల చుట్టూ తిరుగుతున్నారనే భావన. గత ఐదేళ్ల పాటు పార్లమెంట్‌లో ఎన్డీఏకి అవసరమైన ప్రతి బిల్లుకూ ముందూ వెనుక ఆలోచించకుండా బేషరతుగా మద్దతు ప్రకటించిన జగన్, ఇప్పుడు కూడా బీజేపీ గుడ్ లుక్స్ లో ఉండేందుకే తాపత్రయపడుతున్నారని భావిస్తున్నారు. ఈ తరహా పర్యటనలు ఆయన ప్రతిపక్ష నాయకుడిగా సాధించే ప్రజాదరణ కంటే, కేసుల భయంతోనే ఢిల్లీ పెద్దలకు నమస్కరిస్తున్నారు అనే ముద్రను మరింత బలపరుస్తాయి. ఒకపక్క రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాన్ని, బీజేపీతో కలిసున్న చంద్రబాబు-పవన్ జోడీని తీవ్రస్థాయిలో విమర్శిస్తూ.. మరోపక్క అదే బీజేపీ అగ్రనేతల అపాయింట్‌మెంట్ కోసం ప్రయత్నాలు చేయడం వైఎస్సార్‌సీపీ క్షేత్రస్థాయి క్యాడర్‌లో తీవ్ర గందరగోళానికి దారితీస్తోంది. పార్టీ శ్రేణులు రాష్ట్రంలో కూటమిపై పోరాడాలా లేక ఢిల్లీ స్థాయిలో సంధి ప్రయత్నాలు జరుగుతున్నాయని మౌనంగా ఉండాలా అనే సందిగ్ధంలో పడిపోతున్నాయి. ప్రతిపక్షంగా ప్రజా సమస్యలపై పోరాడి బలం పుంజుకోవాల్సిన సమయంలో, అధినేత పదేపదే ఢిల్లీ పెద్దల ఆశీస్సుల కోసం చూడటం పార్టీ సైద్ధాంతిక స్టాండ్‌నే ప్రశ్నించేలా చేస్తోంది. ఈ భేటీలు ఒకవేళ సాధ్యమైనా, జగన్ రాజకీయంగా సాధించేది ఏమీ ఉండదనేది రాజకీయ విశ్లేషకుల స్పష్టమైన అంచనా. జగన్ ఇస్తే ఒకట్రెండు రాజ్యసభ ఓట్లు తప్ప, లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ బలం నామమాత్రంగా మారింది. అలాంటప్పుడు కేంద్ర పెద్దలు తమ కూటమి భాగస్వామి అయిన చంద్రబాబును కాదని జగన్‌కు రాజకీయ ప్రాధాన్యత లేదా ఊరట ఇస్తారనుకోవడం పొరపాటే. ఈ ప్రతిపాదన వల్ల కూటమి నేతలకు జగన్‌ను ఢిల్లీకి వెళ్లి చేతులు కట్టుకుని నిలబడే నాయకుడు అని విమర్శించేందుకు అనువైన ఆయుధం దొరికినట్లవుతుంది. ఓ వైపు కేంద్రంపై వ్యతిరేకత పెరుగుతోందన్న వాతావరణం ఏర్పడుతోంది. ఢిల్లీలో కాక్రోచ్‌ల ఉద్యమం ఓ రేంజ్‌కు చేరుకుంది. ప్రస్తుత రాజకీయ వాతావరణంలో వైఎస్సార్‌సీపీకి అత్యంత అవసరమైనది ప్రజల్లో ఉండటం, అసెంబ్లీలో ప్రతిపక్ష పాత్రను పటిష్టంగా పోషించడం. ఢిల్లీ పెద్దల వద్దకు వెళ్లి హాజరు వేయించుకోవడం వల్ల లేదా వినతిపత్రాలు ఇవ్వడం వల్ల వచ్చే పొలిటికల్ మైలేజ్ శూన్యం. దానికి బదులుగా, ఆ పర్యటనలు తెచ్చే రాజకీయ ప్రతికూలత, పక్షపాత ముద్రలు పార్టీకి మరింత నష్టాన్ని కలిగిస్తాయని ఎక్కువ మంది భావిస్తున్నారు. అయితే అపాయింట్మెంట్ లభిస్తే.. బయట ప్రచారం ఉన్నట్లుగా టీడీపీ కంటే ఎక్కువగా వైసీపీకే మోదీ ప్రాధాన్యం ఇస్తారని అనుకుంటారు. కానీ అది కూడా వైసీపీకి ఏ విధంగానూ మేలు చేయదు

**అర్థం కానీ జగన్ వ్యూహం...** దేశవ్యాప్తంగా దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం వర్సెస్ ఇండియా కూటమి ప్రతిపక్షాల నడుమ తీవ్రమైన రాజకీయ పొలరైజేషన్ నడుస్తోంది. నీట్ క్వశ్చన్ పేపర్ లీకేజీ వ్యవహారం నుంచి పార్లమెంట్ నిరసనల వరకు ప్రతి అంశమూ కేంద్ర వర్సెస్ విపక్షాలుగా ప్రత్యక్ష రణరంగాన్ని తలపిస్తోంది. అయితే, దేశమంతటా ఈ స్థాయిలో రాజకీయ వేడి రగులుతుంటే.. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం చిత్రమైన రాజకీయ నిశ్శబ్దం అలముకుంది. ఏపీలో కూడా ఎన్డీఏ శ్రేణుల పాలన నడుస్తుండటం, ప్రధాన ప్రతిపక్షంగా వైయస్సార్‌సీపీ ఉండటంతో జాతీయ స్థాయి అంశాలపై ఇక్కడ కూడా రాజకీయ సెగ రావలసి ఉంది. కానీ, ఆ స్థాయి ప్రతిస్పందన ఏపీ రాజకీయాల్లో కనిపించకపోవడం పొలిటికల్ సర్కిల్స్‌లో పెద్ద ఎత్తున చర్చకు దారితీస్తోంది. రాష్ట్రంలో విపక్ష హోదాలో ఉన్న కాంగ్రెస్ పార్టీ క్షేత్రస్థాయిలో నీట్ బాధితులు, విద్యార్థుల పక్షాన నిరసన ప్రదర్శనలు చేపట్టినప్పటికీ, ఏపీలో ఆ పార్టీకి ఉన్న పరిమిత బలమైన కేడర్, ఓటు బ్యాంక్ దృష్ట్యా ఆ ఆందోళనలు అధికార పక్షంపై పెద్దగా ప్రభావం చూపలేకపోయాయి. నిజానికి, వైయస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ఇది ఓ అరుదైన రాజకీయ అవకాశం. రాష్ట్రంలో లక్షలాది మంది నీట్ అభ్యర్థులు, యువత ఆందోళనలో ఉన్న వేళ, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను నిలదీస్తూ గళమెత్తి ఉంటే ప్రధాన ప్రతిపక్షంగా వైయస్సార్‌సీపీకి మైలేజీ వచ్చి ఉండేది. కానీ, వైయస్సార్‌సీపీ ఈ వ్యవహారంలో ప్రత్యక్షంగా విద్యార్థి పోరాటంలోకి దూకలేకపోయింది. ఢిల్లీ వేదికగా కాంగ్రెస్ నాయకత్వం వహిస్తున్న ప్రతిపక్షాల సమరానికి జగన్ మద్దతు ఇవ్వకపోవడం వెనుక ఆయన సొంత రాజకీయ సమీకరణలు ఉన్నప్పటికీ, కనీసం స్వతంత్రంగా విద్యార్థుల హక్కుల కోసమైనా గళం విప్పకపోవడం రాజకీయ విశ్లేషకులను ఆశ్చర్యపరిచింది. కాంగ్రెస్‌తో జట్టుకట్టడం ఇష్టం లేకపోయినా, యువత బహుళ ప్రయోజనాలతో ముడిపడి ఉన్న ఈ అంశంపై క్షేత్రస్థాయిలో తిరుగుబాటు జెండా ఎగరేసి ఉంటే వైయస్సార్‌సీపీ మళ్లీ జనామోదాన్ని పొందేందుకు అది నైతిక బలాన్ని ఇచ్చేది. కానీ, జగన్ ధైర్యంగా ముందుకు రాకపోవడం వల్ల ఏపీలో అధికార కూటమికి ఎలాంటి విపక్ష నిరసనల సెగ తగలకుండా సురక్షితంగా బయటపడే అవకాశం లభించింది. జాతీయ స్థాయిలో నడుస్తున్న ప్రతిపక్షాల వేవ్‌ను తమకు అనుకూలంగా మలుచుకోవడంలో వైయస్సార్‌సీపీ నాయకత్వం చూపుతున్న 'అతి జాగ్రత్త వైఖరి వెనుక బలమైన కారణాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వంతో నేరుగా విభేదించడం వల్ల రాబోయే రోజుల్లో చట్టపరమైన సమస్యలు ఎదురవుతాయనే భయాలు వైయస్సార్‌సీపీ వైఖరిని నియంత్రిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో ఢిల్లీ పర్యటనల ద్వారా కేంద్రంతో సత్సంబంధాలు కొనసాగించేందుకు జగన్ యత్నించిన తీరు చూస్తే, ఆయన కేంద్ర అధికార పీఠంతో నేరుగా ఢీ కొట్టేందుకు అస్సలు సిద్ధంగా లేరని స్పష్టమవుతోంది. ఈ రక్షణాత్మక రాజకీయ ధోరణి వల్ల ప్రధానంగా నష్టపోతోంది వైయస్సార్‌సీపీ మాత్రమేనని చెబుతున్నారు. ఒక ప్రతిపక్షంగా ప్రజలు, యువత ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై వీధుల్లోకి వచ్చి పోరాడటంలో విఫలమైనప్పుడు, ఆ రాజకీయ ఖాళీని ఇతర శక్తులు పూరించే ప్రమాదం ఉంది. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన ఘోర పరాజయం నుంచి పార్టీ కేడర్‌ను తిరిగి సమీకరించడానికి, కొత్త ఉత్సాహాన్ని నింపడానికి నీట్ వంటి జాతీయ అంశం ఒక అద్భుతమైన రాజకీయ అస్త్రంగా ఉపయోగపడి ఉండేది. కానీ, ఆ అవకాశాన్ని వైయస్సార్‌సీపీ చేజేతులా వదులుకుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రతిపక్షం నుంచి గట్టి ప్రతిఘటన లేదా రాజకీయ నిరసనలు లేకపోవడంతో, కూటమి ప్రభుత్వం తమ పాలనాజెండాను చాలా సులువుగా అమలు చేయగలుగుతోంది. ఒకవైపు దేశమంతటా విపక్షాలు కేంద్రాన్ని కుదిపేస్తుంటే, ఏపీలో మాత్రం ఎన్డీఏ ప్రభుత్వం ఎటువంటి రాజకీయ ఇబ్బందులు లేకుండా అత్యంత కంఫర్టబుల్ జోన్‌లో కొనసాగుతోంది. జాతీయ స్థాయిలో వస్తున్న అవకాశాలను అందుకోవడంలో, ప్రజా సమస్యలపై అగ్రెసివ్ మైలేజీ సాధించడంలో వైఎస్ జగన్ అనుసరిస్తున్న ఈ వెనకడుగు వైఖరి వైయస్సార్‌సీపీ భవిష్యత్ రాజకీయాలకు ప్రతిబంధకంగా మారే అవకాశం ఉంది.

# 89 శాతం కూటమి వైపే ఉన్నారా...

విజయవాడ : ఏపీలో తాజాగా మరోసారి ఐవీఆర్ ఎస్ సర్వే జరిగిందా? ప్రజల అభిప్రాయాలను మరోసారి సీఎం చంద్రబాబు తెలుసుకున్నారా? వారి అభిప్రాయాలను దూసుకున్నారా? అంటే.. ఔననే అంటున్నారు టీడీపీ నాయకులు. పార్టీ పరంగా కాదు.. ఈ సారి కూడా సర్కారు పరంగానే సర్వే సాగిందని చెబుతున్నారు. పార్టీ వర్గాల కథనం మేరకు.. గత మే-జూన్ నెలల్లో రాష్ట్ర వ్యాప్తంగా 4 లక్షల మంది నుంచి ప్రభుత్వం ఫీడ్ బ్యాక్ తీసుకుంది. ప్రధానంగా ఇది సర్కారు విజయంపైనే సాగిందని చెబుతున్నారు. ం మొత్తంగా 5 అంశాలపై ఈ దఫా ఐవీఆర్ ఎస్ సర్వే సాగిందని నాయకులు తెలిపారు. 1) ప్రభుత్వ సంక్షేమ పథకాలు: వీటిపైనే ఎక్కువగా ఫోకస్ చేస్తున్న సర్కారు.. గత వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన దానికంటే ఎక్కువగానే ఇస్తున్నారు. అలాగే.. అన్ని వర్గాలకు కూడా మేలు చేస్తున్నారు. 2) అన్న క్యాంటీన్లు: గత వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిన దీనిని తాజాగా కొనసాగిస్తున్నారు. ఇది అనేక వేల మందికి మేలు చేస్తోంది. 3) పరిపాలన: క్షేత్రస్థాయిలో కార్యాలయాలకు వెళ్లే అవసరాన్ని దాదాపు తప్పిస్తూ..వాట్సాప్ పాలనను తీసుకువచ్చారు 4) గ్రామీణాభివృద్ధి: ప్రస్తుతం గత రెండేళ్లలో గ్రామీణ ప్రాంతాల్లో భారీ అభివృద్ధి జరిగింది. ప్రస్తుతం జరుగుతోంది కూడా. ఇలా.. ఈ నాలుగు అంశాలను సర్వేల్లో తీసుకున్నారు. నిజానికి ఇప్పటి వరకు ఎమ్మెల్యేల పనితీరు, స్థానిక నాయకుల పనితీరుపై సర్వేలు జరిగినా.. ఇంత విస్తృత స్థాయిలో ప్రభుత్వ పనితీరుపై సర్వే జరగడం ఇదే తొలిసారి అనేది నాయకులు చెబుతున్నారు. ఇక, చివరిగా.. 5వ అంశం.. కూటమి ప్రభుత్వంపై ప్రజల స్పందన. ఇదే అత్యంత కీలకమని చెబుతున్నారు. దీనిపై ప్రజల నుంచి సానుకూల స్పందన లభించింది. వచ్చే ఎన్నికల్లో కూటమిగానే వెళ్లాలని కోరుకుంటున్న వారి సంఖ్య 89 శాతం వరకు ఉందని సర్వేలో స్పష్టమైంది.

గత కొన్నాళ్లుగా ఇదే మాట ఇటు నాయకులు కూడా చెబుతున్నారు. కూటమిగా ఉంటేనే మేలు జరుగుతుందని అంటున్నారు. తాజాగా ప్రజల నుంచి కూడా అదే అభిప్రాయం వెల్లడి కావడం గమనార్హం. దీంతో ఇప్పుడు మరింత జోరుగా కూటమి ఐక్యతనే తారకమంత్రంగా పఠించనున్నారు. పార్టీలలో ఎన్ని బేధాభిప్రాయాలు ఉన్నప్పటికీ.. కూటమి ఐక్యతకే ప్రాధాన్యం ఇవ్వనున్నారు. సో.. మొత్తంగా ఇప్పటి కంటే కూడా.. కూటమి ఐక్యతకు ఇక నుంచి మరింత ఇంపార్టెన్స్‌తోపాటు.. మరింతగా కలివిడితనానికి ప్రభుత్వం పరంగా కూడా ప్రాధాన్యం దక్కనుంది.

# 43 లక్షల మంది లిస్ట్ మిస్

విజయవాడ : రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. అధికార కూటమి ప్రభుత్వం సర్ పై కుట్రలు చేస్తోందని, వైసీపీ సానుభూతిపరుల ఓట్లను లక్ష్యంగా చేసుకుని పెద్దఎత్తున ఓట్ల తొలగిస్తోందని ఆ పార్టీ ఆరోపణలు చేస్తోంది. ఈ మేరకు వైసీపీ అధికారిక ట్విటర్ ఖాతాలో పోస్టు పెట్టింది. ఓటు హక్కును కాలరాసేలా ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని, బూత్ స్థాయి అధికారులను (బీఎల్వో) బెదిరించి ప్రతిపక్షానికి పట్టున్న జిల్లాల్లో ఉద్దేశపూర్వకంగానే ఓట్లను గల్లంతు చేస్తున్నారని వైసీపీ తీవ్ర ఆరోపణలు చేసింది. రాష్ట్రంలో తిరుపతి జిల్లాలో 16.38 శాతం ఓట్లు తొలగించారని ఎత్తిచూపింది. రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియ మరో రెండు రోజుల్లో ముగియనుంది. నిజానికి 14వ తేదీనే సర్ సర్వే ముగియాల్సివుండగా, అధికార, విపక్షాల వినతి మేరకు దేశంలో ఎక్కడా లేని విధంగా పది రోజుల పాటు పొడిగించారు. అయితే మరో రెండు రోజుల్లో ఈ ప్రక్రియ ముగియనుండగా, సర్ లో అక్రమాలు చోటుచేసుకున్నాయని వైసీపీ చేసిన ఆరోపణలు సంచలనంగా మారాయి. వైసీపీ మద్దతుదారుల ఓట్లను తొలగించడానికి ప్రయత్నాలు జరిగాయని వైసీపీ ఆందోళన వ్యక్తం చేస్తోంది. గడువు ముగిసేనాటికి రాష్ట్రంలో మరిన్ని ఓట్లు తొలగించే ప్రమాదం ఉందని ఆ పార్టీ నాయకులు ఆవేదన చెందుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 43,62,387 ఓట్లు గల్లంతు అయినట్లు వైసీపీ ఆరోపించింది. మొత్తంగా 10.48 శాతం ఓటర్లను తొలగించడంపై ఆ పార్టీ అనుమానాలు వ్యక్తం చేస్తోంది. ఎక్కువ ఓట్లు గల్లంతు అయిన జిల్లాల్లో తిరుపతి జిల్లా ఏకంగా 16.38 శాతంతో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచిందని వైసీపీ వెల్లడించింది. ఈ జిల్లాలో తమ పార్టీకి ఎక్కువ బలం ఉండటంతోనే ఓట్లను భారీగా తొలగించారని ఆపార్టీ అనుమానం వ్యక్తం చేస్తోంది. ఇక రాష్ట్రంలోని మొత్తం 4.16 కోట్ల మంది ఓటర్లలో 14.87 లక్షల మంది చనిపోయిన వారి ఓట్లను గుర్తించి తొలగించినట్లు చెబుతుండగా, మరో 13.68 లక్షల మంది శాశ్వత వలసదారుల పేరుతో ఓట్లను తొలగించారని లెక్కలు విడుదల చేసింది.

# లింక్డిన్‌లో వైజాగ్ టాప్

విశాఖపట్టణం : ఆంధ్రప్రదేశ్‌లో లెక్కలు మారుతున్నాయి.. రాష్ట్రానికి కంపెనీల రాకతో యువతకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా విశాఖపట్నానికి ఐటీ కంపెనీలతో పాటుగా డేటా సెంటర్లు, పరిశ్రమలు రావడంతో అక్కడ ఉద్యోగ అవకాశాలు పెరిగాయి. దేశవ్యాప్తంగా ఉద్యోగ అవకాశాలు వేగంగా పెరుగుతున్న నగరాల్లో విశాఖపట్నం టాప్‌లో నిలిచింది. మొన్నటి వరకు 3వ స్థానంలో ఉన్న విజయవాడ 10వ స్థానానికి పడిపోయింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంపై ఫోకస్ పెట్టింది. జిల్లాల వారీగా పరిశ్రమలు, ఐటీ కంపెనీలను తీసుకొస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయి.. దేశవ్యాప్తంగా ఉద్యోగ అవకాశాలు వేగంగా పెరుగుతున్న నగరాల జాబితాలో ఏపీకి స్థానం దక్కింది. ప్రొఫెషనల్ నెట్‌వర్కింగ్ సర్వీస్ లింక్డిన్ సిటీస్ ఆన్ ది రైజ్ పేరుతో విడుదల చేసిన సెకండ్ ఎడిషన్ జాబితాలో విశాఖపట్నం మొదటి స్థానంలో నిలిచింది. లుధియానా రెండో స్థానం, సూరత్ మూడో స్థానం, వడోదర నాలుగో స్థానం, ప్రయాగ్‌రాజ్ ఐదో స్థానం, రాజ్‌కోట్ ఆరో స్థానం, జబల్‌పూర్ ఏడో స్థానం, రాంచీ ఎనిమిదో స్థానం, రాయ్‌పూర్ తొమ్మిదో స్థానం, విజయవాడ పదో స్థానంలో నిలిచాయి. అయితే గతంలో మూడో స్థానంలో నిలిచిన విజయవాడ ఈసారి పదో స్థానానికి పడిపోయింది. లింక్డిన్ న్యూస్, డేటా సైంటిస్టులు రూపొందించిన ఈ ర్యాంకింగ్‌లకు సంబంధించి.. ఉద్యోగ అవకాశాలు, నియామకాలు, టాలెంట్ మైగ్రేషన్ పెరుగుతున్న అభివృద్ధి చెందుతున్న నగరాలను గుర్తిస్తున్నారు. మార్చి 2024 నుంచి ఫిబ్రవరి 2026 మధ్య కాలంలో లక్షలాది లింక్డిన్ సభ్యుల ప్రొఫైల్‌లు, ఉద్యోగ ప్రకటనల నుంచి సేకరించిన డేటా ఆధారంగా ఈ ర్యాంకింగ్స్ రూపొందించారు. గూగుల్ ఏఐ హబ్, రిలయన్స్ డేటా సెంటర్ ప్రాజెక్ట్, ఇన్ఫోసిస్, కాగ్నిజెంట్, యాక్సెంచర్ విస్తరణలతో సహా భారీ స్థాయి పెట్టుబడుల కారణంగా విశాఖపట్నానికి టాప్ ప్లేస్ దక్కింది. అంతేకాదు విశాఖపట్నంలో ఐటీ సేవలు, ఫార్మా, టెక్నాలజీ రంగాలలో ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయి. వీటిలో డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్, లారస్ ల్యాబ్స్, మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్ వంటి ప్రధాన సంస్థలు ఉన్నాయి. నగరంలోని ఉద్యోగాలలో 17.1 శాతం రిమోట్ పద్ధతిలో, 5.2 శాతం హైబ్రిడ్ పద్ధతిలో ఉన్నాయి. బలమైన జాబ్ మార్కెట్, ఉద్యోగుల సంఖ్య అధికంగా ఉన్న నగరాలను లింక్డిన్ గుర్తించింది. 10 నాన్ మెట్రో నగరాలకు ర్యాంకులు కేటాయించగా.. ఇక్కడ ప్రతి పోస్టుకు దరఖాస్తుదారుల సంఖ్య రెట్టింపు కంటే ఎక్కువగా ఉందని తేలింది. దేశంలో అభివృద్ధి చెందుతున్న నగరాలు ప్రత్యేకంగా, ఆయా రంగాల్లో ఉపాధి అవకాశాలు సృష్టించుకుంటున్నట్లుగా తేలింది. విశాఖలో ఐటీతో పాటుగా ఫార్మా, తయారీ రంగం, డేటా సెంటర్లు, పోర్టు వంటివి కీలకంగా మారాయి.

ఇక రెండో స్థానంలో నిలిచిన లుధియానాలో ఉక్కు, విమానయానం, ఆతిథ్య రంగాల్లో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా దక్కుతున్నాయి. సూరత్ టెక్స్‌టైల్, వజ్రాలు, స్టార్టప్‌లు, రియల్ ఎస్టేట్ ద్వారా విస్తరిస్తోంది. వడోదరలో కెమికల్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, ఎంటర్‌ప్రైజ్ పెట్టుబడులు వస్తున్నాయి. విజయవాడలో కూడా ఐటీ, ఈ-గవర్నెన్స్ కంపెనీల నుంచి ఆసక్తి పెరుగుతోంది. ఈ 10 నగరాల్లోనూ తొలి మూడు నియామకాల్లో ఐటీ సేవలు, టెక్నాలజీ, కన్సల్టింగ్ సర్వీసులు ఉన్నాయి. మిగతా నగరాల్లో బ్యాంకింగ్, ఆర్థిక సేవలు ఉన్నాయని లింక్డిన్ చెబుతోంది.

# పుష్ప బ్రిడ్జిగా స్పెషల్ ఎట్రాక్షన్

విశాఖపట్టణం : సోషల్ మీడియా.. అదో నిరంతర ప్రవాహం. వింతల నుంచి విశేషాల వరకూ.. యుద్ధాల నుంచి సినిమాల వరకూ.. నిత్యం ఎన్నో పోస్టులు, వేలకొద్దీ వీడియోలు.. ఇక ఇందులో ప్రకృతి గురించి, ప్రకృతి అందాల గురించి ఎన్నో విశేషాలను షేర్ చేస్తుంటారు. అలా షేర్ చేసిన ఓ వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. చూడగానే వావ్ ఎక్కడిదీ స్పాట్ అని అనకుండా ఉండలేం.. దాని గురించి ఆరా తీసిన తర్వాత ఓసారైనా వెళ్లొద్దామని మనసు లాగడం ఖాయం. అలాంటిదే ఇప్పుడు చెప్పుకోబోయే బ్రిడ్జ్.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలంలోని మోతుగూడెంలో ఉంది ఈ వంతెన. మోతుగూడె ఫోర్‌బే డ్యామ్ బ్రిడ్జ అని పిలుస్తారు. లోయర్ సీలేరు హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ ప్రాజెక్టులో భాగంగా మోతుగూడెం ఫోర్‌బే డ్యామ్ నిర్మించారు. చుట్టూ దట్టమైన అడవులు, కొండలు.. పచ్చదనం పరుచుకున్న వాతావరణం మధ్య ఉన్న ఈ డ్యామ్.. ప్రకృతి ప్రియులను, పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. ఈ ప్రకృతి అందాలను చూసి సినిమా డైరెక్టర్లు కూడా ఇక్కడ షూటింగ్‌లు జరుపుతుంటారు. ఇక పుష్ప సినిమా షూటింగ్ తర్వాత.. మోతుగూడెం ఫోర్ బే డ్యామ్ బ్రిడ్జ కాస్తా..పుష్ప బ్రిడ్జ్‌గా పేరు తెచ్చుకుంది. పుష్ప సినిమాలోని కొన్ని సీన్లను ఇక్కడ చిత్రీకరించడంతో.. సినిమాతో పాటుగా ఈ ప్రాంతం కూడా బాగా పాపులర్ అయ్యింది. అప్పటి నుంచి ఇక్కడికి వచ్చే పర్యాటకుల సంఖ్య మరింత పెరిగింది. చుట్టూ లక్కవరం అటవీ ప్రాంతం, పచ్చని కొండల మధ్య సాగే మార్గం.. ఇక్కడ స్పెషల్ అట్రాక్షన్‌గా నిలుస్తున్నాయి.

ఇక కరెంట్ ఉత్పత్తి తర్వాత డొంకరాయి డ్యామ్ నుంచి పవర్ కెనాల్ ద్వారా నీరు ఈ డ్యామ్‌లోకి చేరుతుంది. ఆ సమయంలో ఈ డ్యామ్ మరింత అందాన్ని సంతరించుకుంటుంది.

# గోదావరి జిల్లాల్లో ఎవరి లెక్కలు వారివి?

కాకినాడ : ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకు గుండెకాయ లాంటి ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో అధికార కూటమి పచ్చని సంసారంలో స్థానిక సంస్థల ఎన్నికల సెగలు రేపుతోంది. రాష్ట్ర స్థాయిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మధ్య మైత్రి ఫెవికాల్ బంధంలా అత్యంత బలంగా కనిపిస్తున్నప్పటికీ.. క్షేత్రస్థాయికి వచ్చేసరికి సీన్ పూర్తిగా మారుతోంది. సార్వత్రిక ఎన్నికల నాటి త్యాగాలు, సర్దుబాట్లు ఒకెత్తయితే.. ఇప్పుడు ముంచుకొస్తున్న స్థానిక సంస్థల సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల వేళ ఏ గ్రామానికి ఆ గ్రామంలో సీట్ల పంచాయితీ ముదిరిపాకాన పడుతోంది. పొత్తుల రొంపిలో ఇరు పార్టీల ద్వితీయ శ్రేణి నాయకులు, అటు తమ్ముళ్లు, ఇటు జనసైనికులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ముఖ్యంగా పిఠాపురం, భీమవరం, అమలాపురం నియోజకవర్గాల అంతర్గత గ్రామాల్లో టీడీపీ–జనసేన లీడర్ల మధ్య నడుస్తున్న కోల్డ్ వార్ ఇప్పుడు సోషల్ మీడియా వేదికగా రచ్చకెక్కుతోంది. పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలోని పల్లెల్లో ప్రెసిడెంట్ సీటు ఎవరిదనే దానిపై హోరాహోరీ పోరు సాగుతోంది. గత ఐదేళ్లుగా వైఎస్సార్‌సీపీ వేధింపులను తట్టుకుని, కేడర్‌ను కాపాడుకుంటూ వచ్చిన స్థానిక టీడీపీ నేతలు.. ఎమ్మెల్యే సీటునే జనసేనకు త్యాగం చేశాం, కనీసం ఊరి సర్పంచ్ సీటైనా మాకు ఇవ్వకపోతే ఎలా అని గట్టిగా నిలదీస్తున్నారు. మరోవైపు, తమ అధినేత నియోజకవర్గం కాబట్టి మెజారిటీ గ్రామాలు తమకే దక్కాలని జనసైనికులు పట్టుబడుతుండటంతో అంతర్గత వర్గపోరు పీక్స్‌కు చేరింది. పశ్చిమ గోదావరి కేంద్రమైన భీమవరంలోనూ ఇదే తరహా ఉత్కంఠ వాతావరణం నెలకొంది. ఏ గ్రామంలో ఏ పార్టీ వార్డు దక్కించుకోవాలి? ఎవరికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి? అనే అంశంపై ప్రతి ఊరిలోనూ రచ్చబండ పంచాయితీలు జరుగుతున్నాయి. ఉమ్మడి వేదికలపై పైకి నవ్వుతూ షేక్‌హ్యాండ్‌లు ఇచ్చుకుంటున్న స్థానిక నేతలు.. లోపల మాత్రం ఎవరికి వారు గ్రూపు రాజకీయాలు నడుపుతున్నారు. ఒకరు పిలిచిన కార్యక్రమాలకు మరొకరు డుమ్మా కొట్టడం, లోకల్ వాట్సాప్ గ్రూపుల్లో పరోక్ష విమర్శలతో పోస్టులు పెట్టుకోవడం వంటి పరిణామాలు క్షేత్రస్థాయిలో అసంతృప్తికి అద్దం పడుతున్నాయి. అమలాపురం రూరల్ పరిధిలో సమీకరణాలు మరింత క్లిష్టంగా మారాయి. ఇక్కడ సామాజిక వర్గాల ఈక్వేషన్లు ఎప్పుడూ హాట్ టాపిక్కే. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ.. నిధుల కేటాయింపులు, గ్రామీణ పనుల కాంట్రాక్టుల విషయంలో టీడీపీ, జనసేన ద్వితీయ శ్రేణి నేతల మధ్య తీవ్రమైన పోటీ నెలకొంది. అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా క్షేత్రస్థాయిలో మాకు సరైన ప్రాధాన్యత దక్కడం లేదు అనే గుబులు జనసేన కిందిస్థాయి లీడర్లలో కనిపిస్తుంటే.. మెజారిటీ ఓటు బ్యాంకు మాదే, సీట్ల కేటాయింపులో సింహభాగం మాకే దక్కాలి అని తమ్ముళు వాదిస్తున్నారు. ఈ పట్టువిడుపులు లేని ధోరణి ఉమ్మడి జిల్లాల అంతటా కూటమి సమన్వయాన్ని దెబ్బతీస్తోంది. అసెంబ్లీ సీట్ల సర్దుబాటు కంటే స్థానిక సంస్థల సీట్ల సర్దుబాటే చంద్రబాబు–పవన్ కళ్యాణ్‌లకు అసలైన పరీక్ష అని చెబుతున్నారు. ఎందుకంటే ఎమ్మెల్యే సీటు అనేది నియోజకవర్గానికి ఒక్కటే ఉంటుంది కాబట్టి నచ్చజెప్పడం సులువు. కానీ, వేలాదిగా ఉండే వార్డులు, వందలాదిగా ఉండే సర్పంచ్ స్థానాల్లో ఏ ఒక్కరికి అన్యాయం జరిగినా సదరు లీడర్ రెబెల్‌గా మారే ప్రమాదం ఉంది లేదా పక్కనే పొంచి ఉన్న విపక్ష వైఎస్సార్‌సీపీకి లాభం చేకూర్చే అవకాశం ఉంది. గోదావరి జిల్లాల్లో ఏ మాత్రం తేడా వచ్చినా అది రాష్ట్ర వ్యాప్త కూటమి గ్రాఫ్‌పై ప్రభావం చూపిస్తుంది. ముగింపుగా చెప్పాలంటే.. గోదావరి జిల్లాల గ్రామాల్లో తమ్ముళ్లు, సైనికుల మధ్య సాగుతున్న ఈ సీట్ల పంచాయితీని అధిష్టానం ఎంత త్వరగా సెటిల్ చేస్తే అంత మంచిది. పైస్థాయిలో ఉన్న దోస్తీ.. కిందిస్థాయి గడప దాకా చేరకపోతే, స్థానిక సంస్థల ఎన్నికల వేళ ఉమ్మడి జిల్లాల కోటల్లో అంతర్గత తిరుగుబాట్లు తప్పవు. మరి ఈ పొత్తుల రొంపి నుంచి ఇరు పార్టీల స్థానిక లీడర్లను చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఎలా గట్టెక్కిస్తారో చూడాలి.

# 13 మంది మంత్రులకే డేంజర్ బెల్స్

విజయవాడ : ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఇటీవలే రెండేళ్లు పూర్తి చేసుకుంది. గత ఎన్నికల్లో ఎవ్వరూ ఊహించని విధంగా కేవలం 11 సీట్లకు మాత్రమే పరిమితం అయిన వైఎస్సార్‌సీపీ అసలు ఇప్పట్లో పుంజుకుంటుందా ? ఆ పార్టీ కేడర్ రోడ్డెక్కుతారా ? అన్న సందేహాలు అందరిలోనూ కలిగాయి. కానీ ఆశ్చర్యంగా రెండేళ్లకే ఆ పార్టీ నాయకత్వం ఇస్తోన్న పిలుపునకు వైసీపీ కేడర్ ఉత్సాహంగా రోడ్లెక్కేస్తున్నారు. వైసీపీ ఇంత త్వరగా కోలుకుని మూడు పార్టీల కూటమి ప్రభుత్వంతో ఢీ అంటే ఢీ అనే పరిస్థితి వస్తుందని ఎవ్వరూ ఊహించి ఉండరు. దీనికి చాలా కారణాలు, తప్పులు కనిపిస్తున్నాయి. ఎమ్మెల్యేల ఇష్టారాజ్యం అయిపోయింది. ఎమ్మెల్యేలు ఎవ్వరూ ముఖ్యమంత్రి లేదా తమ పార్టీ అధినేతలు చెప్పినట్టు వినే పరిస్థితి లేదు. ఈ విషయంలో పరిస్థితి చేయిదాటిపోయింది. చంద్రబాబు గతానికి భిన్నంగా ఈ సారి తన కేబినెట్లో కొత్త వాళ్లకు అవకాశం ఇచ్చారు. వాళ్లలో ఎక్కువ మంది తొలిసారి అసెంబ్లీకి ఎన్నికైన వారు కూడా ఉన్నారు. వీళ్లు తమ శాఖల పరంగా పట్టు సాధించడంలోనూ , ఇటు పార్టీకి ఉపయోగపడడంలోనూ దారుణంగా విఫలమవుతున్నారు. తెలుగుదేశం నుంచి కేబినెట్ మంత్రులుగా ఉన్న వారిలో ఏకంగా 13 మంది కొత్తవాళ్లే ఉన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇదే కేబినెట్‌తో చంద్రబాబు ఎన్నికలకు వెళితే ఖచ్చితంగా ఇబ్బందులు తప్పవని పార్టీలో సీనియర్ నాయకులు తమ అంతర్గత చర్చల్లో సంభాషించుకుంటున్నారు. శాఖలకు మంత్రులుగా ఎవరు ఉన్నా.. జిల్లాల పరంగా పవర్ ఫుల్ వ్యక్తులు లేకపోతే ఖచ్చితంగా అది ఎన్నికలపై, జిల్లా అభివృద్ధిపై ప్రభావం చూపుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఎన్నికలకు మరో మూడేళ్ల టైం కూడా లేదు.. అందుకే డైనమిక్‌గా ఉండేవాళ్లకే కేబినెట్లో చోటు కల్పించాల్సిన అవసరం ఉంది. కేబినెట్లో ఉన్న మంత్రుల్లో ఎక్కువ మంది మంత్రుల పనితీరుపై కూడా చంద్రబాబు, లోకేష్ ఇద్దరూ ఎంతమాత్రం సంతృప్తిగా లేరని అంటున్నారు. దసరాకు కాస్త అటూ ఇటూగా కేబినెట్లో మార్పులు, చేర్పులు ఉండవచ్చని అంటున్నారు. ఫస్ట్ టైం ఛాన్స్ మిస్ అయ్యిన వారికి రెండో విడతలో ఖచ్చితంగా ఛాన్స్ ఇస్తారని అంటున్నారు. తొలిసారి కేబినెట్లో చోటు దక్కించుకున్న వాళ్లలో అనగాని సత్యప్రసాద్, వంగలపూడి అనిత, పయ్యావుల కేశవ్, గొట్టిపాటి రవికుమార్, మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి, కొండపల్లి శ్రీనివాస్, సుభాష్, సవిత, టి జీ భరత్, బి సి జనార్దన్ రెడ్డి , నిమ్మల రామానాయుడు, గుమ్మడి సంధ్యా రాణి, డోలా బాల వీరాంజనేయ స్వామి ఉండగా.. వీరిలో సగానికి పైగా మంత్రుల పనితీరు అసలు ఏ మాత్రం బాగోలేదంటున్నారు. విచిత్రం ఏంటంటే సీనియర్ ఎమ్మెల్యేలు మంత్రులుగా ఉన్నచోట కూడా ఆరోపణలు వస్తున్నాయి. రెవెన్యూ, విద్యుత్ శాఖ, ఆర్థికశాఖలపై కూడా ప్రజల్లోనూ, ప్రభుత్వ వర్గాల్లో అంత సంతృప్తి లేదంటున్నారు ఇక అన్నింటింకి మించి కూటమి ప్రభుత్వంలో బిల్స్ వైసీపీ నేతలు చెప్పిన వాళ్లకు క్లీయర్ అవుతున్నాయన్నది బయటకు వచ్చేసింది. టీజీ భరత్ వివాద రహితుడే అయినా ఆయన శాఖ ఆయన చేతుల్లో లేదంటున్నారు. రాష్ట్రానికి ఏ పరిశ్రమ, పెట్టుబడి వచ్చినా అది లోకేష్ ఖాతాలోకి వెళ్లిపోతోంది. కొన్ని పరిశ్రమల ప్రారంభోత్సవానికి కూడా సంబంధిత శాఖా మంత్రికి ఆహ్వానం ఉండడం లేదని సచివాలయ వర్గాల్లో చెవులు కొరుక్కుంటున్నారు. ఏదేమైనా అటు మంత్రుల పట్ల, ఇటు ప్రభుత్వం పట్ల, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలు విషయంలోనూ ప్రజలు అయితే సంతృప్తిగా లేకపోవడంతోనూ రెండేళ్లకే ఇంత వ్యతిరేకత కనపడుతోందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

# స్థానిక ఎన్నికల్లో వైసీపీకి చావుదెబ్బ.. కూటమి ప్లాన్ అదుర్స్

విజయవాడ : కూటమి ప్రభుత్వం వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. స్థానిక ఎన్నికల నిర్వహణకు సిద్ధపడుతోంది. సాధారణంగా పంచాయతీ ఎన్నికలు అనేవి ముందుగా జరపడం సహజం. కానీ కూటమి ప్రభుత్వం మాత్రం మున్సిపల్ ఎన్నికల వైపు మొగ్గు చూపింది. ముందుగా పట్టణాల్లో ఎన్నికలను నిర్వహించాలని నిర్ణయించింది. దీని వెనుక భారీ వ్యూహం ఉన్నట్లు తెలుస్తోంది. 100కు పైగా మున్సిపాలిటీలు, 12 కార్పొరేషన్లను కైవసం చేసుకుని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని కోలుకోలేని దెబ్బతీయాలన్నది కూటమి ప్రణాళికగా తెలుస్తోంది. గ్రామీణ ప్రాంతాలతో పోల్చుకుంటే పట్టణ ప్రాంతాల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చాలా బలహీనంగా ఉంది. అందుకే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చావు దెబ్బ తీసేందుకు ముందుగా మున్సిపల్ ఎన్నికల వైపు కూటమి అడుగులు వేస్తోంది. మున్సిపల్ ఎన్నికల తర్వాత ప్రాదేశిక.. చివరిగా పంచాయితీ ఎన్నికలు నిర్వహించాలన్నది ప్రణాళికగా తెలుస్తోంది. పట్టణాల్లో విద్యాధికులు, ఉద్యోగ ఉపాధ్యాయులు అధికంగా ఉంటారు. అయితే వారిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్ల ఒక రకమైన వ్యతిరేక భావన ఉంది. పైగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విధానాలు కూడా పట్టణ ప్రాంత ప్రజలకు నచ్చడం లేదు. ఆ పార్టీ నేతలు చేస్తున్న ప్రకటనలు కూడా మింగుడు పడడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో గతంలో సంక్షేమ పథకాలు అమలు చేయడం వంటి కారణాలతో వైసిపికి ఓటు బ్యాంకు స్థిరంగా ఉంది. ఆపై స్థానిక సంస్థలకు సంబంధించిన ప్రజాప్రతినిధులు ఇటీవల వరకు కొనసాగారు. వారు పట్టు నిలుపుకుంటూ వచ్చారు. అందుకే ముందుగా పంచాయితీలకు ఎన్నికలు నిర్వహిస్తే కూటమికి కాస్త ఇబ్బందికరంగా ఉండే అవకాశం ఉంది. పైగా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవాలు అనే మాట ఉండకూడదు అని జగన్ సొంత పార్టీ క్యాడర్ను హెచ్చరించారు. అలా చేస్తే పార్టీ నియోజకవర్గ బాధ్యతలను మార్చేస్తానంటూ ఇంచార్జ్‌ను హెచ్చరించారు. అందుకే ముందుగా మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహించి తర్వాత మిగతా స్థానిక సంస్థలకు నిర్వహించాలన్నది కూటమి ప్రభుత్వ ఆలోచనగా అర్థం అవుతుంది. పట్టణాల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలహీనంగా ఉండడంతో ఆ పార్టీకి ఇబ్బందికర పరిస్థితులు రావడం ఖాయం. పైగా మూడు పార్టీల కలయికతో కూటమి దూకుడుగా ఉంటుంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో జత కలిపేందుకు ఏ పార్టీ ముందుకు రాదు. పైగా మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ అనుసరించిన తీరు ఆ పార్టీ శ్రేణులకు తెలుసు. అధికార పార్టీ ఎలాంటి దూకుడు కనబరుస్తుందో ఆ పార్టీకి తెలియంది కాదు.. అందుకే ముందుగా మున్సిపల్ ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని చావు దెబ్బ కొట్టి.. మిగతా ప్రాదేశిక ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోంది కూటమి. చివరిగా గ్రామీణ ప్రాంతాలకు ప్రతీకలుగా నిలిచే పంచాయితీలను ఏకపక్షంగా గెలుచుకొని.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పుంజుకునే పరిస్థితి లేకుండా చేయాలన్నది కూటమి ఆలోచన. అందుకే ముందుగా మున్సిపల్ ఎన్నికల వైపు ప్రభుత్వం మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. అక్టోబర్ నుంచి డిసెంబరు లోపు మొత్తం స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి చేయాలన్నది ప్రభుత్వ ఆలోచనగా అర్థం అవుతుంది. చూడాలి మరి ఏం జరుగుతుందో??

# కాపు నేతల తిరుగుబాటు

రాజమండ్రి : కాపు అస్త్రంతో కూటమిని చీల్చాలని జగన్మోహన్ రెడ్డి భావించారు. ఇప్పుడు అదే కాపు అస్త్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని గుచ్చుకోబోతోంది. కూటమిని ఇరకాటంలో పెట్టేందుకు, కాపు ఓటు బ్యాంకును ఆకట్టుకోవడానికి కాపుల అంశాన్ని ఒక రాజకీయ రణరంగంగా మార్చాలని జగన్ భావించారు. కానీ ఆ ప్రయత్నం వికటించి.. చివరకు సొంత పార్టీలోనే నిప్పు పెట్టబోతోందని సంకేతాలు వెలువడుతున్నాయి. పార్టీ లైన్ దాటి వైసిపి కాపు నేతలు వ్యవహరిస్తుండడం ఇప్పుడు హార్ట్ టాపిక్ అవుతోంది. ప్రధానంగా కాపు రిజర్వేషన్ల అంశం మరోసారి తెరపైకి వచ్చింది. వైసిపి కాపు నేతలే ఈ అంశాన్ని తెరపైకి తెచ్చి పార్టీని ఇరకాటంలో పెట్టే ప్రయత్నం చేస్తుండడం విశేషం. కాపు ఉద్యమ నాయకుడు ముద్రగడ పద్మనాభం సంస్మరణ సభ జరిగింది. అయితే సభకు హాజరైన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కాపు నేతలు కాపు రిజర్వేషన్ అంశాన్ని ప్రస్తావించారు. నిన్నటి వరకు జగన్మోహన్ రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా.. చాలా జాగ్రత్తగా మసులుకున్నారు నేతలు. ఇప్పుడు హఠాత్తుగా కాపు రిజర్వేషన్ల అజెండాను భుజానికి ఎత్తుకోవడం వెనుక సొంత పార్టీపై తిరుగుబాటు అన్నట్టు సంకేతాలు వస్తున్నాయి. ఎందుకంటే చంద్రబాబు ఇచ్చిన ఆర్థిక వెనుకబాటు రిజర్వేషన్లను కాపులకు నిలిపివేశారు జగన్మోహన్ రెడ్డి. ఇప్పుడు అదే కాపు రిజర్వేషన్లను ప్రస్తావించడం ద్వారా తమ అధినేత చేసిన తప్పిదాన్ని మరోసారి గుర్తు చేస్తున్నారు. 2014 ఎన్నికల్లో కాపులకు రిజర్వేషన్ల హామీ ఇచ్చారు చంద్రబాబు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయనందున ముద్రగడ పద్మనాభం కాపు రిజర్వేషన్ ఉద్యమాన్ని ప్రారంభించారు. అది పతాక స్థాయికి చేరుకోవడంతో చంద్రబాబు ప్రభుత్వం కాపులకు ఐదు శాతం ఈడబ్ల్యూఎస్ కోటాలో రిజర్వేషన్లను కేటాయించింది. కాపులు ఆర్థికపరమైన పథకాలను సొంతం చేసుకున్నారు. అయితే ఆ రిజర్వేషన్లను అధికారంలోకి వచ్చిన తర్వాత రద్దు చేశారు జగన్ మోహన్ రెడ్డి. రిజర్వేషన్లు అనేది కేంద్రం పరిధిలోని అంశం అని.. అది తన వల్ల కాదు అని తేల్చి చెప్పారు. అయితే అప్పట్లో ఏ కాపు నేత కూడా దానిని వ్యతిరేకించలేదు. కాపుల్లోకి ఇది బలంగా వెళ్లడంతో 2024 ఎన్నికల్లో విపరీతమైన ప్రభావం చూపింది. ప్రస్తుతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కాపు నేతలు రిజర్వేషన్ల విషయం ప్రస్తావించారు. కాపులకు రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇది జగన్ వైఖరికి పూర్తి భిన్నం. మరోవైపు కాపు ఐక్యత సభకు సంబంధించి టిడిపి ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వర రావుకు మద్దతు తెలిపారు తోట త్రిమూర్తులు.

# దసరా నుంచి వందే భారత్ స్లీపర్


విజయవాడ : ఏపీ ప్రజలకు భారీ గుడ్ న్యూస్. రైల్వేశాఖ సూపర్ న్యూస్ అందించనుంది. ఏపీ మీదుగా వందే భారత్ స్లీపర్ రైళ్లను నడిపేందుకు కసరత్తులు చేస్తోంది. విజయవాడ డివిజన్ మీదుగా ఏపీలో తొలి వందే భారత్ స్లీపర్ రైలును ప్రవేశపెట్టాలని నిర్ణయం తీసుకుంది. దేశంలో తొలి స్లీపర్ రైలును ఈ ఏడాది జనవరిలో హౌరా–గువహతి మధ్య రైల్వేశాఖ ప్రవేశపెట్టింది. ప్రధాని మోదీ స్వయంగా దీనిని పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ప్రస్తుతం ఏపీ మీదుగా సాధారణ వందే భారత్ రైళ్లు నడుస్తున్నాయి. సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం, తిరుపతి వరకు, కాచిగూడ నుంచి బెంగళూరు, నర్సాపురం నుంచి చెన్నైకు రైళ్లు నడుస్తున్నాయి. అయితే స్లీపర్ రైళ్లు లేకపోవడంతో ఇప్పుడు వాటిని కూడా తీసుకొచ్చేందుకు రైల్వేశాఖ ప్రయత్నాలు చేస్తోంది. దసరా నాటికి విజయవాడ మీదుగా వందే భారత్ స్లీపర్ రైలు అందుబాటులోకి తీసుకురావాలని రైల్వేశాఖ సన్నాహాలు చేస్తోంది. విశాఖపట్నం నుంచి బెంగళూరు, విజయవాడ నుంచి బెంగళూరు మధ్య ఈ రైళ్లను నడిపేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ఇక విజయవాడ నుంచి అయోధ్య, విజయవాడ నుంచి ఢిల్లీకి నడిపితే బాగుంటుందని మరికొంతమంది ప్రతిపాదిస్తున్నారు. దీంతో ఏ రూట్లో అనేది క్లారిటీ లేనప్పటికీ.. దసరా నాటికి ఏపీలో తొలి వందే భారత్ స్లీపర్ రైలు పట్టాలెక్కనుందని తెలుస్తోంది. వందే భారత్ స్లీపర్ రైళ్లల్లో అత్యాధునిక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. మెరుగైన కుషనింగ్, లేటెస్ట్ ఇంటీరియల్స్, ఇంటర్నెట్, ఛార్జింగ్ పాయింట్లు, ఆటోమేటిక్ డోర్లు, ఎల్ఈడీ డోర్లు, ఎల్ఈడీ లైట్లు, సౌండ్ ప్రూఫ్, ప్రత్యేక సెన్సార్లు వంటివి ఉన్నాయి. విమానం తరహాలోనే అత్యాధునిక సౌకర్యాలు ఉంటాయి. వందే భారత్ స్లీపర్ రైళ్లు గంటకు 160 నుంచి 180 కిలోమీర్ల వేగంతో ప్రయాణిస్తాయి. ఇందులో ఫస్ట్, సెకండ్, థర్డ్ ఏసీ బోగీలు ఉంటాయి. ఇప్పటికే ప్రారంభమైన హౌరా–గువహతి తొలి వందే భారత్ స్లీపర్ రైలులో మొత్తం 16 కోచ్‌లు ఉన్నాయి. ఈ ట్రైన్లో కనీస ఛార్జి రూ.960 నుంచి ప్రారంభమవుతుంది. అయితే స్లీపర్ రైళ్లల్లో ఆర్ఏసీ, వెయిటింగ్ లిస్ట్ వంటివి ఉండవు. కన్ఫార్మ్‌డ్ టికెట్ ఉన్నవారిని మాత్రమే ప్రయాణానికి అనుమతిస్తారు. వీటిల్లో సౌండ్ ప్రూఫ్ సిస్టమ్ ఉండటంతో ఎలాంటి సౌండ్స్, కుదుపులు అనేవి ఉండవు. దీంతో రాత్రి సమయంలో ప్రశాంతంగా ప్రయాణం చేయవచ్చు. అటు సికింద్రాబాద్–ఢిల్లీ రూట్లో కూడా వందే భారత్ స్లీపర్ రైలు తీసుకురావాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే ప్రయత్నాలు చేస్తోంది.

# పక్క చూపులు చూస్తున్న కన్నబాబు



విశాఖపట్టణం : అనకాపల్లి జిల్లా రాజకీయాల్లో కీలక నేతగా గుర్తింపు పొందిన మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు వ్యవహారశైలి ఇటీవల మరోసారి చర్చనీయాంశంగా మారింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలకు ఆయన దూరంగా ఉంటుండటం, పార్టీ ముఖ్యమైన నిరసన కార్యక్రమాల్లో కూడా కనిపించకపోవడం రాజకీయ వర్గాల్లో పలు ఊహాగానాలకు కారణమవుతోంది. దీంతో ఆయన పార్టీతో కొనసాగుతున్నారా, లేక రాజకీయంగా కొత్త నిర్ణయాల వైపు అడుగులు వేస్తున్నారా అనే చర్చ సాగుతోంది. ఇటీవల ఎలమంచిలి నియోజకవర్గంలోని పంచదార్లప్రాంతంలో అక్రమ మైనింగ్ జరుగుతోందని ఆరోపిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ భారీ స్థాయిలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ తో పాటు ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన పలువురు సీనియర్ నాయకులు హాజరయ్యారు. అయితే మూడు సార్లు ఎలమంచిలి ఎమ్మెల్యేగా పనిచేసిన కన్నబాబురాజు ఈ కార్యక్రమంలో కనిపించకపోవడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. కన్నబాబురాజు గత కొంతకాలంగా పార్టీ కార్యక్రమాల్లో పెద్దగా చురుకుగా పాల్గొనడం లేదని స్థానిక రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ఆయన పుట్టినరోజు వేడుకల సందర్భంగా కూడా పార్టీ నాయకుల హడావుడి కనిపించకపోవడం ఈ చర్చలకు మరింత బలం చేకూర్చింది. అయితే ఇది ఆయన రాజకీయ వ్యూహంలో భాగమని భావిస్తున్నవారూ ఉన్నారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున విజయం సాధించిన కన్నబాబురాజు, 2024 ఎన్నికల్లో ఓటమి చవిచూశారు. ఎన్నికల అనంతరం కొంతకాలం పాటు పార్టీ ఆయననే నియోజకవర్గ ఇన్‌చార్జిగా కొనసాగించింది. అయితే తరువాత పార్టీ అధిష్ఠానం మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీకి ఆ బాధ్యతలు అప్పగించింది. ఈ నిర్ణయం తర్వాత కన్నబాబురాజు అసంతృప్తికి గురయ్యారనే ప్రచారం రాజకీయ వర్గాల్లో వినిపించింది. ఎలమంచిలి నియోజకవర్గంలో ప్రస్తుతం పార్టీకి చెందిన రెండు వర్గాలు విడివిడిగా పనిచేస్తున్నాయని స్థానికంగా చర్చ జరుగుతోంది. ఒకవైపు కరణం ధర్మశ్రీ వర్గం కార్యక్రమాలు నిర్వహిస్తుండగా, మరో వైపు కన్నబాబురాజు అనుచరులు కూడా తమకంటూ ప్రత్యేకంగా వ్యవహరిస్తున్నారని అంటున్నారు. ఈ పరిస్థితి భవిష్యత్‌లో టికెట్ కోసం పోటీకి సంకేతంగా భావిస్తున్నారు. మరోవైపు, వచ్చే ఎన్నికల్లో తన కుమారుడు, మాజీ డీసీసీబీ చైర్మన్ సుకుమార్ వర్మ (కు ఎమ్మెల్యే టికెట్ ఇప్పించేందుకు కన్నబాబురాజు ప్రయత్నాలు చేస్తున్నారనే ప్రచారం కూడా సాగుతోంది. భవిష్యత్ రాజకీయ పరిణామాలను దృష్టిలో పెట్టుకుని ఆయన ప్రస్తుతం మౌన వ్యూహాన్ని అనుసరిస్తున్నారని కొందరు విశ్లేషిస్తున్నారు. అయితే కన్నబాబురాజు ఇప్పటివరకు పార్టీని వీడుతున్నట్లు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. అలాగే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకత్వం కూడా ఆయనపై బహిరంగంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. అయినప్పటికీ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండటం, స్థానిక రాజకీయ పరిణామాల్లో మౌనం పాటించడం వంటి అంశాలు ఆయన భవిష్యత్ రాజకీయ అడుగులపై ఆసక్తిని పెంచుతున్నాయి. రానున్న రోజుల్లో ఎలమంచిలి నియోజకవర్గ రాజకీయాలు ఎలా మారతాయి, కన్నబాబురాజు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతారా లేదా కొత్త రాజకీయ నిర్ణయం తీసుకుంటారా అన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. ఆయన తదుపరి నిర్ణయం స్థానిక రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపే అవకాశముందని పరిశీలకులు భావిస్తున్నారు.

# మొన్న దువ్వాడ, నిన్న సిదిరి.. ఇవాళ తమ్మినేని



శ్రీకాకుళం : ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ( ఒకప్పుడు తెలుగు దేశం పార్టీ )కి బలమైన ప్రాంతంగా గుర్తింపు పొందింది. 2019 ఎన్నికల్లో మాత్రం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మంచి ఫలితాలు సాధించినప్పటికీ, 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. టీడీపీ కూటమి ఉమ్మడి జిల్లాలోని అన్ని అసెంబ్లీ స్థానాలను గెలుచుకుని క్లీన్ స్వీప్ చేసింది. దీంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లాలో తిరిగి బలం పెంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. 2024 ఎన్నికల తర్వాత జిల్లాలో వైసీపీ పార్టీని సమన్వయం చేసే బలమైన నాయకత్వం లేకపోవడం, అంతర్గత విభేదాలు, వర్గ రాజకీయాలు పార్టీ పునర్నిర్మాణానికి అడ్డంకిగా మారుతున్నాయి. ఇదే సమయంలో కీలక నేతలు వివిధ కారణాలతో వార్తల్లో నిలవడం కూడా పార్టీకి ఇబ్బందికర పరిస్థితులను తీసుకొస్తోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల మాజీ స్పీకర్, మాజీ మంత్రి తమ్మినేని సీతారాం పేరు భూ వివాదానికి సంబంధించిన కేసులో రావడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. సుమారు రూ.4 కోట్ల విలువైన భూమికి సంబంధించిన వ్యవహారంలో అక్రమ రిజిస్ట్రేషన్ జరిగిందనే ఆరోపణలపై కేసు నమోదైనట్లు సమాచారం. ఈ ఆరోపణలను చట్టపరమైన విచారణలో అధికారులు పరిశీలిస్తున్నారు. కేసుకు సంబంధించి తమ్మినేని సీతారాం లేదా ఆయన కుటుంబం నుంచి పూర్తి స్థాయి స్పందన రావాల్సి ఉంది. కాబట్టి ఆరోపణలు ఇప్పటికీ న్యాయపరమైన విచారణ దశలోనే ఉన్నాయి ఈ పరిణామాల నేపథ్యంలో తమ్మినేని సీతారాం రాజకీయ భవిష్యత్తుపై కూడా చర్చ జరుగుతోంది. ప్రస్తుతం ఆయన శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. భవిష్యత్‌లో లోక్‌సభ ( ఎన్నికల్లో పోటీ చేయాలనే ఆలోచనలో ఉన్నారని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. అలాగే ఆయన కుమారుడు తమ్మినేని చిరంజీవి నాగ్ ను ఆముదాలవలస ( అసెంబ్లీ స్థానం నుంచి బరిలోకి దించాలని కుటుంబం భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇలాంటి సమయంలో భూ వివాదం రాజకీయంగా ప్రభావం చూపే అవకాశం ఉందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఎదురవుతున్న సవాళ్లు ఒక్క తమ్మినేని సీతారాంతోనే పరిమితం కాలేదు. టెక్కలి ప్రాంతానికి చెందిన ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ వ్యక్తిగత వివాదాల నేపథ్యంలో పార్టీ నుంచి సస్పెన్షన్‌కు గురయ్యారు. మరోవైపు పలాస మాజీ మంత్రి సీదరి అప్పలరాజు కుటుంబం కూడా ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాద ఘటనతో వార్తల్లో నిలిచింది. ఈ పరిణామాలు జిల్లాలో పార్టీ నాయకత్వంపై ప్రభావం చూపుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పార్టీని క్షేత్రస్థాయిలో మళ్లీ బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని రాజకీయ విశ్లేషకులు సూచిస్తున్నారు. 2024 ఎన్నికల పరాజయం నుంచి పూర్తిగా కోలుకుని కార్యకర్తల్లో నమ్మకం పెంచడం, కొత్త వ్యూహాలతో ముందుకు సాగడం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కీలక సవాలుగా మారింది. అయితే రాజకీయ పరిస్థితులు ఎప్పటికప్పుడు మారుతూ ఉంటాయి. ప్రస్తుతం ఎదురవుతున్న ఇబ్బందులను పార్టీ ఎలా అధిగమిస్తుంది,

# విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి - బీటెక్ రవి



**పులివెందుల,జూలై 24:** పులివెందుల మండలంలోని నల్లపురెడ్డిపల్లె గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహి స్తున్న మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్ 4.0 కార్యక్రమంలో పులివెందుల టీడీపీ ఇన్‌చార్జ్ బీటెక్ రవి పులివెందుల జడ్పీటీసీ మారెడ్డిలత రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీటెక్ రవి పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటించారు. విద్యార్థుల విద్యా ప్రగతి, పాఠశాలలో అందుతున్న సౌకర్యాలు, బోధన విధానంపై ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులతో చర్చించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు,పాఠశాల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు,విద్యార్థులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# 13వ వార్డులో పారదర్శకంగా ఓటర్ల జాబితా బిఎల్ఓలచే పరిశీలన



**ప్రొద్దుటూరు,జూలై 24:** పట్టణం 13వ వార్డులో ఓటర్ల జాబితా పారదర్శకత కోసం బూత్ స్థాయి అధికారులు మరియు ఎస్.ఐ.ఆర్. ప్రక్రియ ద్వారా ప్రత్యేక క్షేత్రస్థాయి పరిశీలన మరియు దర్యాప్తు విజయవంతంగా నిర్వహించడం జరిగింది. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా క్రింది కీలక అంశాలపై క్షుణ్ణంగా పరిశీలన చేపట్టడం జరిగింది. చనిపోయిన ఓటర్లు ఎస్.ఐ.ఆర్. ద్వారా వెరిఫై చేయబడి, మృతి చెందిన ఓటర్ల వివరాలను సేకరించి జాబితా నుండి తొలగించడం జరిగింది.రెండు చోట్ల ఓట్లు – ఒకే వ్యక్తికి వేర్వేరు ప్రాంతాలలో లేదా రెండు చోట్ల ఓట్లు ఉన్నట్లు గుర్తించిన అప్లికేషన్లపై నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టడం జరిగింది. ఇల్లు మారిన ఓటర్లు – ప్రస్తుత అడ్రస్‌లో నివాసం ఉండకుండా వేరే ఊరికి లేదా ప్రాంతానికి శాశ్వతంగా షిఫ్ట్ అయిన ఓటర్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి జాబితా నుండి సవరించడం జరిగింది. ప్రతి ఇంటికి బిఎల్‌వోల సందర్శన, ఫోటోగ్రాఫిక్ సాక్ష్యాధారాలు మరియు పకడ్బందీ దర్యాప్తు ద్వారా అర్హులైన నిజమైన ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, దొంగ ఓట్లు మరియు తప్పులను తొలగించి పారదర్శకమైన ఓటర్ల జాబితాను రూపొందించడానికి ఈ నిరంతర కృషి చేయడం జరుగుతుంది. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సక్రమంగా సరిచోసుకొని బాధ్యతాయుతమైన పౌరులుగా సహకరించాలని భారతీయ జనతా పార్టీ కడప జిల్లా అధికార ప్రతినిధి పర్లపాడు గౌరీ శంకర్ ఈ సందర్భంగా కోరారు.

# ఘనంగా ప్రారంభమైన మెగా పిటిఎం 4.0

## - మెగా పేరెంట్ టీచర్ సమావేశానికి హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు ప్రజాప్రతినిధులు



నరసరావుపేట, : పల్నాడు జిల్లా వినుకొండ నియోజకవర్గం లోని ఈపూరు గ్రామంలో ని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ఆవరణలో సమగ్ర శిక్ష నిధులతో నిర్మించిన బాలికల వసతి గృహాన్ని ప్రభుత్వ చీఫ్ విప్ వినుకొండ నియోజకవర్గ శాసన సభ్యులు జీవి ఆంజనేయులు జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లాతో కలిసి ప్రారంభించి, అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి పేరెంట్ టీచర్స్ మీటింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. కళాశాల ప్రగతి నివేదిక విద్యార్థుల కోసం ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించడం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు గారు మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గారి నాయకత్వంలో రాష్ట్ర విద్యారంగంలో సమగ్ర సంస్కరణలు అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రతి శనివారం నిర్వహిస్తున్న నో బ్యాగ్ డే ద్వారా విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం సృజనాత్మకత నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తున్నామని పేర్కొన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా ప్రతి విద్యార్థికి హార్దిక సహాయం అందిస్తూ ఏ ఒక్కరు చదువుకు దూరం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలల్లో దార్మిటరీ, అంగన్వాడి భవనాలు, పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఉచిత బస్సు ప్రయాణం వంటి కార్యక్రమాలతో నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు మెగా పేరెంట్ టీచర్స్ సమావేశం ద్వారా తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నామని చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధిలో తల్లిదండ్రులు ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని ప్రతి విద్యార్థి ప్రతిభను వెలికి తీసే దిశగా మెగా పేరెంట్ టీచర్స్ సమావేశాలు కీలక వేదికగా నిలుస్తాయని అన్నారు. విద్యార్థులు తమ ఎంచుకున్న లక్ష్యాలను ఎలా చేరుకోవాలో కలెక్టర్ వివరించారు. అనంతరం విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు జిల్లా కలెక్టర్ కృత్రిక శుక్ల డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం చేశారు.

# రైతుల ట్రాన్స్‌ఫార్మర్లను టార్గెట్ చేసిన నలుగురు దొంగలు అరెస్ట్

## 328 కిలోల రాగి వైర్ స్వాధీనం.. 30 ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం, 10 కేసులు నమోదు



మార్కాపురం, :గత కొంతకాలంగా పెద్దారవీడు మండల వ్యాప్తంగా రైతుల పొలాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి రాగి తీగలు దొంగిలిస్తున్న నలుగురు దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి సుమారు 328 కిలోల కాపర్ వైర్ (రాగి తీగలు) స్వాధీనం చేసుకున్నట్లు మార్కాపురం డీఎస్పీ నాగరాజు తెలిపారు. శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాత్రి వేళల్లో రైతుల పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లను లక్ష్యంగా చేసుకుని వాటిని ధ్వంసం చేసి లోపల ఉన్న రాగి తీగలను దొంగిలిస్తున్న ముఠాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. ఈ ముఠా ఇప్పటివరకు 30 ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి, వాటికి సంబంధించి 10 కేసులు నమోదు అయినట్లు వెల్లడించారు. దొంగిలించిన రాగి వైర్‌ను స్వాధీనం చేసుకుని, నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు.

# స్టాంప్ రైటర్లను తొలగించే జి.ఓ. నెం. 396ను తక్షణమే ఉపసంహరించుకోవాలి

## - కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఇర్ఫాన్ బాషా




**ప్రొద్దుటూరు,జూలై 24:** పట్టణం లోని సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట స్టాంప్ రైటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పెన్‌డౌన్ నిరసన కార్యక్రమంలో ప్రొద్దుటూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఇర్ఫాన్ బాషా పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం స్టాంప్ రైటర్ల సమస్యలను తెలుసుకుని వారికి కాంగ్రెస్ పార్టీ తరఫున పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఇర్ఫాన్ బాషా మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం జి.ఓ. నెం. 396 ద్వారా ఎన్నో సంవత్సరాలుగా ప్రజలకు సేవలందిస్తున్న స్వతంత్ర స్టాంప్ రైటర్లను తొలగించి, వారి స్థానంలో సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఫ్రంట్ ఆఫీస్ వ్యవస్థను ఏర్పాటు చేయడం అత్యంత దురదృష్టకరమని అన్నారు.స్టాంప్ రైటర్లు కేవలం పత్రాలు రాసే వ్యక్తులు మాత్రమే కాదని, దశాబ్దాల అనుభవంతో ప్రతి డాక్యుమెంట్‌ను చట్టబద్ధంగా, భవిష్యత్‌లో ఎలాంటి వివాదాలు తలెత్తకుండా రూపొందించే నిపుణులని పేర్కొన్నారు. ఒక సాధారణ వ్యక్తి జీవితాంతం కష్టపడి సంపాదించిన డబ్బుతో ఇల్లు లేదా స్థలం కొనుగోలు చేస్తాడని, కోట్ల రూపాయల విలువైన ఆస్తి అయినా సరే దానికి సంబంధించిన డాక్యుమెంట్ సరిగ్గా తయారుకాకపోతే భవిష్యత్‌లో తీవ్రమైన న్యాయపరమైన సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని అన్నారు. ఈరోజు తయారయ్యే రిజిస్ట్రేషన్ పత్రాలు రాబోయే తరాలకు, వందల సంవత్సరాల పాటు ఆధారాలుగా నిలుస్తాయని, అలాంటి బాధ్యతను అనుభవం లేని వ్యక్తులకు అప్పగించడం ప్రజల ప్రయోజనాలకు విరుద్ధమని విమర్శించారు.అలాగే నిన్న స్టాంప్ రైటర్స్ సంఘం నాయకులను చర్చలకు పిలిచి, వారిపై ఒత్తిడి తెచ్చి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేయించాలని బెదిరించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి, నైతిక విలువలకు విరుద్ధమని ఇర్ఫాన్ బాషా తీవ్రంగా ఖండించారు.ప్రభుత్వం ఈ నిర్ణయంతో భవిష్యత్‌లో సాధారణ ప్రజలపై అధిక భారం పడే అవకాశముందని, డాక్యుమెంట్లలో తప్పులు జరిగితే ప్రజలు కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుందని, అదనపు ఖర్చులు భరించాల్సి వస్తుందని అన్నారు. అంతేకాకుండా అధికారుల ఆధీనంలో జరిగే వ్యవస్థలో రాజకీయ వివక్షకు కూడా అవకాశం ఉంటుందని, ప్రజలకు సమానమైన సేవలు అందకపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.అందువల్ల ప్రభుత్వం వెంటనే జి.ఓ. నెం. 396ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ, స్టాంప్ రైటర్ల హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.అవసరమైతే స్టాంప్ రైటర్ల ఉద్యమంలో వంటా-వార్పు వంటి ఆందోళన కార్యక్రమాల్లో కూడా కాంగ్రెస్ పార్టీ ప్రత్యక్షంగా పాల్గొంటుందని, వారి న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు పోరాటానికి పూర్తి మద్దతు అందిస్తామని ఇర్ఫాన్ బాషా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గోసంగి సుబ్బారెడ్డి, మైనారిటీ నాయకులు మౌలాలి, షేక్ గౌస్, స్టాంప్ రైటర్స్ అసోసియేషన్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో స్టాంప్ రైటర్లు పాల్గొన్నారు.

# విద్యార్థులపై లాఠీచార్జి అమానుషం - నీట్ పేపర్ లీక్‌కు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

## - ఆంధ్రప్రదేశ్ విద్యాసంస్థల బందుకు ఎంపిజే, జేఐహెచ్, ఐవైఎం, ఎస్ఐఓ సంపూర్ణ మద్దతు




**ప్రొద్దుటూరు,జూలై 24:** ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నీట్ పేపర్ లీక్, విద్యా వ్యవస్థలో జరిగిన అవకతవకలు మరియు విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని డిమాండ్ చేస్తూ శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు లాఠీచార్జి చేయడాన్ని ఎంపిజే,జేఐహెచ్, ఐవైఎం,ఎస్ఐఓ సంస్థలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. ఈ సంఘటనను నిరసిస్తూ శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన విద్యాసంస్థల బందుకు పలు సంస్థలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. ఈ సందర్భంగా ప్రొద్దుటూరు శివాలయం సెంటర్‌లో నిరసన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ, దేశంలో పోటీ పరీక్షలపై విద్యార్థులు, తల్లిదండ్రులు నమ్మకం కోల్పోయే పరిస్థితులు ఏర్పడటం అత్యంత ఆందోళనకరమన్నారు. నీట్ పేపర్ లీక్ వంటి ఘటనలు లక్షలాది మంది విద్యార్థుల కష్టాన్ని, భవిష్యత్తును ప్రశ్నార్థకం చేశాయని పేర్కొన్నారు. నీట్ పేపర్ లీక్ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని మేము డిమాండ్ చేస్తున్నాము. అలాగే ఈ వ్యవహారంపై పారదర్శకమైన, నిష్పాక్షిక దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, దేశంలోని అన్ని పోటీ పరీక్షలను పూర్తి పారదర్శకతతో నిర్వహించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరుతున్నాము విద్యార్థుల నిరసనల్లో ఈ డిమాండ్ దేశవ్యాప్తంగా వినిపిస్తోంది.ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు. విద్యార్థుల గొంతును లాఠీలతో అణచివేయడం కాకుండా, వారి ఆందోళనలను ప్రభుత్వం ఆలకించి న్యాయం చేయాలి. విద్యార్థులపై నమోదైన కేసులను ఉపసంహరించు కోవాలని, లాఠీచార్జి ఘటనపై బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కూడా మేము డిమాండ్ చేస్తున్నాము.దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని, వారి హక్కులు, గౌరవం, భవిష్యత్తును కాపాడటం ప్రభుత్వాల బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్ర మంలో ఎంపీజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సలీం, పట్టణ అధ్యక్షుడు హుషన్ బాష,కార్యదర్శి మమ్మద్ రఫీ,జమాత్ ఇస్లామి హింద్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్ఎస్ మోహిద్దీన్,పట్టణ అధ్యక్షులు షఫీవుల్లా, కార్యదర్శి రహమతుల్లా, ఐవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బేపారి షఫీ, పట్టణ అధ్యక్షులు జబివుల్లా, ఎస్ఐఓ రాష్ట్ర కార్యదర్శి ఆదిల్ ఉమ్రి,పట్టణ అధ్యక్షుడు రోషన్ జమీర్, కార్యదర్శి ఇజాజ్ తదితరులు పాల్గొన్నారు.

# అర్కట వేములలో ఘనంగా తల్లిదండ్రుల,ఉపాధ్యాయుల సమావేశం



**రాజుపాలెం,జూలై 24:** రాజుపాలెం మండలం అరకట వేముల లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల మరియుఉపాధ్యా యుల సమావేశం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజుపాలెం మండల రెవెన్యూ అధికారి హరినాథ్ రెడ్డి హాజరై మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని మంచి నాణ్యమైన విద్య తో పాటు నైతిక విలువలతో కూడిన చదువు ఉంటుందని ఆయన అన్నారు అలాగే ప్రధానోపాధ్యాయుడు మహబూబ్ బాషా మాట్లాడుతూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం ద్వారా ఉచితంగా చదువు మరియు ప్రభుత్వ అందిస్తున్న తల్లికి వందనంతో పాటు ఉచిత యూనిఫామ్ నాణ్యమైన విద్య లభిస్తుందని ఆ యన అన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వపు విద్యార్థి కోట ఓబుల్ రెడ్డి, గడ్డం సుబ్బారెడ్డి, కందుకూరు ప్రసాద్ రెడ్డి, కోట నరసింహారెడ్డి ,


# ప్రొద్దుటూరు కమీషనర్‌కు దక్కిన గౌరవం




**,ప్రొద్దుటూరు,జూలై 24:** పోలవరం జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను ( పి.జీ.ఆర్.ఎస్) జిల్లాలో సమర్థవంతంగా నడిపి 4.5% పాజిటివిటీ ప్రజలలో పెంచి విశేష సేవలు అందించిన ప్రొద్దుటూరు కమీషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాధ్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజలు, అధికారులు సమక్షంలో ప్రజా వేదిక మీద అభినందించారు. పోలవరం జిల్లా, రంపచోడవరంలో జరిగిన మెగా పేరెంట్స్ & టీచర్స్ రాష్ట్రస్థాయి ఆత్మీయ సమావేశంలో శ్రీనివాస విశ్వనాధ్‌కు ఈ గౌరవం దక్కింది. ప్రొద్దుటూరు మున్సిపల్ కమీషనర్‌గా రాకముందు శ్రీనివాస విశ్వనాధ్ పోలవరం జిల్లాకు పి.జీ.ఆర్.ఎస్ నోడల్ అధికారిగా వ్యవహరించారు.

# చట్నీలో బల్లి.. శ్రీ గణేష్ హోటల్ సీజ్

## - టిఫిన్ తిన్న మహిళకు అస్వస్థత...






**,ప్రొద్దుటూరు,జూలై 24:** ప్రొద్దుటూరులో పట్టణంలో శ్రీ గణేష్ టిఫిన్ సెంటర్, హోటల్‌లో విక్రయించిన టిఫిన్ చట్నీలో బల్లి కనిపించిం దన్న ఆరోపణలు తీవ్ర కలకలం రేపాయి. రామేశ్వరం రోడ్డులోని గణేష్ హోటల్ నుంచి కొనుగోలు చేసిన టిఫిన్‌లో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ సంఘటన స్థానికంగా తీవ్ర చర్చకు దారితీసింది. స్థానిక కోనేటి కాల్వ వీధికి చెందిన సోహెల్ శుక్రవారం ఉదయం హోటల్ నుంచి టిఫిన్ పార్శిల్ తీసుకెళ్లాడు. ఇంట్లో కుటుంబ సభ్యులతో కలిసి టిఫిన్ తింటుండగా చట్నీలో బల్లి కనిపించినట్లు ఆయన తెలిపారు. అప్పటికే అదే చట్నీ తిన్న ఆయన భార్య అస్వస్థతకు గురైంది. వాంతులు ప్రారంభం కావడంతో వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్స అందించారు. బాధితుడు వెంటనే 1 టౌన్ లో ఫిర్యాదు చేసి లోకా సమస్త హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ వారిని సంప్రదించారు.పిర్యాదు అందుకున్న లోకా సమస్త హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ సభ్యులు వన్ టౌన్ సిఐ టి.వి.కొండారెడ్డిని కలిసి బాధితులకు తగిన న్యాయం చేయమని కోరారు.టిఫిన్ తిన్న కుటుంబం తీవ్ర ఆందోళనకు గురికావడంతో అధికారులు రంగంలోకి దిగారు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.శ్రీ గణేష్ టిఫిన్ సెంటర్, హోటల్ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. దీంతో స్థానికుల్లో పట్టలేనంత ఆగ్రహం వ్యక్తమైంది. సమాచారం అందుకున్న పోలీసులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు రంగంలోకి దిగి తనిఖీలు నిర్వహించి హోటల్‌ను సీజ్ చేశారు.

ప్రజా కలం PRAJA KALAM



# ఎడ్యుకేషన్ హబ్ గా హైదరాబాద్

హైదరాబాద్ : తెలంగాణలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి (ట్రైసిటీస్) జిల్లాలు దేశంలోనే ఉన్నత విద్యకు ప్రధాన కేంద్రాలుగా సరికొత్త చరిత్ర సృష్టిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వ నివేదిక ప్రకారం, అత్యధిక సంఖ్యలో కాలేజీలు కలిగిన జిల్లాల జాబితాలో ఈ మూడు జిల్లాలు జాతీయ స్థాయిలో అగ్రస్థానంలో నిలిచాయి. ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, ఆధునిక సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథ్స్ కోర్సులు, వేగంగా విస్తరిస్తున్న ఐటీ రంగంతో పాటు మహిళల భాగస్వామ్యం ఊహించని స్థాయిలో పెరగడం తెలంగాణ విద్యా రంగానికి కొత్త ఊపిరి పోసింది. తెలంగాణ రాజధాని హైదరాబాద్‌తో పాటు రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలు దేశంలోనే ఉన్నత విద్యకు ప్రధాన కేంద్రాలుగా మరింత బలపడుతున్నాయి. కేంద్ర విద్యాశాఖ విడుదల చేసిన ఆల్ ఇండియా సర్వే ఆన్ హయ్యర్ ఎడ్యుకేషన్ తాజా నివేదికలో ఈ మూడు జిల్లాలు దేశంలో అత్యధిక కాలేజీలు ఉన్న జిల్లాల జాబితాలో అగ్రస్థానాల్లో నిలిచాయి. విస్తృతంగా పెరిగిన విద్యాసంస్థలు, ఆధునిక కోర్సులు, మెరుగైన మౌలిక వసతులు, ఐటీ రంగం విస్తరణ, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా రూపొందుతున్న విద్యా విధానాలు ట్రైసిటీస్‌ను దేశంలోనే ప్రముఖ విద్యా కేంద్రంగా నిలబెట్టాయని నివేదిక స్పష్టం చేసింది. హైదరాబాద్ జిల్లాలో 480కు పైగా, రంగారెడ్డి జిల్లాలో 390కు పైగా, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 310కు పైగా ఉన్నత విద్యాసంస్థలు ఉన్నాయి. సంప్రదాయ డిగ్రీ కళాశాలలతో పాటు వైద్య, న్యాయ, ఇంజినీరింగ్, ఫార్మసీ, మేనేజ్‌మెంట్, సైన్స్ వంటి విభిన్న రంగాల్లో విద్యను అందించే సంస్థలు అధిక సంఖ్యలో ఉండటం వల్ల దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వేలాది మంది విద్యార్థులు ఇక్కడ చదువుకోవడానికి వస్తున్నారు. జాతీయ సగటుతో పోలిస్తే ప్రతి లక్ష జనాభాకు లభిస్తున్న కాలేజీల సంఖ్య కూడా ఈ జిల్లాల్లో ఎక్కువగా ఉండటం మరో ప్రత్యేకతగా నివేదిక పేర్కొంది. గత కొన్నేళ్లుగా హైదరాబాద్ ఐటీ, ఔషధ, స్టార్టప్ రంగాలకు కేంద్రంగా ఎదగడం ఉన్నత విద్యపై కూడా ప్రత్యక్ష ప్రభావం చూపుతోంది. ముఖ్యంగా రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాల్లో ఏఐ, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, మెషిన్ లెర్నింగ్, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి ఆధునిక సాంకేతిక కోర్సులకు భారీగా డిమాండ్ పెరిగింది. నివేదిక ప్రకారం ఈ రెండు జిల్లాల్లో 45 శాతానికి పైగా విద్యార్థులు (సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమెటిక్స్) కోర్సుల్లోనే చేరుతున్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కొత్త కోర్సులు ప్రవేశపెట్టడం వల్ల విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతున్నాయి. హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం, జేఎన్‌టీయూ, ట్రిపుల్ ఐటీ, కేంద్రీయ విశ్వవిద్యాలయంతో పాటు అనుబంధ కళాశాలల్లో సీట్ల భర్తీ రేటు గతంతో పోలిస్తే మెరుగుపడిందని సర్వే తెలిపింది. క్యాంపస్ ప్లేస్‌మెంట్లు పెరగడం, పరిశ్రమలతో విద్యాసంస్థల భాగస్వామ్యం బలపడటం, ఇంటర్న్‌షిప్ అవకాశాలు




అధికంగా లభించడం వల్ల విద్యార్థులు ఈ ప్రాంతంలోని కాలేజీల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని పేర్కొంది. మహిళల ఉన్నత విద్యలో పాల్గొనడంలో కూడా ట్రైసిటీస్ విశేష పురోగతి సాధించాయి. ఒకప్పుడు ఆర్ట్స్, కామర్స్ కోర్సులకే పరిమితమైన మహిళలు ఇప్పుడు ఇంజినీరింగ్, టెక్నాలజీ, పరిశోధన, సైన్స్ రంగాల్లో కూడా పెద్ద సంఖ్యలో చేరుతున్నారు. హైదరాబాద్ జిల్లాలో ఉన్నత విద్యలో అమ్మాయిల నమోదు అబ్బాయిల కంటే ఎక్కువగా నమోదైంది. పీజీ, పీహెచ్‌డీ వంటి ఉన్నత స్థాయి పరిశోధన కోర్సుల్లో మహిళల నమోదు జాతీయ సగటును మించి ఉండటం మహిళా సాధికారతకు నిదర్శనంగా నివేదిక పేర్కొంది. ప్రభుత్వ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, హాస్టల్ సదుపాయాలు, భద్రతా ప్రమాణాల మెరుగుదల కూడా ఇందుకు కారణాలుగా గుర్తించింది. మౌలిక వసతుల పరంగా కూడా హైదరాబాద్ ట్రైసిటీస్ దేశంలోని ఇతర విద్యా కేంద్రాలకు పోటీ ఇస్తున్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాల్లోని 90 శాతానికి పైగా కాలేజీల్లో వైఫై, స్మార్ట్ క్లాస్‌రూమ్స్, డిజిటల్ లైబ్రరీలు, ఆధునిక ప్రయోగశాలలు అందుబాటులో ఉన్నాయని సర్వే తెలిపింది.

జాతీయ విద్యా విధానం అమలులో భాగంగా ప్రయోగాత్మక బోధనకు ప్రాధాన్యం పెరగడంతో ల్యాబ్‌ల ఆధునీకరణ కూడా వేగంగా జరుగుతోందని పేర్కొంది. కౌన్సెలింగ్ కేంద్రాలు, పరిశోధన ఇంక్యుబేషన్ సెంటర్లు, క్రీడా వసతుల కల్పనలో కూడా ఈ జిల్లాలు ముందంజలో ఉన్నాయని వెల్లడించింది. అయితే విద్యార్థుల సంఖ్య వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో కొన్ని ప్రభుత్వ కళాశాలల్లో హాస్టల్ సదుపాయాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని నివేదిక సూచించింది. అధ్యాపకుల ఖాళీల భర్తీ, పరిశ్రమలతో మరింత అనుసంధానం, పరిశోధనకు ప్రాధాన్యం పెంచడం వంటి చర్యలు చేపడితే హైదరాబాద్ ట్రైసిటీస్ దేశానికే కాదు, అంతర్జాతీయ స్థాయిలో కూడా ప్రముఖ నాలెడ్జ్ హబ్‌గా ఎదిగే అవకాశాలు ఉన్నాయని కేంద్ర విద్యాశాఖ నివేదిక అభిప్రాయపడింది.

# సొంత పార్టీపై విమర్శలు



హైదరాబాద్ : బీజేపీకి ఆయన బద్ధుడైన నాయకుడే. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలవడం అంటే ఆషామాషీ వ్యవహారం కానే కాదు. కానీ గెలిచి చూపించిన రాజకీయ మొనగాడు రాజాసింగ్. గోషామహల్ ఎమ్మెల్యేగా 2014 నుంచి వరుసగా బీజేపీ గుర్తుతో గెలిచి వస్తున్న రాజా సింగ్ ని పార్టీ 2023 ఎన్నికల తరువాత సస్పెండ్ చేసింది. ఆయన కొన్ని విషయాల్లో సొంత పార్టీ మీదనే విమర్శలు చస్తున్నారు అన్న కారణంతో పక్కన పెట్టారు. అయితే ఏదో నాటికి ఆయన బీజేపీ గూటికి చేరుతారు అన్న ప్రచారం ఒక వైపు ఉండగానే రాజా సింగ్ ఏ మాత్రం తగ్గడం లేదు. తన అభిప్రాయాలను ఆయన కుండబద్దలు కొడుతున్నారు. ఆయన బీజేపీకి నిర్మాణాత్మకమైన సూచనలు ఇస్తున్నట్లుగానే అవి ఉంటున్నా అదే సమయంలో ఘాటైన విమర్శలుగా కూడా కనిపిస్తున్నాయి బీజేపీ తెలంగాణాలో అధికారంలోకి వస్తుందా అని రాజా సింగ్ ప్రశ్నించారు. ఆ ఇద్దరు నేతలు కలిస్తే ఏమి జరుగుతుందని ఆయన కీలక ప్రశ్నను సంధించారు. ఆ ఇద్దరు నేతలు ఎవరో కాదు కేంద్ర మంత్రి బండి సంజయ్ అలాగే మల్కాజ్ గిరి ఎంపీ ఈటెల రాజేందర్. ఈ ఇద్దరు నాయకులను తెలంగాణా బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి అభయ్ సింగ్ పిలిపించి చేతులు కలిపారు. విభేదాలు మరచి కలసికట్టుగా పనిచేయాలని సూచించారు. దీంతో బీజేపీ తెలంగాణాలో తన వ్యూహాత్మకమైన అడుగులతో ముందుకు సాగుతోంది అన్న సంకేతాన్ని ఇచ్చినట్లు అయింది. ఇపుడు దానిని రాజా సింగ్ తప్పు పడుతున్నారు. ఇద్దరు నేతలు చేతులు కలిపితే బీజేపీ అధికారంలోకి వస్తుందా అని ఆయన నిలదీస్తున్నారు బీజేపీలో ఎంతో మంది సీనియర్ నాయకులు అలాగే కార్యకర్తలు ఉన్నారని ఆయన గుర్తు చేశారు. వారి సంగతి ఏమిటి అని కూడా ప్రశ్నించారు. అంటే పార్టీలో నాయకులందరినీ బీజేపీ ఇంకా కలుపుకొని పోవడం లేదన్న విమర్శ ఆయన మాటలలో కనిపిస్తోంది. అదే సమయంలో కార్యకర్తలకు ఉత్సాహం కలిగించేలా యాక్షన్ ప్లాన్ లేదని కూడా ఆయన చెబుతున్నట్లుగా ఉంది. నిజానికి బీజేపీలో ఇద్దరు కీలక నేతలు షేక్ హ్యాండ్స్ ఇచ్చుకున్నారు. విభేదాలు తగ్గాయి. ఇది మంచి సంకేతాలను ఇస్తుందని కమలనాధులు ఒక వైపు పొంగుతున్నారు. దాని మీద రాజా సింగ్ తన ఘాటు విమర్శలతో నీళ్ళు జల్లేశరు అని అంటున్నారు. .కమలం పార్టీ తెలంగాణాలో కదనోత్సాహంతో ఉంది. మూడు కార్పోరేషన్ల మేయర్ పదవులు గెలుచుకోవాలని పట్టుదలగా ఉంది. అలా తన సత్తా చాటాలని చూస్తోంది. అయితే బీజేపీ ఉత్సాహానికి గాలి తీసేశారు రాజాసింగ్ అంటున్నారు. మూడు కార్పోరేషన్ల మేయర్లు గెలవడం కాదు ముందు ఒక్క కార్పోరేషన్ లో అయినా సగం సీట్లు గెలిచి చూపించండి చాలు అని సవాల్ చేసేలా మాట్లాడారు. అంటే బీజేపీకి ఒక్క కార్పొరేషన్ గెలిచే అవకాశాలు లేవని రాజా సింగ్ తన ముందస్తు అంచనాను ఇలా బయటపెట్టారా అని చర్చ సాగుతోంది. అంతే కాదు ఆయన బీజేపీ ప్రస్తుత అధ్యక్షుడు రామచంద్రరావు మీద మీద కూడా కామెంట్స్ చేశారు. ఆయన చేతులు కట్టేశారని మరి ఎలా పనిచేస్తారు అని ప్రశ్నించారు ఒక వ్యక్తి కోసమే అధినాయకత్వం ఆలోచించే విధానాలు వద్దు అని హితవు పలికారు. మొత్తానికి దూరంగా ఉంటూనే కమలానికి కఠినమైన తీరులోనే సలహాలు సూచనలతో పాటు దిశా నిర్దేశం చేశారు రాజాసింగ్. దీనిని బీజేపీ అధినాయకత్వం ఏ విధంగా చూస్తుంది అన్నదే ఇపుడు చర్చ మరి.

# రాహుల్ నాయకత్వంపై విశ్వాసం పెరుగుతుందా?

న్యూఢిల్లీ : జాతీయస్థాయిలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం వస్తుందా అన్న చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. నీట్ పేపర్ లీకేజీ ఉదంతంపై విద్యార్థులు చేపట్టిన ఆందోళనలు, ఢిల్లీలో జరిగిన లాఠీచార్జిని నిరసిస్తూ లోక్‌సభలో విపక్ష నేత (ఎల్‌ఓపీ) రాహుల్ గాంధీ చేపట్టిన మెరుపు ధర్నా దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇదే సమయంలో పలు రాష్ట్రాల్లో కాంగ్రెస్ కార్యాలయాలపై జరిగిన దాడులు ఆ పార్టీకి రాజకీయంగా సానుభూతిని తెచ్చిపెడుతున్నాయనే విశ్లేషణలు వెలువడుతున్నాయి. ఈ పరిణామాలు జాతీయ రాజకీయాల్లో కాంగ్రెస్ పునరుజ్జీవ ప్రయత్నాలకు ఊతమిస్తాయా అన్న కోణంపైనా విస్తృత చర్చ జరుగుతోంది. జాతీయ పార్టీగా కాంగ్రెస్ పార్టీకి దశాబ్దాల చరిత్ర ఉంది. దేశాన్ని సుదీర్ఘకాలం పాలించిన గ్రాండ్ ఓల్డ్ పార్టీ కాంగ్రెస్. అయితే ఇదంతా గతం, ఇప్పుడు పరిస్థితి వేరు. గతం ఒక ఘన చరిత్ర అన్నట్లుగానే కొన్నాళ్లుగా కాంగ్రెస్ పరిస్థితి తయారైంది. అయితే ఇప్పుడు పరిస్థితులు కుదటపడుతున్న వాతావరణం కనిపిస్తోందని విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి. 2014లో కేంద్రంలో అధికారం కోల్పోయి, ఆ తర్వాత వరుసగా జరిగిన రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో వైఫల్యంతో కాంగ్రెస్ పార్టీ కుదేలైంది. 2014, 2019 సార్వత్రిక ఎన్నికల్లో కనీస ప్రతిపక్ష హోదా కూడా దక్కించుకోలేకపోయింది. అయితే గత పార్లమెంటు ఎన్నికల్లో 99 సీట్లతో ప్రతిపక్షంగా నిరూపించుకున్న కాంగ్రెస్ ఇప్పుడు అధికార ఎన్డీఏ, మరీ ముఖ్యంగా బీజేపీపై వెన్నుచూపని పోరాటం చేస్తుండటం హాట్ టాపిక్ అవుతోంది. లోక్ సభలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ ఇప్పుడు సరికొత్త పంథాతో రాజకీయం చేస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. జాతీయ పార్టీగా ఇండియా కూటమికి నాయకత్వం వహిస్తున్న కాంగ్రెస్ మిగిలిన విపక్షాలను కలుపుకుని పోవడంలో గతం కంటే మెరుగైన విధంగా పనిచేస్తోందని అంటున్నారు. కాకపోతే ఆయా పార్టీలు స్థానిక పరిస్థితులు, అంతర్గత కారణాలతో నిర్లిప్తంగా మారుతున్నా, ఆయా ప్రాంతీయ పార్టీల అగ్ర నాయకత్వానికి కాంగ్రెస్ అండగా నిలుస్తూ తనను తాను మలుచుకుంటున్న తీరు ఆకట్టుకుంటోందని అంటున్నారు. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపడంలోనూ కాంగ్రెస్ దూకుడుగా వ్యవహరిస్తోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రధాని మోదీ ఇంటి ముందు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాను ఇందుకు తాజా ఉదాహరణగా చూపుతున్నారు. వారసత్వంగా



కాంగ్రెస్ పగ్గాలు చేపట్టిన రాహుల్.. ఆ పార్టీకి పునరుజ్జీవం తేవడానికి ఎంతో ప్రయత్నిస్తున్నారు. అయితే వరుసగా మూడు ఎన్నికల్లో ఆయన వైఫల్యం చెందినా నాయకుడిగా ఇప్పుడిప్పుడు తనను తాను నిరూపించుకుంటున్నారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రధానంగా 2024 ఎన్నికల ముందు నుంచి రాహుల్ తీరులో మార్పు వచ్చిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. భారత్ జోడో యాత్ర ద్వారా పాదయాత్ర చేసి ప్రజలకు దగ్గరయ్యేలా ప్రయత్నాలు చేసిన రాహుల్ ఇప్పుడు దేశం ఏం కోరుకుంటుందన్న విషయమై అవగాహన పెంచుకున్నారని అంటున్నారు. దీంతో సమయానుకూలంగా స్పందిస్తూ కాంగ్రెస్ పార్టీని చక్కదిద్దేలా చురుగ్గా అడుగులు వేస్తున్నారని చెబుతున్నారు. ప్రస్తుతం నీట్ పేపర్ లీక్ వ్యవహారం జాతీయస్థాయిలో కుదిపేస్తుండగా, ఈ విషయంలో కాంగ్రెస్ ఎంటర్ అయిన తీరుతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయిందనే అంచనాలు వెలువడుతున్నాయి. ఈ విషయమై సుదీర్ఘ పోరాటం జరుగుతుండగా, ఈ నెల 20న నిర్వహించిన పార్లమెంట్ మార్చ్ పరిస్థితిని ఒక్కసారిగా మార్చేసిందని అంటున్నారు. ఆ రోజు కేంద్ర బలగాలు విద్యార్థులపై లాఠీచార్జి చేయడాన్ని నిరసిస్తూ రాహుల్ గాంధీ చేసిన మెరుపు ధర్నా దేశవ్యాప్తంగా విస్తృత చర్చకు దారితీసింది.

# భూములకు శాశ్వత భద్రత

అమరావతి : మీ భూమి–బ్లాక్ చెయిన్ పైలెట్ ప్రాజెక్టును రాష్ట్ర సచివాలయం నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు వర్చువల్గా ప్రారంభించారు. భూ రికార్డులకు శాశ్వత భద్రత కల్పించేలా బ్లాక్చెయిన్ విధానాన్ని రెవెన్యూ శాఖ రూపొందించింది. ప్రతి ల్యాండ్ పార్సెల్కు ప్రత్యేక డిజిటల్ ఐడీ ఇచ్చి టాంపర్–ప్రూఫ్, సెక్యూరిటీతో లావాదేవీలు జరిగేలా బ్లాక్ చెయిన్ వ్యవస్థ రూపకల్పన చేసారు. డబుల్ రిజిస్ట్రేషన్ సమస్యలను పూర్తిగా నివారించేలా బ్లాక్ చెయిన్ విధానం వుంటుంది. భూ రికార్డులకు సింగిల్ సోర్స్ ఆఫ్ ట్రూత్ గా ఉండేలా మీ భూమి–బ్లాక్ చెయిన్ ప్రాజెక్ట్. రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ల శాఖలను ఒకే వేదిక మీదకు తెచ్చేలా మీ భూమి–బ్లాక్ చెయిన్ ప్రాజెక్ట్. కర్నూలు, చిత్తూరు, బాపట్ల, కృష్ణా, తూర్పు గోదావరి, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లోని ఒక్కో మండలంలో ఈ పైలెట్ ప్రాజెక్ట్ అమలు అవనుంది. ఆస్పరి, పెనుమూరు, రేపల్లె, గన్నవరం, కడియం, గుమ్మలక్ష్మీపురం, కొత్తవలస మండలాల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తారు. ఈ కార్యక్రమానికి మంత్రి అనగాని సత్య ప్రసాద్, సీఎస్ సాయి ప్రసాద్, రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు, వివిధ జిల్లాల కలెక్టర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ భూ రికార్డులు సరిగా లేకపోవడం వల్ల విలువైన భూముల విషయంలో మోసాలు జరుగుతున్నాయి. తెలంగాణ తో పోల్చుకుంటే ఏపీలో ల్యాండ్ లిటిగేషన్లు తక్కువే. కానీ గత ప్రభుత్వ విధానం వల్ల ఏపీలోనూ భూ తగాదాలు.. వివాదాలు పెరిగాయి. 22ఏ పేరుతో కక్ష సాధింపులకు పాల్పడ్డారు. ప్రక్షాళన, విముక్తి, భద్రత వంటి అంశాలపై దృష్టి సారించి భూ సమస్యలను పరిష్కరిస్తున్నామని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సర్వేలు చేపడుతున్నాం.. రికార్డులను ప్రక్షాళన చేస్తున్నాం... పట్టాదార్ పాస్ పుస్తకాలు రాజముద్ర వేసి ఇస్తున్నాం. శెట్టిపల్లి, వట్టిచెరుకూరు, కంగుంది, గుటుపల్లి వంటి గ్రామాల్లో దశాబ్దాలుగా వివాదంలో ఉన్న భూములకు విముక్తి కల్పించాం. ఇప్పుడు ప్రారంభించిన మీ భూమి–బ్లాక్ చెయిన్ వ్యవస్థ ద్వారా భూములకు శాశ్వత భద్రత దక్కుతుంది. భూ రికార్డులకు సంబంధించి ట్యాంపర్ ప్రూఫ్ వ్యవస్థను తెస్తున్నాం.. పటిష్టమైన భద్రత కల్పిస్తున్నాం. బ్లాక్ చెయిన్ ద్వారా రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే వేదిక మీదకు వస్తాయి... ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్రయ విక్రయాలు చేసుకోవచ్చు. రెండు నెలల పాటు ఈ పైలెట్ ప్రాజెక్టు అమలును పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాలి. ఈ వ్యవస్థ అమల్లో ఏమైనా లోటుపాట్లను వాటిని నమోదు చేసుకోవడానికి ఓ కంప్లైంట్ సెల్ పెట్టాలి... దానికి అనుగుణంగా బ్లాక్ చెయిన్ వ్యవస్థలో మార్పులు చేర్పులు చేసుకోవచ్చు. ఇప్పటి నుంచి సర్వే పూర్తి అయిన గ్రామాలు బ్లాక్ చెయిన్ టెక్నాలజీ వ్యవస్థలోకి వెళ్తాయి. నవంబర్ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా మీ భూమి–బ్లాక్ చెయిన్ టెక్నాలజీ వ్యవస్థ అందుబాటులోకి వచ్చేలా చూడాలి. భూ సమస్యలకు ఫుల్ స్టాప్ పెట్టేలా రెవెన్యూ వ్యవస్థను తీర్చిదిద్దుతున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ సమస్యలకు పరిష్కారం చూపాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. భూ సమస్యలకు పరిష్కారం చూపితే ఫిర్యాదుల సంఖ్య గణనీయంగా తగ్గుతుందని అన్నారు.

# 3 వేల 168 ఉద్యోగాల భర్తీకి గ్రీన్ సిగ్నల్

విజయవాడ : సీఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముగిసింది రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం, ఉద్యోగాల భర్తీకి సంబంధించి పలు కీలక అంశాలపై ఈ భేటీలో చర్చిస్తున్నారు. నిరుద్యోగులకు ఊరటనిస్తూ, రాష్ట్రంలో రెండో దశ కింద 3,168 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి కేబినెట్ ఆమోదముద్ర వేశారు. ఈ సమావేశంలో... చేనేత కార్మికులను ఆదుకునే లక్ష్యంతో రూపొందించిన 'నేతన్న భరోసా' పథకంపై కూడా కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ పథకం ద్వారా అర్హులైన ప్రతి చేనేత కుటుంబానికి రూ. 25,000 చొప్పున ఆర్థిక సహాయం అందించే ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదం తెలిపే అవకాశం ఉంది. దాదాపు 25కు పైగా అజెండా అంశాలపై ముఖ్యమంత్రి, మంత్రులు విస్తృతంగా చర్చిస్తున్నారు. వీటితో పాటు బాపట్ల జిల్లా వెదుళ్లపల్లిలో వినికిడి లోపం ఉన్న విద్యార్థుల కోసం ప్రత్యేక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు ప్రతిపాదనను కూడా మంత్రివర్గం పరిశీలించనుంది. శ్రీకాకుళంలో బ్రహ్మకుమారీస్ సంస్థకు కేటాయించిన స్థలం లీజు కొనసాగింపు, 15వ ఆర్థిక సంఘం నిధులతో అగ్నిమాపక శాఖకు కొత్త వాహనాలు, ఆధునిక పరికరాలు కొనుగోలు చేసే అంశాలు కూడా అజెండాలో ఉన్నాయి. సమావేశం ముగిసిన అనంతరం కేబినెట్ తీసుకున్న ముఖ్య నిర్ణయాలను ప్రభుత్వం అధికారికంగా వెల్లడించనుంది. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. విద్యా రంగానికి సంబంధించి బాపట్ల జిల్లాలో వినికిడి లోపం ఉన్న విద్యార్థుల కోసం ప్రత్యేక డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ప్రత్యేక అవసరాలు ఉన్న విద్యార్థులకు ఉన్నత విద్య అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఇక గోదావరి పుష్కరాల నిర్వహణ, భద్రతా ఏర్పాట్ల కోసం రూ. 50 కోట్ల నిధులను మంజూరు చేయాలని రాష్ట్ర కేబినెట్ ఆమోదించింది. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించింది. అలాగే ఏపీ మార్క్‌ఫెడ్‌కు రూ. 300 కోట్ల రుణం పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటీ ఇవ్వాలని కూడా కేబినెట్ నిర్ణయించింది. ఈ సమావేశంలో ఎల్ నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, వ్యవసాయ పరిస్థితులపై కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా సమీక్షించారు. వ్యవసాయ, నీటిపారుదల శాఖల నుంచి తాజా నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం సాగులో ఉన్న పంటల విస్తీర్ణం, వివిధ జలాశయాల్లో ఉన్న నీటి నిల్వలు, వర్షపాతం పరిస్థితులపై సమగ్ర సమాచారం ఇవ్వాలని సూచించారు. త్రాగునీరు, సాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ రైతులు, ప్రజలకు నీటి కొరత తలెత్తకుండా ముందస్తు కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా నీటి వినియోగంపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని కేబినెట్ సమావేశంలో నిర్ణయించారు. పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుమలను రాజకీయావసరాలకు వేదికగా మార్చవద్దని టీటీడీ బోర్డు సభ్యుడు, బీజేపీ నేత భానుప్రకాశ్ రెడ్డి హెచ్చరించారు. సనాతన ధర్మాన్ని, ఆలయ వ్యవహారాలను తమ రాజకీయ లబ్ధి కోసం వాడుకోవద్దని వైసీపీ నేతలకు గట్టి హితవు పలికారు. ఢిల్లీ వేదికగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తిరుమల ఘాట్ రోడ్డులో చోరీకి గురైన ఆంజనేయస్వామి విగ్రహాన్ని పోలీసులు 24 గంటల్లోనే రికవరీ చేశారని, వెంటనే దాన్ని పునఃప్రతిష్ఠించామని తెలిపారు. గత వైసీపీ పాలనలో రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో దేవాలయాలపై దాడులు జరిగాయని భానుప్రకాశ్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శించారు. కానీ, ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో దేవాలయాల పరిపాలన అత్యంత పారదర్శకంగా, భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా సాగుతోందని వెల్లడించారు. తిరుమల టీటీడీ నిధుల మళ్లింపుపై ప్రశ్నిస్తూ, వైసీపీ నేత భూమన కరుణాకర్ రెడ్డి మాట్లాడేముందు తగిన ఆధారాలతో మాట్లాడాలని సవాల్ విసిరారు. ఆలయ పాలన లేదా మరే ఇతర అంశంపై అయినా తాము బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని భానుప్రకాశ్ రెడ్డి స్పష్టం చేశారు. కేవలం ప్రభుత్వంపై బురదజల్లడమే ధ్యేయంగా అసత్య ప్రచారాలు చేయడం మానుకోవాలని ఆయన ఈ సందర్భంగా వైసీపీ నాయకులకు హితవు పలికారు.

జగన్ గందరగోళం క్రియేట్ చేస్తున్నారు

రాజధాని విషయంలో వైసీపీ అధినేత జగన్ అనవసర గందరగోళం సృష్టిస్తూ ప్రజలను తికమక పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఏపీ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మండిపడ్డారు. జగన్ కనీసం ఒక్కసారైనా నేరుగా వచ్చి అమరావతిలో జరుగుతున్న అభివృద్ధిని కళ్లారా చూడాలని హితవు పలికారు. రాజధాని నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. అమరావతి త్వరలోనే ఒక అంతర్జాతీయ స్థాయి ఎడ్యుకేషన్ హబ్‌గా మారబోతోందని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. త్వరలోనే ఇక్కడ భారీ స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీతో పాటు ప్రముఖ కళాశాలలు ఏర్పాటు కాబోతున్నాయని వెల్లడించారు. అమరావతిలో భవనాల నిర్మాణాలు అద్భుతంగా సాగుతున్నాయని, భవిష్యత్తులో ఇది అత్యంత అద్భుతమైన నివాస యోగ్యమైన నగరంగా రూపుదిద్దుకుంటుందని తెలిపారు. ఐకానిక్ భవనాలకు సంబంధించిన మొదటి డైమండ్ నిర్మాణం ఇప్పటికే పూర్తయిందని, ఈ ఏడాది డిసెంబర్ నాటికి 12 ఫ్లోర్లు సిద్ధమవుతాయని ప్రకటించారు. అంతేకాకుండా ప్రాంతీయ అనుసంధానం కోసం త్వరలోనే ఇక్కడ అంతర్జాతీయ విమానాశ్రయం కూడా రాబోతుందని స్పష్టం చేశారు. రాజధాని నిర్మాణానికి తమ విలువైన భూములను త్యాగం చేసిన రైతుల చలవ వల్లే ఈరోజు అమరావతిలో ఇంతటి భారీ నిర్మాణాలు సాధ్యమవుతున్నాయని మంత్రి కొనియాడారు. వారి త్యాగాలను కూటమి ప్రభుత్వం ఎప్పటికీ గుర్తుంచుకుంటుందన్నారు. కాగా, ఏపీ ప్రభుత్వం ప్రస్తుతం అమరావతి పునర్నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించి శరవేగంగా అడుగులు వేస్తోంది. భారీగా పెట్టుబడులను ఆకర్షిస్తూ మౌలిక వసతుల కల్పనను వేగవంతం చేసింది. ఇప్పటికే పలు దిగ్గజ సంస్థలు అమరావతిలో తమ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ఒప్పందాలు కుదుర్చుకోగా, మరికొన్ని సంస్థలు తమ కార్యాలయాల నిర్మాణ పనులను కూడా ప్రారంభించాయి

# వైసీపీ బీజేపీకి భయపడుతోందా.. !

విజయవాడ :ఒక్క ఛాన్స్ అనేది.. వ్యక్తులకే కాదు.. పార్టీలకు కూడా వర్తిస్తుంది. ముఖ్యంగా వచ్చే ఎన్నికల్లో అధికారం కోసం వేచి చూస్తున్న వైసీపీ వంటి పార్టీలు.. ఏ చిన్న ఛాన్స్ చిక్కినా అల్లుకుపోవాలి. దానిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలి. ప్రజల తరఫున వాయిస్ వినిపించాలి. అయితే.. కారణాలు ఏమైనా కూడా ఈ విషయంలో వైసీపీ వెనుకబడిందనే చెప్పాలి. వీటిలో కొన్ని రాష్ట్ర సమస్యలు ఉండగా.. మరికొన్ని దేశవ్యాప్త సమస్యలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం దేశవ్యాప్తం నీట్ పరీక్షపై ఆందోళనలు జరుగుతున్నాయి. దీనికి దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రతిపక్షాలు కూడా గళం కలిపాయి. తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ సహా.. దక్షిణాది రాష్ట్రాలన్నీ ఏకమయ్యాయి. ఇవన్నీ.. బీజేపీని వ్యతిరేకించే పార్టీలే. తద్వారా ఆయా రాష్ట్రా ల్లో విద్యార్థుల తరఫున నిలబడి పోరాటాలను ఉధృతం చేస్తున్నాయి. ఫలితంగా ప్రజల తరఫున ఈ పార్టీ లు నిలబడ్డాయన్న వాదన బలంగా వినిపిస్తోంది. మరి వైసీపీ పరిస్థితి ఏంటి? అనేది ముఖ్యం. బీజేపీని వ్యతిరేకించడం ఇష్టం లేదని వైసీపీ నాయకుల్లో ఉండి ఉండవచ్చు. భజానికి కట్టుతోనే సమీక్షలు, సమావేశాలు కానీ, లక్షలాది మంది విద్యార్థులను విస్మరించడం అనేది పార్టీకి తీవ్ర నష్టం కదా? అనే ప్రశ్న ఉత్పన్నమ వుతుంది. రాజకీయంగానే ప్రతి అంశాన్నీ చూడలేం. కొన్ని కొన్ని సందర్భాల్లో ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా కూడా ముందుకు సాగొచ్చు. కానీ, ఈ విషయంలో బీజేపీపై పన్నెత్తు మాట కూడా అనలేని నిస్సహాయ స్థితిలో వైసీపీ ఉండిపోయిందన్న టాక్ అయితే.. పబ్లిక్‌లో వినిపిస్తోంది. ఇక, సర్‌పైనా ఇదే ధోరణితో ముందుకు సాగుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఆ తర్వాత.. కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా ఉద్యమించినప్పుడు.. ఆయన మౌనంగా ఉన్నారు. మరీ ముఖ్యంగా వైద్య విద్యా సీట్లను.. మెడికల్ కాలేజీలను లెక్కకు మిక్కిలిగా తీసుకువచ్చామని చెబుతున్న జగన్..

# కూటమికి టిక్కెట్ల సవాల్

విజయవాడ జూలై 25 (ప్రజా కలం ప్రతినిధి) ఆంధ్రప్రదేశ్ రాజకీయం మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికలు సమయం దగ్గర పడుతోంది. ఈ సారి ఎన్నికల బరిలో అధికార కూటమి ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాల్ ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కాదు.. ఆయా పార్టీల మధ్య సమన్వయమే. సార్వత్రిక ఎన్నికల్లో లభించిన క్లీన్ స్వీప్ విజయం తర్వాత, క్షేత్రస్థాయిలో కూటమి గ్రాఫ్ బలంగా ఉంది. వైసీపీ రక్షణాత్మక ధోరణిలో ఉండటంతో, తాము గెలుపు గుర్రాలమనే ధీమా కూటమి నేతల్లో అత్యధికంగా ఉంది. ఫలితంగా, అసలు పోటీ ప్రతిపక్షంతో కాదని, టిక్కెట్ల కోసం తమలో తామే పోటీ పడాల్సి ఉంటుందని కూటమి అగ్రనాయకత్వానికి ముందే అర్థమైంది. కింది స్థాయి నేతలంతా తామంటే తామే పోటీ చేస్తామని ఎగబడుతుండటంతో సీట్ల పంపకం, సమన్వయం అనేది ఇప్పుడు అత్యంత కీలకంగా మారింది. ఈ అంతర్గత పోటీని, అసమ్మతిని ముందే పసిగట్టిన కూటమి పెద్దలు అప్రమత్తమయ్యారు. ఎక్కడికక్కడ మున్సిపల్ వార్డులు, ఎంపీటీసీ స్థానాల వారీగా ఏ పార్టీ ఏ స్థానంలో పోటీ చేయాలనే దానిపై ఓ స్పష్టత తెచ్చేందుకు తెరవెనుక ప్రత్యేక సమన్వయ సమావేశాలు నిర్వహించారు. గత ఎన్నికల ఓట్ల శాతం, స్థానిక బలాబలాలు , ఇరు పార్టీల నేతల అంగీకారం ఆధారంగా ఒక స్థూల ప్రణాళికను సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. ఈ చర్చలు ప్రాథమికంగా ఒక కొలిక్కి రావడంతోనే ప్రభుత్వం ఎన్నికల నిర్వహణ దిశగా వేగంగా అడుగులు వేస్తోంది. ఏ ఒక్క స్థానంలో కూడా ఓట్ల చీలిక రాకుండా, పరస్పరం సహకరించుకునేలా కింది స్థాయి క్యాడర్‌ను మానసికంగా సిద్ధం చేస్తున్నారు.మరోవైపు, జనసేన పార్టీలో ఈ ఎన్నికల కోసం ప్రత్యేకంగా గ్రౌండ్ వర్క్ నడుస్తోంది. పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఆ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ కూడా కూటమి సమన్వయంపై గట్టి సంకేతాలే ఇచ్చారు. కూటమి శ్రేణుల మధ్య ఐక్యత మిస్ కాకూడదని, సీట్ల సర్దుబాటులో ఒకరికొకరు గౌరవం ఇచ్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అంతేకాకుండా, గత ఐదేళ్లుగా పార్టీ కోసం నిలబడి, జెండా మోసి కష్టపడిన నిజమైన జనసైనికులకు ఈ స్థానిక ఎన్నికల్లో సముచిత స్థానం కల్పించేలా జనసేన అధిష్టానం ఇప్పటికే అంతర్గతంగా సమాచార సేకరణ పూర్తి చేసింది. పార్టీ గెలిచే అవకాశాలు ఉన్న స్థానాల జాబితాను సిద్ధం చేసి, చంద్రబాబుతో సీట్ల సర్దుబాటు చర్చలకు పక్కా వ్యూహంతో సిద్ధమైంది.మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల వార్డుల స్థాయిలో గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉండటంతో, క్షేత్రస్థాయి నేతల్లో ఆశావహుల సంఖ్య వేలల్లో ఉంది. సీటు దక్కని పక్షంలో తిరుగుబాటు అభ్యర్థులుగా బరిలోకి దిగే ప్రమాదం కూడా లేకపోలేదు. అలాంటి చోట్ల ఆశావాహులను బుజ్జగించి, కూటమి క్రమశిక్షణను కాపాడటంలోనే మూడు పార్టీల సమన్వయకర్తల అసలు పరీక్ష దాగి ఉంది. ఏదేమైనా, ఈ లోకల్ బాడీ ఎన్నికలను విజయవంతంగా ముగించి తమ ఆధిపత్యాన్ని నిరూపించుకోవాలని కూటమి భావిస్తుండటంతో, సీట్ల పంపకాల వ్యూహం కీలకం కానుంది.

**15 తర్వాత మున్సిపల్ ఎన్నికలు...** కూటమి ప్రభుత్వం ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై తీవ్ర కసరత్తు ప్రారంభించింది. రాష్ట్రంలో ఐదేళ్ల కాలపరిమితి ముగిసిన స్థానిక సంస్థలకు వీలైనంత త్వరగా ఎన్నికలు పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలోనే రాబోయే సెప్టెంబర్ నెలలోనే స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం , ఎన్నికల సంఘం ఒక పక్కా ప్రణాళికను సిద్ధం చేశాయి.ఎన్నికల నిర్వహణ వ్యూహంలో భాగంగా ప్రభుత్వం ఒక కీలక నిర్ణయానికి వచ్చింది. రాష్ట్రంలో ఒకేసారి కాకుండా విడతలవారీగా ఎన్నికలను జరపాలని భావిస్తోంది. ఇందులో భాగంగా తొలుత పట్టణ ప్రాంతాల్లోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించేందుకు మొగ్గు చూపుతోంది. ఆ తర్వాత గ్రామీణ పరిధిలోకి వెళ్తూ ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను పూర్తి చేయాలని ప్రణాళిక రచించింది. ఈ రెండు దశలు ముగిసిన అనంతరం ఆఖరిగా గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు వెళ్లాలనేది ప్రభుత్వ ఆలోచనగా తెలుస్తోంది.జూలై 27వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా 45 రోజుల పాటు సుదీర్ఘంగా డోర్ టూ డోర్ కార్యక్రమాన్ని చేపట్టాలని పార్టీ అధిష్టానం క్యాడర్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా మున్సిపల్ ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేయడమే లక్ష్యంగా పార్టీ యంత్రాంగాన్ని సమాయత్తం చేస్తోంది. స్థానిక సమరానికి ముందే పార్టీ నేతల్లో అసంతృప్తిని చల్లార్చేందుకు కూటమి సర్కార్ అడుగులు వేస్తోంది. గత కొన్నాళ్లుగా పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియను అత్యంత వేగంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయించారు. పదవులు దక్కిన నేతలు మరింత ఉత్సాహంతో క్షేత్రస్థాయిలో పార్టీ విజయానికి కృషి చేస్తారనే నమ్మకంతో ఉన్నారు.

# ముద్రగడ ఫ్యామిలీ ఫ్యూచర్ ఏంటీ?

కాకినాడ జూలై 25 (ప్రజా కలం ప్రతినిధి) దశాబ్దాల పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తన సంచలన నిర్ణయాలతో, సుదీర్ఘ సామాజిక పోరాటాలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సీనియర్ నేత ముద్రగడ పద్మనాభం మృతితో ఒక సుదీర్ఘ అధ్యాయం ముగిసింది. అయితే, ఆయన జీవిత చరమాంకంలో, అంత్యక్రియల వేళ కూడా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నడిపిన రాజకీయ వ్యూహాలు ఆయన కుటుంబానికి కనీస ప్రశాంతత లేకుండా చేశాయి. జీవించి ఉన్నంత కాలం ముద్రగడ చేత సుదీర్ఘ లేఖలు రాయించి, తమ పొలిటికల్ అజెండా కోసం ఆయన ఇమేజ్‌ను వాడుకున్న వైసీపీ.. ఇప్పుడు ఆయన లేని తరుణంలో ఆ కుటుంబాన్ని పట్టించుకుంటుందా అన్న చర్చ నడుస్తుంది.గత ఎన్నికల ముందు ముద్రగడ పద్మనాభం వైసీపీలో చేరిన నాటి నుండి, ఆయనను పూర్తిగా ప్రత్యర్థులపై విమర్శలు గుప్పించే ఒక రాజకీయ ఆయుధంగానే అధినాయ కత్వం వాడుకుందనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. కూటమి నేతలపై లేఖల అస్త్రాలు సంధించడానికి, కుల సమీకరణలను తమకు అనుకూలంగా మార్చుకోవడానికి నాటి అధికార పార్టీ ఆయనకు ప్రాధాన్యతనిచ్చింది. కానీ, ఇప్పుడు ఆయన భౌతికంగా లేరు. ముద్రగడ రాజకీయ వారసత్వాన్ని మోయాల్సిన ఆయన కుమారుడు గిరిబాబు ప్రస్తుతానికి రాజకీయంగా అంత యాక్టివ్‌గా లేరు, పైగా ఆర్థికంగానూ పటిష్టమైన స్థితిలో లేరనే గుసగుసలు కిర్లంపూడి వర్గాల్లో బలంగా వినిపిస్తున్నాయి. ఇలాంటి బలహీనమైన తరుణంలో వైసీపీ ఆ కుటుంబాన్ని ఎంతవరకు ఆదుకుంటుందనేది పెద్ద ప్రశ్నార్థకమే.వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాజకీయ శైలిని దగ్గరుండి గమనించిన ఎవరికైనా ఒక విషయంపై పూర్తి స్పష్టత ఉంటుంది. తమకు రాజకీయంగా అవసరం ఉన్నంత కాలమే ఎవరికైనా రెడ్ కార్పెట్ పరుస్తారని, ఒకసారి ఆ అవసరం తీరిపోయాక వారిని కరివేపాకులా తీసిపారేస్తారనే విమర్శలు పార్టీలోనే బలంగా ఉన్నాయి. గతంలో పార్టీ కోసం కష్టపడిన ఎందరో సీనియర్ల కుటుంబాలను జగన్ రెడ్డి ఎలా పక్కన పెట్టారో ఉదాహరణలు కళ్లముందే ఉన్నాయి. ఇప్పుడు ముద్రగడ కుటుంబం విషయంలోనూ ఇదే రిపీట్ కాబోతోందని, జగన్ కానీ, వైసీపీ టాప్ లీడర్‌షిప్ కానీ ఇకపై ముద్రగడ కుటుంబాన్ని పెద్దగా పట్టించుకునే ప్రసక్తే లేదని అంటున్నా?.ప్రస్తుతానికి ముద్రగడ మృతి పట్ల వైసీపీ నేతలు సానుభూతి ప్రకటిస్తున్నప్పటికీ, రాబోయే రోజుల్లో వారి అసలు రంగు బయటపడుతుందని రాజకీయ పండితులు అంచనా వేస్తున్నారు. వచ్చే ఎన్నికల నాటికి ముద్రగడ వారసులకు అసెంబ్లీ లేదా పార్లమెంట్ టిక్కెట్ ఇచ్చే ఉద్దేశం జగన్ మోహన్ రెడ్డికి అస్సలు లేదు. కష్టకాలంలో జెండా మోసేవారికే దిక్కులేని వైసీపీలో, కేవలం ఎన్నికల ముందు వచ్చి చేరిన సీనియర్ నేత కుటుంబానికి భవిష్యత్తు సీట్ల కేటాయింపుల్లో అగ్రతాంబూలం ఇస్తారని అనుకోవడం ముమ్మాటికీ అమాయ కత్వమే అవుతుంది. ఇప్పుడున్న సానుభూతి పవనాలు చల్లారిన తర్వాత, సరిగ్గా మరో ఆరు నెలలకో లేదా ఏడాదికో ముద్రగడ కుటుంబానికి వైసీపీలో ఎలాంటి ప్రాధాన్యత దక్కుతుందో, ప్రత్యక్షంగా చూస్తారని వేసీపీ నేతలే జోస్యం చెబుతున్నారు.

# టీడీపీలోకి వాసిరెడ్డి?



విజయవాడ జూలై 25 (ప్రజా కలం ప్రతినిధి) వైసీపీ నుంచి బయటకు వచ్చిన మహిళా నాయకురాలు.. వాసిరెడ్డి పద్మకు పొలిటికల్‌గా లైన్ క్లియర్ అయినట్టు తెలుస్తోంది. తాజాగా మంత్రి నారా లోకేష్‌తో ఆమె భేటీ అయ్యారు. దీంతో త్వరలోనే ఆమె టీడీపీ కండువా కప్పుకొనే అవకాశం ఉందని పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ప్రతి విషయంలోనూ దూకుడుగా ఉండే వాసిరెడ్డి పద్మ దాదాపు 20 ఏళ్లకుపైగానే రాజకీయాల్లో కొనసాగుతున్నారు.వైసీపీ అధికార ప్రతినిధిగా.. ఆ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత.. మహిళా కమిషన్ చైర్ పర్సన్‌గా వ్యవహరించారు. గత ఎన్నికల్లో ఉమ్మడి కృష్ణాజిల్లాలోని ఓ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని భావించినా.. జగన్ ఆమెకు అవకాశం ఇవ్వలేదు. దీంతో అప్పటి ఎన్నికలకు దూరంగా ఉన్నారు. ఎన్నికల అనంతరం.. వైసీపీ నుంచి బయటకు వచ్చిన పద్మ.. సంచలన వ్యాఖ్యలు చేయడం తెలిసిందే. జగన్ కారణంగానే అందరూ ఓడిపోయారని అన్నారు. పార్టీని నడిపించడం.. నాయకులను సమన్వయం చేయడం కూడా రాదని పద్మ వ్యాఖ్యానించారు. ఈ క్రమంలోనే వైసీపీ నుంచి బయటకు వచ్చిన ఆమె.. అప్పటి నుంచి ఏ పార్టీలోనూ చేరకుండా మౌనంగా ఉన్నారు. సుమారు ఏడాదిన్నరగా మౌనంగా ఉన్న పద్మ.. తాజాగా టీడీపీలో చేరనున్నట్టు తెలుస్తోంది. పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేష్‌తో ఆమె భేటీ అయ్యారు. ఆయన పనితీరు, మంత్రి వర్గంలో వ్యవహరిస్తున్న తీరునుకొనియాడారు.అయితే.. ఇప్పటికిప్పుడు వాసిరెడ్డి చేరికపై పార్టీలో ఎలాంటి ప్రకటన రాలేదు. త్వరలోనే దీనిపై క్లారిటీ వస్తుందని అంటున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పద్మకు అవకాశం దక్కుతుందని పార్టీ నాయకులు చెబుతున్నారు. పైగా వచ్చే ఎన్నికల నాటికి మహిళలకు ప్రాధాన్యం పెరుగుతున్న దరిమిలా వాసిరెడ్డికి టీడీపీ తరఫున పోటీ చేసేందుకు కూడా మంచి అవకాశం చిక్కే పరిస్థితి ఉంటుందని అంచనా వేస్తున్నారు.

# నిలకడలేని మార్కెట్

**నాల్గోవంతు పొగాకు బేళ్లు నోబిడ్ - కనిగిరిలో అత్యధికంగా 55.37శాతం - మరికొన్ని చోట్ల 30నుంచి 36శాతం**

ఒంగోలు జూలై 25 (ప్రజా కలం ప్రతినిధి) దక్షిణాది పొగాకు మార్కెట్లో నిలకడ కనిపించడం లేదు. ఒక్కో రోజు ఒక్కో రకంగా సాగుతోంది. క్రమంగా వేలానికి రోజువారీ వచ్చే బేళ్ల సంఖ్య పెరుగుతుండగా నోబిడ్‌లు, సగటు ధరలు నిలకడగా ఉండటం లేదు, వరుసగా రెండు, మూడు రోజులు కూడా ఒకేరకంగా మార్కెట్ సాగడం లేదు. మార్కెట్లో నోబిడ్‌లు గతం కన్నా తగ్గాయి. ఇవి సగటున 18.40శాతం ఉండగా, కిలోకు సగటున రూ.195.20 ధర లభించింది. అయితే మార్కెట్లో నోబిడ్‌లు ఏకంగా ఏడు శాతం పెరిగాయి. సగటున 25.38శాతం బేళ్లు నోబిడ్ అయ్యాయి. దక్షిణాదిలోని 11 వేలం కేంద్రాలకు 7,612 బేళ్లు అమ్మకానికి తీసుకురాగా 5,214 బేళ్లను బయ్యర్లు కొనుగోలు చేశారు. మరో 2,398 వివిధ కారణాలతో తిరస్కరణకు గురయ్యాయి. అందులో 1,932 బేళ్లు అధికారులు సూచించిన ధరలకు బయ్యర్లు కొనుగోలు చేయక నోబిడ్ అయ్యాయి. అంటే వేలానికి వచ్చిన బేళ్లలో 25.38 శాతం నోబిడ్ చేశారు. కొన్నిచోట్ల నోబిడ్‌లు ఆందోళనకరంగానే కనిపిస్తున్నాయి. కనిగిరి వేలం కేంద్రంలో ఏకంగా 55.37 శాతం బేళ్లు నోబిడ్ అయ్యాయి. అవి వెల్లంపల్లిలో 36.50శాతం, ఒంగోలు-2 కేంద్రంలో 32.26శాతం, కందుకూరు-2లో 31.68శాతం, కలిగిరిలో 31.11 శాతంగా ఉన్నాయి. అదేసమయంలో 671 బేళ్లు అమ్మకానికి వచ్చిన కందుకూరు-1 కేంద్రంలో కేవలం 7శాతం మాత్రమే నోబిడ్ కావడం గమనార్హం. అలాగే 528 బేళ్లు వచ్చిన డీసీపల్లిలో 9.43శాతం, 943 బేళ్లు తెచ్చిన కొండపిలో 10.60శాతం మాత్రమే నోబిడ్ కావడం మార్కెట్లో నిలకడలేని పరిస్థితికి నిదర్శనం.



# ఖరీఫ్ ఆశల గల్లంతు

కర్నూలు జూలై 25 (ప్రజా కలం ప్రతినిధి) ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం ఎప్పటి నుంచో వెన్నెముకగా నిలుస్తోంది. రాష్ట్ర విభజన తర్వాత ఐటీ , పారిశ్రామిక రంగాల అభివృద్ధిపై ప్రభుత్వాలు దృష్టి పెట్టినా, ఇప్పటికీ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ప్రధాన ఆధారం వ్యవసాయమే. అయితే ఈ ఏడాది ఎల్ నినో ( ప్రభావంతో రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడం రైతాంగాన్ని తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. పంటల సాగు ప్రారంభం కావాల్సిన సమయంలోనే వానలు లేకపోవడంతో ఖరీఫ్ సీజన్‌పై అనిశ్చితి నెలకొంది.సాధారణంగా నైరుతి రుతుపవనాలు జూన్ తొలి వారంలో రాష్ట్రంలోకి ప్రవేశిస్తాయి. ఈసారి ప్రారంభంలో అక్కడక్కడా స్వల్ప వర్షాలు కురిసినా, ఆ తర్వాత వర్షాలు దాదాపు పూర్తిగా నిలిచిపోయాయి. గత నెలన్నర కాలంలో రాష్ట్రానికి రావాల్సిన వర్షపాతం కంటే సుమారు 49 శాతం తక్కువ వర్షం మాత్రమే నమోదవడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. సగటున 170.3 మిల్లీమీటర్ల వర్షం పడాల్సి ఉండగా కేవలం 86.3 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది.ముఖ్యంగా రాయలసీమ ప్రాంతం తీవ్ర కరవుతో అల్లాడుతోంది. జూలై తొలి పదిహేను రోజుల్లో దాదాపు 94 శాతం వరకు వర్షపాతం లోటు నమోదవడం అక్కడి రైతులను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టింది. అదే సమయంలో కోస్తా ఆంధ్ర జిల్లాల్లో కూడా పరిస్థితి ఆశాజనకంగా లేదు. అక్కడ కూడా సాధారణ స్థాయితో పోలిస్తే దాదాపు 70 శాతం తక్కువ వర్షం కురిసింది. రాష్ట్రంలోని 28 జిల్లాల్లో ఏ ఒక్క జిల్లాలోనూ సాధారణ వర్షపాతం నమోదు కాకపోవడం పరిస్థితి ఎంత ఆందోళనకరంగా ఉందో చెప్పకనే చెబుతోంది.రాష్ట్రంలోని 676 మండలాల్లో అధిక శాతం ప్రాంతాలు వర్షాభావాన్ని ఎదుర్కొంటున్నాయి. దీంతో భూగర్భ జలాల మట్టం వేగంగా పడిపోతోంది. బోర్లు ఎండిపోవడం, చెరువులు నీరు కోల్పోవడం, రిజర్వాయర్లలో నీటి నిల్వలు డెడ్ స్టోరేజ్ స్థాయికి చేరుకోవడం రైతుల్లో మరింత ఆందోళన పెంచుతోంది.ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే వరి, వేరుశనగ, పత్తి, పప్పుధాన్యాలు, చిరుధాన్యాల సాగు ఈసారి తీవ్ర ప్రభావానికి గురయ్యే అవకాశం కనిపిస్తోంది. వర్షాలు లేకపోవడం మాత్రమే కాకుండా, అధిక ఉష్ణోగ్రతలు కొనసాగుతుండటంతో విత్తనాలు వేయడానికి కూడా రైతులు వెనుకంజ వేస్తున్నారు. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో సాగు పనులు నిలిచిపోయాయి. ఈ పరిస్థితి కొనసాగితే వ్యవసాయ ఉత్పత్తిపై మాత్రమే కాకుండా గ్రామీణ ఉపాధి, రైతుల ఆదాయం, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం పడే అవకాశం ఉంది. వాతావరణ పరిస్థితులు త్వరగా మారి జూలై రెండో పక్షంలో అయినా మంచి వర్షాలు కురిస్తే కొంతవరకు పరిస్థితి మెరుగుపడే అవకాశముందని వ్యవసాయ నిపుణులు భావిస్తున్నారు. లేకపోతే ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ రైతులకు తీవ్ర నిరాశను మిగిల్చే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. సహాయక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని రైతు సంఘాలు సూచిస్తున్నాయి.

# పోలవరానికి పర్యాటక శోభ

రాజమండ్రి జూలై 25 (ప్రజా కలం ప్రతినిధి) ఆంధ్రప్రదేశ్‌లో పోలవరానికి పర్యాటక శోభను తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం భారీ ప్రణాళికలు రచిస్తోంది. పోలవరం డ్యామ్‌తోపాటు గోదావరి నదీ తీరాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టిపెట్టారు. ఇందులో భాగంగా ప్రాజెక్టు ప్రాంతంతోపాటు ప్రాజెక్టు దిగువన, ఎగువన టూరిజం డెవల్మెంట్‌కు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నారు. ఈ అంశంపై సీఎం క్యాంప్ కార్యాల యంలో ఇరిగేషన్, టూరిజం శాఖ అధికారలుతో పాటు ఏజెన్సీలతో ముఖ్యమంత్రి సమావేశం అయ్యారు. నదీతీరం వెంట టూరిజం ప్రాజెక్టులతో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. ప్రాజెక్టు వద్ద కేబుల్ బ్రిడ్జ్ డిజైన్, స్పిల్ వే బ్యూటిఫికేషన్ సహా మాస్టర్ ప్లాన్‌పై చర్చించారు. టూరిజం ప్రాజెక్టుల అభివృద్ధిలో అనుభవం ఉన్న నిప్పాన్ కోయి సంస్థ ప్రతినిధులు ముఖ్యమంత్రికి ప్రజెంటేషన్ ఇచ్చారు. పోలవరం ప్రాజెక్టు సమీపంలో నదికి ఇరువైపులా పర్యాటక ప్రాజెక్టులు ఏర్పాటుపై చర్చించారు.పోలవరం ప్రాజెక్టు ఎగువున భద్రాచలం సమీపం వరకు ఏపీ భూభాగంలో టూరిజం అభివృద్ధికి అనేక అవకాశాలు ఉన్నాయని సీఎం చంద్రబాబు అభిప్రాయప డ్డారు. సమృద్ధిగా నీటి వనరులు, పచ్చని కొండలు, అటవీ ప్రాంతాలతో మంచి పర్యాటక ప్రాంతంగా పోలవరం మారుతుందని సీఎం అన్నారు. ఎకో టూరిజం, రాక్ క్లైంబింగ్, వెల్‌నెస్ సెంటర్స్, డెస్టినేషన్ వెడ్డింగ్స్ వంటి వాటికి అనుకూలంగా మార్చాలని సీఎం సూచించారు. ఈ నేపథ్యంలో పలు ప్రాజెక్టులు చేపట్టడం ద్వారా పర్యాటక రంగంలోనూ పోలవరాన్ని ప్రత్యేకంగా నిలపేలా చేయాలన్నారు.ఇంజనీరింగ్ టూరిజం, రివర్ ఫ్రంట్ టూరిజం, అడ్వెంచర్ టూరిజం డెవల్మెంట్‌కు ఈ ప్రాంతం అత్యంత అనుకూలమన్న ఏజెన్సీ.. వాటర్ స్పోర్ట్స్‌కు సమృద్ధిగా అవకాశాలు ఉన్నాయని వివరించింది. స్పిల్ వే దిగువున నది మధ్యలో 500 ఎకరాల ఐ లాండ్ స్థలాన్ని అభివృద్ధి చేసే విషయంలో పలు డిజైన్లు ప్రతిపాదనలను అందించారు. అలాగే మధ్యలో ఉండే వాటర్ బాడీలు, కొండలను పర్యాటక ప్రాంతాలుగా మార్చేందుకు ఉన్న అవకాశాలను సంస్థ ప్రతినిధులు వివరించారు.

స్పిల్ వే దిగువన కేబుల్ బ్రిడ్జ్ డిజైన్లపైనా ప్రజెంటేషన్ ఇచ్చారు. ఐలాండ్‌గా ఉన్న ప్రాంతంతో పాటు చుట్టుపక్కల మొత్తం 1,500 ఎకరాల్లో తీసుకురాదగిన ప్రాజెక్టులపై నిప్పాన్ కోయి సంస్థ ప్రజెంటేషన్‌లో పలు ప్రతిపాదనలు చేసింది.ప్రాజెక్టుతో లక్షల ఎకరాలకు నీరు ఇవ్వడంతో పాటు...పర్యాటకంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం ద్వారా రాష్ట్రానికి ఆదాయం వస్తుందని, స్థానికంగా ఎంతోమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రజెంటేషన్ సందర్భంగా సీఎం పలు సూచనలు చేశారు. అఖండ గోదావరి ప్రాజెక్టు కింద ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున పర్యాటక ప్రాజెక్టులు తీసుకువస్తామని సీఎం స్పష్టం చేశారు. అధికారులు ఆమేరకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.

# పెందుర్తిలో మూడు ముక్కలాట

విశాఖపట్టణం జూలై 25 (ప్రజా కలం ప్రతినిధి) విశాఖపట్నం జిల్లాలోని పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గం రాజకీయంగా ఎప్పుడూ ప్రత్యేక గుర్తింపు కలిగిన స్థానం. 1979లో ఏర్పాటైన ఈ నియోజకవర్గం నుంచి పలువురు ప్రముఖ నాయకులు ఎమ్మెల్యేలుగా ఎన్నికై రాష్ట్ర రాజకీయాల్లో తమ ముద్ర వేశారు. ద్రోణంరాజు సత్యనారాయణ వంటి సీనియర్ నాయకులు కూడా ఇక్కడి నుంచే శాసనసభకు ప్రాతినిధ్యం వహించారు. దీంతో ప్రతి ఎన్నికల్లో ఈ నియోజకవర్గంపై ప్రధాన పార్టీల దృష్టి ఎక్కువగా ఉంటుంది. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత పరవాడ మండలం పెందుర్తి పరిధిలోకి రావడంతో రాజకీయ సమీకరణాలు కూడా మారాయి. ఆ సమయంలో మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి తన రాజకీయ కేంద్రాన్ని పెందుర్తికి మార్చుకున్నారు. 2014 ఎన్నికల్లో ఆయన విజయం సాధించినప్పటికీ, 2009 మరియు 2019 ఎన్నికల్లో ఓటమిని ఎదుర్కొన్నారు. అనంతరం 2024 ఎన్నికల సందర్భంగా ఆయనను మాడుగుల నియోజకవర్గానికి మార్చగా, కూటమి ఒప్పందంలో భాగంగా పెందుర్తి స్థానాన్ని జనసేన కి కేటాయించారు. అక్కడ నుంచి పంచకర్ల రమేష్ బాబు విజయం సాధించి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.అయితే భవిష్యత్ రాజకీయాలపై బండారు సత్యనారాయణమూర్తి ఇప్పటి నుంచే వ్యూహాలు రచిస్తున్నారని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. తన కుమారుడు బండారు అప్పలనాయుడు ను రాజకీయాల్లోకి తీసుకురావాలని ఆయన భావిస్తున్నారని తెలుస్తోంది. అందుకే తమ కుటుంబానికి బలమైన పట్టున్న పెందుర్తి నుంచే ఆయనను బరిలోకి దించాలని ప్రయత్నాలు చేస్తున్నారనే ప్రచారం ఉంది. 2029 ఎన్నికల్లో తన వారసుడికి అవకాశం కల్పించి, అనంతరం క్రియాశీల రాజకీయాలకు దూరం కావాలనే ఆలోచనలో ఆయన ఉన్నారని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన పెందుర్తిలో పార్టీ కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ తన అనుచరులను ఏకతాటిపై ఉంచే ప్రయత్నాలు చేస్తున్నారని సమాచారం.మరోవైపు టీడీపీ లోనే మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ కూడా ఇదే స్థానంపై ఆశలు పెట్టుకున్నారు. గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసిన ఆయన తర్వాత టీడీపీలో చేరారు. 2019, 2024 ఎన్నికల్లో టికెట్ కోసం ప్రయత్నించినా అవకాశం రాలేదు. ప్రస్తుతం పార్టీ ఆయనకు పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాధ్యతలతో పాటు నామినేటెడ్ పదవిని కూడా అప్పగించింది. దీంతో వచ్చే ఎన్నికల్లో తనకే అవకాశం వస్తుందనే నమ్మకంతో ఆయన తన వర్గాన్ని మరింత బలోపేతం చేస్తున్నారని చెబుతున్నారు. దీనితో టీడీపీలోనే రెండు వర్గాల మధ్య పోటీ వాతావరణం నెలకొన్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.ఇదే సమయంలో జనసేన కూడా ఈ స్థానాన్ని తమకు కీలకమైన నియోజకవర్గంగా భావిస్తోంది. ప్రజారాజ్యం పార్టీ కాలంలో తొలిసారి ఈ ప్రాంతంలో విజయం సాధించిన పంచకర్ల రమేష్ బాబు, 2024లో జనసేన అభ్యర్థిగా మరోసారి గెలిచి తన రాజకీయ బలాన్ని నిరూపించుకున్నారు. అందువల్ల 2029 ఎన్నికల్లో కూడా ఆయననే బరిలో దింపాలని జనసేన భావిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది.ఈ పరిణామాల నేపథ్యంలో పెందుర్తి నియోజకవర్గం కూటమి రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు కేంద్రంగా మారింది.

# సేనతో నేను..

గుంటూరు జూలై 25 (ప్రజా కలం ప్రతినిధి) జనసేన పార్టీ స్థానిక ఎన్నికల కోసం సమాయత్తమవుతుంది. సెప్టెంబరులో స్థానిక సంస్థల ఎన్నికలు ఆంధ్రప్రదేశ్ లో జరగనున్నాయి. దీంతో జనసేన అప్రమత్తమయింది. కార్యకర్తల్లో ఉన్న నిరాశ, నిస్పృహలను తొలగించడానికి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. చర్చా వేదిక కార్యక్రమాన్ని నియోజకవర్గాల వారీగా నిర్వహించాలని నిర్ణయించారు. పార్టీ కోసం పాటుపడ్డ ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామన్న నినాదంతో కార్యకర్తల్లో తిరిగి ఉత్సాహం నింపేందుకు ఆ పార్టీ ఈ కార్యక్రమం డిజైన్ చేసిందని చెప్పాలి. క్షేత్ర స్థాయిలో కార్యకర్తలకు ఎదురవుతున్న సవాళ్లపై పార్టీ దృష్టి పెట్టిందని అనుకోవాలి. నియోజకవర్గాల వారీగా చర్చా వేదికను ఏర్పాటు చేసి కార్యకర్తల మనసులో మాటను విని వారి సమస్యల పరిష్కారానికి ఈ వేదిక ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. పవన్ కళ్యాణ్ భుజానికి శస్త్ర చికిత్స జరగడంతో ఈ బాధ్యతను మంత్రి నాదెండ్ల మనోహర్ తీసుకున్నారు. జనసేన లో ఏ గ్రూపులు ఉండవని, పవన్ కళ్యాణ్ గ్రూపు ఒక్కటే ఉంటుందని కార్యకర్తలకు చెబుతున్నారు. ఈ వేదిక ద్వారా నాయకులు, కారకర్తల సమన్వయం కుదర్చడమే ప్రధాన లక్ష్యంగా కనిపిస్తుంది. జనసేన పార్టీకి క్రియాశీలక సభ్యత్వం 24 లక్షల మార్క్ కు చేరుకుంది. నియోజకవర్గాల్లో జనసైనికులు ఎదుర్కొంటున్న సమస్యలు విని వాటిని పరిష్కరించడానికి ప్రయత్నం చేస్తామని హామీ ఇవ్వనున్నారు. . స్థానిక సంస్థల ఎన్నికల్లో పోలింగ్ బూత్ లెవెల్ లో నిలబడి పార్టీకి ఓటు వేయించాలంటే కార్యకర్త ఉత్సాహంగా ఉండాలి. ఆ ఉత్సాహం నింపేందుకే ఈ కార్యక్రమం అనుకోవాలి. పవన్ కళ్యాణ్ భుజానికి శస్త్ర చికిత్స కారణంగా స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో పాల్గొనే అవకాశం ఉండకపోవచ్చు. అందుకే ముందు నుంచే కార్యకర్తలను ఎన్నికలకు సమాయత్తం చేయాలంటే వారి సమస్యలను అడిగి తెలుసుకుని, వారికి నాయకత్వం దగ్గరగా ఉందని భరోసా ఇవ్వగలిగితే చాలా వరకూ ప్రయోజనం ఉంటుంది. అందుకే చర్చా వేదిక ద్వారా కార్యకర్తలకు పార్టీని మరింత దగ్గరకు చేర్చే ప్రయత్నం చేస్తున్నారు.

VOLUME:1 ISSUE: 1
సంపుటి : 1 సంచిక : 1
ప్రజా కలం PRAJA KALAM
ఆదివారం,జూలై 26, 2026
Sunday, 26 july, 2026



## బేబీ బంప్‌తో స్టన్నింగ్ లుక్... రెడ్ బీచ్ డ్రెస్‌లో ఆకట్టుకున్న 'సామజవరగమన' బ్యూటీ

తెలుగు ప్రేక్షకుల గుండెల్లో సామజవరగమన' సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న మలయాళ ముద్దుగుమ్మ రెబా మోనికా జాన్. తన క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్, సహజమైన నవ్వుతో సౌత్ ఇండియాలో ప్రత్యేకమైన క్రేజ్ సంపాదించుకున్న ఈ నటి, తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేసిన కొన్ని ఫోటోలతో సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. థాయిలాండ్‌లోని పుకెట్ బీచ్ రిసార్ట్‌లో రెడ్ కలర్ ప్రింటెడ్ మ్యాక్సీ డ్రెస్ ధరించి, తన బేబీ బంప్‌ను చూపిస్తూ ఆమె దిగిన ఫోటోలు ఇప్పుడు ఇంటర్నెట్‌లో తెగ వైరల్ అవుతున్నాయి. ఆ హీరోయిన్ స్ట్రాంగ్ మెసేజ్ పెళ్లి తర్వాత కూడా కెరీర్‌లో దూకుడు: మోడలింగ్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న రెబా మోనికా జాన్ ట్రెడిషనల్ శారీస్ అయినా, మోడ్రన్ వెస్ట్రన్ వేర్ అయినా చాలా స్టైలిష్‌గా క్యారీ చేస్తుంది. ఈమె 2022 జనవరిలో తన చిరకాల మిత్రుడు జోమోన్ జోసెఫ్‌ను వివాహం చేసుకున్నారు. ఇక ఇక పెళ్లి తర్వాత కూడా సినిమాల్లో ఎంతో యాక్టివ్‌గా ఉంటున్న ఈ బ్యూటీ, తెలుగులో సామజవరగమన తో పాటు మృత్యుంజయ్, మ్యాడ్ స్క్వేర్ వంటి క్రేజీ చిత్రాలతో టాలీవుడ్‌లో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ప్రస్తుతం ప్రెగ్నెంట్‌గా ఉన్న రెబా, ద నాకా పుకెట్ రిసార్ట్‌లో వెకేషన్‌ను ఫుల్‌గా ఎంజాయ్ చేస్తోంది. అక్కడ బీచ్ ఒడ్డున వైబ్రెంట్ రెడ్ ప్రింటెడ్ స్ట్రాపీ మ్యాక్సీ



బీచ్ డ్రెస్ ధరించి సరికొత్తగా ఫోటోలకు పోజులిచ్చింది. హై లెగ్ స్లిట్ ఉన్న ఈ డ్రెస్‌లో ఆమె తన మెటర్నిటీ లుక్‌ను ఎంతో కాన్ఫిడెంట్‌గా ప్రదర్శించింది. ఇక ఇక ఆమె ముఖంలో కనిపిస్తున్న ప్రెగ్నెన్సీ గ్లో చూసి అభిమానులు మురిసిపోతున్నారు. "ప్రెగ్నెన్సీ గ్లో అనేది నిజంగానే అద్భుతం" అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. తన బేబీ బంప్ ఫోటోలను షేర్ చేస్తూ రెబా మోనికా జాన్ ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన క్యాప్షన్ కూడా అందరినీ ఆకట్టుకుంటోంది. "సమయం ఇంత వేగంగా ఎలా గడిచిపోయింది? బేబీ బంప్‌తో గడిపే చివరి కొన్ని రోజులు ఇవి" అంటూ ఆమె ఎమోషనల్ అయ్యింది. ఇక త్వరలోనే మాతృత్వపు తీపి అనుభూతిని పొందబోతున్న తరుణంలో ఆమె ముఖంలోని ఆనందం ఈ ఫోటోలలో స్పష్టంగా కనిపిస్తోంది. రెబా షేర్ చేసిన ఈ బ్యూటిఫుల్ ఫోటోలు చూసి ఫ్యాన్స్, సెలబ్రిటీలు ఆమెకు పెద్ద ఎత్తున కంగ్రాట్స్ చెప్తున్నారు. ఈ ప్రెగ్నెన్సీ సమయంలో జాగ్రత్తగా ఉండాలంటూ అభిమానులు కామెంట్ల సెక్షన్‌లో ప్రేమను కురిపిస్తున్నారు. సాంప్రదాయ దుస్తుల్లో రాచరికపు అందాన్ని వలకబోసే ఈ సామజవరగమన బ్యూటీ, ఇప్పుడు ప్రెగ్నెన్సీ లుక్‌లోనూ అంతే స్టైలిష్‌గా మరియు క్యూట్‌గా కనిపిస్తూ అందరి హృదయాలను గెలుచుకుంటోంది.


## బ్యూటీ కాదు... సెల్ఫ్ రెస్పెక్ట్ ముఖ్యం!

సినీ పరిశ్రమలో హీరోయిన్లపై ఉండే ఒత్తిడి గురించి నటి సమీరా రెడ్డి చేసిన సంచలన వ్యాఖ్యలు ఇప్పుడు సమాజంలో ఒక కొత్త చర్చకు దారితీశాయి. కెరీర్ ప్రారంభంలో ఇండస్ట్రీ సృష్టించిన ఇన్సెక్యూరిటీ నుండి బయటపడటానికి, తనను తాను పూర్తిగా అంగీకరించడానికి ఆమెకు 40 ఏళ్ల వయసు దాటాల్సి వచ్చింది. 20 ఏళ్ల వయసులో సమాజం, కెరీర్ పెట్టే కృత్రిమ అందాల ఒత్తిళ్లకు లొంగిపోయే మహిళలు.. వయసు పెరిగే కొద్దీ మానసికంగా ఎంత స్ట్రాంగ్ అవుతారో చెప్పడానికి సమీరా జీవితమే ఒక పెద్ద ఉదాహరణ. బాహ్య సౌందర్యం కంటే 'ఆత్మగౌరవం' ముఖ్యమనే స్వేచ్ఛను సాధించడంలో వయసు ఒక ఆయుధంగా ఎలా మారుతుందో ఆమె మాటలు ద్వార తెలుస్తుంది. సమీరా రెడ్డి తన తొలి చిత్రం 'మైనే దిల్ తుజ్కో దియా' రోజులను గుర్తు చేసుకుంటూ.. తన సహజ రూపాన్ని మార్చడానికి ఇండస్ట్రీ ఎంత ఒత్తిడి తెచ్చిందో ఆవేదన వ్యక్తం చేశారు. మేకప్ ద్వారా ఆమె రంగును రెండు మూడు షేడ్స్ తెల్లగా మార్చేవారట. అంతేకాదు, తోటి హీరోల కంటే తాను పొడవుగా కనిపిస్తానేమో అని భయంతో నడుస్తున్నప్పుడు వంగి నడిచేదాన్ని అని ఆమె చెప్పారు. ఇక హీరో ఆధిపత్యం కోసం ఒక నటి తన సహజత్వాన్ని ఎంతగా చంపుకోవాల్సి వస్తుందో ఈ విషయాలు నిరూపిస్తున్నాయి. తన సహజ రూపం ఇండస్ట్రీకి సరిపోదనే అభద్రతాభావంతో సమీరా రెడ్డి ఏళ్ల తరబడి ప్యాడెడ్ బ్రాలు, బమ్ ప్యాడ్స్, రంగురంగుల కాంటాక్ట్ లెన్స్‌లు వాడాల్సి వచ్చింది. బరువు తగ్గిన తర్వాత కూడా నీ శరీరం సరిగ్గా లేదంటూ కాస్ట్యూమ్ డిజైనర్లు, మహిళా అసిస్టెంట్ డైరెక్టర్లు కూడా కామెంట్లు చేసేవారట. ఇక 20 ఏళ్ల వయసులో ఉండే అమాయకత్వం, కెరీర్ లో నిలదొక్కుకోవాలనే ఆరాటం వల్ల మహిళలు ఇలాంటి అవాస్తవిక బ్యూటీ స్టాండర్డ్స్ బందీలుగా మారిపోతుంటారు. సమీరా చాల కాలం దాదాపు 14 ఏళ్ల తర్వాత 'ఆఖరి సవాల్' చిత్రంతో హిందీ సినిమాలోకి రి ఎంట్రీ ఇవ్వనుంది. ఇక ఇప్పుడు తన 40ల వయసులోకి వచ్చాకే ఈ ఇన్-సెక్యూరిటీస్ నుండి బయటపడ్డానని స్పష్టం చేశారు. వయసు పెరగడం అనేది మహిళలకు కేవలం శారీరక మార్పు కాదు, అది ఒక మానసిక ఆయుధం. 40లలోకి అడుగుపెట్టాక సమాజం ఏమనుకుంటుందో అనే భయం పోయి, 'నేను ఎలా ఉంటే అలాగే ఉంటాను' అనే సెల్ఫ్ రెస్పెక్ట్, స్వేచ్ఛ మహిళల్లో పెరుగుతాయి.

## జక్కన్న ప్లాన్ ఏంటి.. ప్రియాంక కూడానా?

టాలీవుడ్ స్టార్ డైరెక్టర్ గా భారీ పాపులారిటీ సొంతం చేసుకున్న రాజమౌళి గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. సింహాద్రి, స్టూడెంట్ నెంబర్ వన్ చిత్రాలతో దర్శకుడిగా తనను తాను ప్రూవ్ చేసుకున్న ఈయన ఇప్పుడు ఏకంగా ఆస్కార్ వేదికలపై కూడా సందడి చేస్తున్నారు. ప్రాంతీయంగా సినిమాలు , సీరియల్స్ కి దర్శకత్వం వహించిన రాజమౌళి.. నేడు గ్లోబల్ స్థాయిలో తన దర్శకత్వ విలువలతో ప్రేక్షకులను తనవైపు తిప్పుకుంటున్నారనటంలో సందేహం లేదు. అలా ఆర్‌ఆర్‌ఆర్ చిత్రంతో సంచలనం సృష్టించిన రాజమౌళి.. ఇప్పుడు ఏకంగా వారణాసి సినిమాతో ఆస్కార్ అందుకోవడమే టార్గెట్ గా పెట్టుకున్నారేమో అనే కామెంట్లు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలోనే తాజాగా సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా గ్లోబల్ స్టార్ బ్యూటీ ప్రియాంక చోప్రా హీరోయిన్ గా చేస్తున్న చిత్రం వారణాసి. పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రం ఆఫ్రికన్ అడ్వెంచర్ నేపథ్యంలో ఏప్రిల్ 7వ తేదీన 2027 ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇకపోతే సాధారణంగా ఒక సినిమాలో ఒక సెలబ్రిటీ నటిస్తున్నారు అంటే వారి పుట్టినరోజు సందర్భంగా ఆ సినిమా నుండి వారి పాత్రలకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్ లను రివీల్ చేస్తారన్న విషయం అందరికీ తెలిసిందే. అందులో భాగంగానే నేడు గ్లోబల్ స్టార్ బ్యూటీ ప్రియాంక చోప్రా పుట్టినరోజు కావడంతో ఈ చిత్రం నుండి ఆమెకు స్పెషల్ విషెస్ చెబుతూ రెండు పోస్టర్లను రిలీజ్ చేశారు రాజమౌళి.

అయితే ఈ రెండు పోస్టర్లు చూసిన తర్వాత ఆడియన్స్ లో సరికొత్త అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అసలు విషయంలోకి వెళ్తే.. ప్రియాంక చోప్రా ఈ సినిమాలో మందాకిని అనే ఒక పవర్ఫుల్ యాక్షన్ పాత్రలో నటిస్తున్నట్లు ఆమె పోస్టర్ ను రిలీజ్ చేసి, ఆమె పాత్ర పై అంచనాలు పెంచిన విషయం తెలిసిందే. ఇక నేడు ఆమె పుట్టిన రోజు కావడంతో రాజమౌళి ఈ సినిమాలోని ఆమె పాత్రకు సంబంధించి 2 ఫోటోలను రిలీజ్ చేస్తూ.. ఈ విధంగా కొటేషన్ పంచుకున్నారు." ఆమె నవ్వినప్పుడు సౌందర్యం.. నవ్వనప్పుడు అగ్ని కణికం.. వారణాసిలో మందాకిని పాత్రలో ప్రియాంక చోప్రా" అంటూ ఆమె జాలీగా ఉన్న ఒక ఫోటోని మరొకవైపు కోపంతో భయంకరంగా చూస్తున్న మరొక ఫోటోని షేర్ చేశాడు రాజమౌళి. రాజమౌళి షేర్ చేసిన ఈ రెండు ఫోటోలను బట్టి చూస్తే ఇందులో ప్రియాంక చోప్రా ద్విపాత్రాభినయం పోషిస్తోందా అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మరికొంతమంది ప్రియాంక చోప్రా ఇందులో కవల పిల్లలుగా రెండు పాత్రలు పోషించబోతున్నారని కామెంట్లు చేస్తుంటే.. ఇంకొంతమంది ఒకటి విలన్ గా మరొకటి హీరోయిన్గా నటిస్తోంది కాబోలు అంటూ ఇలా ఎవరికి వారు తమ అభిప్రాయాలను వ్యక్తపరుస్తున్నారు.





## హిట్ కోసం రెండేళ్లు వెయిటింగ్.. ఇప్పుడు క్యూ కడుతున్నారా?

సినీ ఇండస్ట్రీలో టాలెంట్ ఒక్కటే సరిపోదు. దానికి తోడు సరైన విజయం అవసరమే. కొంతమందికి తొలి సినిమాతోనే స్టార్ డమ్ వస్తే, మరికొందరు హిట్ కోసం చాలా కాలం ఎదురుచూడాల్సి వస్తుంది. హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే జర్నీ దాదాపు అలాంటిదే. వరుస అవకాశాలు వచ్చినా, సరైన కమర్షియల్ సక్సెస్ మాత్రం దూరంగానే నిలిచింది. అయితే తాజాగా వచ్చిన లెనిన్ ఆమెకు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న రిలీఫ్ ఇచ్చినట్లు కనిపిస్తోంది. రవితేజ సరసన మిస్టర్ బచ్చన్ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన భాగ్యశ్రీ, తొలి చిత్రంతోనే తన అందం, స్క్రీన్ ప్రెజెన్స్ తో ఆకట్టుకుంది. సినిమా ఆశించిన రిజల్ట్ అందుకోకపోయినా, ఆమెకు మాత్రం మంచి గుర్తింపు వచ్చింది. దీంతో టాలీవుడ్ లో వరుస అవకాశాలు దక్కాయి. ఆ తర్వాత కింగ్‌డ మ్, కాంతా, ఆంధ్ర కింగ్ తాలూకా వంటి ప్రాజెక్టుల్లో నటించినా, ఆ సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో విజయాలు సాధించలేకపోయాయి. ఆ హీరోయిన్ స్ట్రాంగ్ మెసేజ్ సాధారణంగా ఇలాంటి పరిస్థితుల్లో హీరోయిన్ల కెరీర్ పై ఎఫెక్ట్ పడుతుంది. కానీ భాగ్యశ్రీ విషయంలో పరిస్థితి భిన్నంగా కనిపించింది. వరుస రిజల్ట్స్ అనుకూలంగా రాకపోయినా, దర్శక నిర్మాతలు ఆమెకు అవకాశాలు ఇస్తూనే వచ్చారు. దీనికి ప్రధాన కారణం ఆమెపై ఉన్న నమ్మకమేనని టాక్ వినిపిస్తోంది. తెరపై ఆమె కనిపించే తీరు, పాత్రలకు సరిపోయే లుక్, నటనలో చూపిస్తున్న డెవలప్మెంట్ వంటి అంశాలు ఆమెకు ప్లస్ అయ్యాయని అంటున్నారు. అందుకే సినిమాల రిజల్ట్స్ తో సంబంధం లేకుండా కొత్త ప్రాజెక్టుల్లో ఆమె పేరు వినిపిస్తూనే వచ్చింది. ఇలాంటి సమయంలో విడుదలైన లెనిన్ సినిమా భాగ్యశ్రీ కెరీర్ లో కీలక మలుపుగా మారింది. ఆ చిత్రంలో ఆమె నటనకు ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ లభించింది. ముఖ్యంగా సోషల్ మీడియాలో కూడా ఆమె పాత్ర గురించి పాజిటివ్ చర్చ సాగుతోంది. దీంతో కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, నటిగా కూడా తన స్టామినా నిరూపించుకుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికే ఆమె చేతిలో పలు చిత్రాలు ఉన్నట్లు సమాచారం. ముఖ్యంగా యంగ్ హీరోలు, మీడియం రేంజ్ చిత్రాల దర్శక నిర్మాతలు భాగ్యశ్రీని తమ ప్రాజెక్టులకు పరిశీలిస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. రెండేళ్లుగా సరైన హిట్ కోసం ఎదురుచూసిన హీరోయిన్ కు వరుస ఛాన్సులు వస్తున్నాయట. మరోవైపు శివకార్తికేయన్ హీరోగా తెరకెక్కుతున్న సేయోన్ చిత్రంతో భాగ్యశ్రీ కోలీవుడ్ లోకి అడుగుపెడుతోంది. తెలుగు సినిమాలే తన ఫస్ట్ ప్రిఫరెన్స్ అయినప్పటికీ, ఇతర భాషల్లోనూ అవకాశాలు రావడం ఆమె కెరీర్ కు మరింత బలం చేకూర్చే అవకాశం ఉందని చెప్పాలి. ఏదేమైనా హిట్ కోసం రెండేళ్లుగా ఎదురుచూసిన భాగ్యశ్రీకి లెనిన్ విజయం కొత్త జోష్ ఇచ్చినట్లు కనిపిస్తోంది. వరుస ఫ్లాపుల మధ్య అవకాశాలు కోల్పోకుండా ముందుకు సాగిన ఆమెకు, లెనిన్ మూవీ కెరీర్ లో టర్నింగ్ పాయింట్ గా మారుతుందా లేదా అన్నది రాబోయే చిత్రాల రిజల్ట్స్ పై ఆధారపడి ఉంటుంది. అయితే ప్రస్తుతం మాత్రం టాలీవుడ్ లో ఆమె పేరు మళ్లీ గట్టిగానే వినిపిస్తోంది.

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from 6-5-41/A, Arundelpet 5/1, Pasumalai Complex, 1st Floor, Guntur, Andhra Pradesh -522002 Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI. No. APTEL/26/A6182,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com